శ్రీ రవీంద్రనాథ్ ఠాకూర్ రచన....



# కరుణ

అనువాదం: మద్దిపట్ల సూరి


## భూమిక

అనుప్‌కుమారంత ధనవంతుడింకెవరూ లేరు ఊళ్లో.

ఆలయాలు నిర్మించటం, అతిథిశాలలు కట్టించటం, చెరువులు త్రవ్వించటం మొదలైన నానావిధ సత్కార్యాలకు ధనం ఖర్చు పెడుతూండేవాడతడు. అతడికి ఇనప్పెట్టెనిండా డబ్బు వుంది. ఊళ్లో కావలసినంత పేరువుంది. అందమైన కూతురుకూడా ఉంది. వయసులో ఉన్నన్నాళ్ళూ ఎంతో డబ్బు సంపాయించి, వృద్ధాప్యం వచ్చాక విశ్రాంతి తీసుకుంటున్నాడతడు. ఇప్పుడతడికి కూతుర్ని ఎవరికిచ్చి పెళ్లి చెయ్యటమా అన్న చింత ఒక్కటే. తగిన వరుడు దొరకకపోవటం—ముసలితనంలో అండగా ఉండే ఏకైక పుత్రికను పెళ్లిచేసి పరాయి యింటికి పంపించటం ఇష్టంలేకపోవటం—ఈ రెండు కారణాలవల్ల ఇవాళా రేపు అంటూ అనుప్‌కుమార్ ఏమయితేయేం కూతురు కింతవరకు పెళ్లి చెయ్యలేదు.

సఖులెవరూ లేకపోవటం—కరుణ కేమీ కష్టంగాలేదు. ఆమె భావ విహారిణి....క్షణమయినా విచారం అనేది లేకుండా ఊహా స్వప్నాల్లో రాత్రింబవళ్లు ఆనందంగా, హాయిగా గడిపివెయ్యగలదు. ఆమె కొక పెంపుడు పక్షి ఉంది. ఆ పక్షిని చేతపుచ్చుకొని, అంతఃపురం కొలను తీరంలో ఊహారాజ్యాన్ని నిర్మించుకుంటూ ఉంటుంది. ఉడుతలవెంట పరుగెడుతూ, నీళ్ల మీద పూలను తేలియాడిస్తూ, మట్టితో శివుణ్ణి తయారుచేస్తూ ఉదయం నుంచి సాయంత్రంవరకూ గడిపివేస్తూంటుంది. ఒక చెట్టును సఖిగానూ, ఇంకొక చెట్టును చెల్లెలిగానూ, మరొక చెట్టుని పుత్రికగానూ ఊహించుకుంటూ—వాటిని నిజంగా అంత ఆదరంగానూ చూస్తూ ఉంటుంది. వాటికి ఆహారం తెచ్చిపెడుతూ ఉంటుంది. పూలదండలు గ్రుచ్చి వేస్తూ ఉంటుంది. ఎంతో ఆపేక్ష ఒలకపోస్తూ ఉంటుంది. వాటి ఆకులు వాడిపోయినా, పూలు రాలిపోయినా చాలా బాధపడుతూ ఉంటుంది. సాయంత్రం తండ్రిదగ్గర విన్న కథలన్నీ తోటలో పక్షులకు వినిపిస్తూ ఉంటుంది. కరుణ తన జీవితపు ఉషఃకాలాన్ని హాయిగా ప్రారంభించింది. ఆమె తండ్రీ, ఇరుగుపొరుగువారు కూడా ఆమె యెప్పటికీ ఇలాగే గడిపివేస్తుంది కాబోలు అనుకున్నారు.

కాని కొన్నాళ్లు పోయాక కరుణకు ఒక సహవాసి దొరికాడు. అనుప్ అనుయాయుడైన ఒక వృద్ధబ్రాహ్మడు చనిపోయేప్పుడు తన అనాథ పుత్రుడైన నరేంద్రుణ్ణి అనుప్‌కుమార్ చేతుల్లో అప్పగించాడు. నరేంద్రుడు అనుప్ యింట్లోనే ఉంటూ చదువుకునేవాడు. కొడుకులులేని అనుప్ నరేంద్రుణ్ణి ఎంతో ఆపేక్షగా చూసేవాడు. నరేంద్రుడి ముఖకవళిక అంత ప్రీతిదాయకంగా ఉండేదికాదు. కాని అతడు ఎవరితో కలిసి తిరుగడు, ఆడుకోడు, మాట్లాడడు కనుక చాలా మంచివాడన్న ప్రసిద్ధికూడా ఉంది. నరేంద్రుడంత బుద్ధిమంతుడు, నిదానస్థుడు, తెలివైనవాడు లేడని ఊరంతా మ్రోగిపోయింది. ఆ వీధిలో వృద్ధులు తమ పిల్లలుచేసే ప్రతిదానికీ నరేంద్రుణ్ణి ఉదాహరణ తీసుకురావటం పరిపాటి అయింది. కాని "నరేంద్ర్ : నువు మంచిపిల్లవాడివి కా"దని నేను



మొదట్లోనే చెప్పాను. ఎంచేతనో అతడి ముఖం నాకు నచ్చేది కాదు. అసలుసంగతి ఏమిటంటే ఈ ఆబాలగోపాలానికి నచ్చిన బుద్ధిమంతుడు నాకుమాత్రం నచ్చలేదు.

అనుప్‌కుమార్ స్థాపించిన పాఠశాల్లో రఘునాథ సార్వభౌము డని ఒక గురువుగారున్నారు. అతడికి నరేంద్రుడంటే అపరిమిత మయిన అపేక్ష. నరేంద్రుణ్ణి తరచు తన యింటికి తీసుకువెడు తూండేవాడు. అనుప్ యెదుట అతణ్ణి తెగ పొగడేవాడు.

ఈ నరేంద్రుడే కరుణకు సహవాసి కరుణ నరేంద్రుడితో ఆ కొలను ఒడ్డుకి వెళ్లి బొమ్మరిళ్లు కట్టేది. పూలదండలు గ్రుచ్చేది. తండ్రివద్ద విన్న కథలన్నీ ఈ నరేంద్రుడికే చెపుతూ ఉండేది. ఊహాశీలినియైన బాలిక ఊహలన్నీ నరేంద్రుడిమీదే కేంద్రీకృత మయినాయి. కరుణ నరేంద్రుణ్ణి ఎంతగా ప్రేమించేదంటే—అతడు కాసేపు కనపడకపోతే ఆమెకి యేమీ తోచేదికాదు. నరేంద్రుడు పాఠశాలకి వెడితే—తన పెంపుడు పక్షిని తీసుకుని, గుమ్మంలో అతడికోసం ఎదురుచూస్తూ నుంచునేది. అంతదూరాన ఉండగానే నరేంద్రుణ్ణి చూసి, గబగబా అతణ్ణి చెయ్యిపట్టుకుని, ఆ కొలను ఒడ్డున కొబ్బరిచెట్ల క్రిందికి తీసుకువెళ్లేది. తాను ఊహించుకున్న అద్భుతమయిన కథ లెన్నో చెప్పేది.

నరేంద్రుడు కొంచెం పెద్దవాడవటంతో అతడు కలకత్తాలోని ఇంగ్లీషు స్కూల్‌కి పంపబడ్డాడు. కలకత్తా గాలి తగలగానే ఈ పల్లెటూరి కుర్రవాడికి కొన్ని పాడుబుద్ధులు పుట్టాయి. పుస్తకాలు కొనుక్కోటానికి, స్కూలు జీతం కట్టటానికి వచ్చిన డబ్బుని నరేంద్రుడు పొగత్రాగుడికి ఖర్చుపెట్టుకుంటున్నాడు హాయిగా—అని తెలిసింది. ప్రతి శనివారం తన ఊరుకి వెళ్లాలని నిబంధన ఉంది. కాని, శనివారంరోజున కలకత్తా విడిచిపెట్టి వెళ్లటం—కంఠానికి ఉరిపోసుకోవటం లాంటిదే అని అతడు స్నేహితుల వల్ల తెలుసుకున్నాడు. కుర్రవాడు—ఇంటికి వెళ్ళినప్పుడు వారంలో రెండురోజులు ఇక్కడే ఉంటే—తాను పరీక్షలో ఉత్తీర్ణుణ్ణి కాలేనని అనుప్‌కి నచ్చచెప్పాడు. అనుప్ నరేంద్రుడికి చదువుమీద ఉన్న ఆసక్తిని చూసి, ఇతడు పెద్ద అయితే డిప్యూటీ మేజిస్ట్రేట్ అవుతా డని మనసులో గట్టి నమ్మకం పెట్టుకున్నాడు. అప్పుడు నరేంద్రుడు నెలకి రెణ్ణెల్లకి ఒకసారి వస్తూ ఉండేవాడు. కాని ఈ నరేంద్రుడిహ ఆ వెనుకటి నరేంద్రుడు కాడు. తాంబూల సేవనంతో పెదవు లెర్రగా చేసుకుని, తలకు రుమాలు కట్టుకుని, ఇటూ అటూ ఉన్న మిత్రుల బుజాలమీద చేతులేసుకుని, కానిస్టే



బిల్స్‌కు హడలుపుట్టిస్తూ కలకత్తా వీధుల్లో తిరిగే నరేంద్రుడు—బండిలో పెద్దలు కన్పిస్తే బొటనవ్రేలు చూపిస్తూ—దారేపోతున్న అమాయకపు బాటసారులమీద దుమ్ము విసిరి, ఏమీ ఎరగనట్లుగా ఆకాశంలోకి చూసే ఇతడు—ఒట్టి అమాయకుడు, ఇంటికి రాగానే అనుప్‌కి సాష్టాంగ ప్రణామంచేసేవాడు. ఏదైనా అడిగితే ఎంతో నమ్రతగా సమాధానం చెప్పేవాడు—అనుప్ అటూయిటూ తిరిగే గారిలో ఏ వెబ్‌స్టర్ నిఘంటువో సదా చూసుకుంటూ కూర్చునే ఆ నరేంద్రుడు కాడు....

నరేంద్రుడు చాలారోజులకింటికి తిరిగివస్తే కరుణ ఆనందంతో పొంగిపోయేది. నరేంద్రుణ్ణి పిలుచుకువెళ్లి ఎన్నో కథలూ కబుర్లు చెప్పేది. ఆమెకి చెప్పటంలో ఎంత ఉత్సాహం ఉండేదో, వినే అతడికి అంత ఉత్సాహం ఉండేదికాదు. ఎవరివల్లనుంచిఅయినా ఒక క్రొత్తవిషయం విన్నదంటే—నరేంద్రుడు కన్పించనంతవరకు ఏదో పెద్దబరువు మోస్తున్నట్లు 'ఫీ'లయేది. కాని కరుణయీ ప్రవర్తన ఈ బాల్యచాపల్యం చూస్తూంటే నరేంద్రుడికి నవ్వొచ్చేది. ఒక్కొక్కప్పుడు విసుక్కుని పారిపోవటానికి ప్రయత్నించేవాడు. నరేంద్రుడు మిత్రుల వద్ద కరుణ ప్రసంగం వచ్చినపుడల్లా రకరకాలుగా ఎగతాళిచేసేవాడు.

నరేంద్రుడింటికి రాగానే రఘునాథ పండితుడు చాలా కంగారు పడుతున్నాడివాళ. అందాకా యెందుకు ? ఆ రోజు సాయంత్రం కూడా నరేంద్రుడింటికి వచ్చేసరికి రఘునాథ పండితుడే అందరి కంటె ఎక్కువ ఆత్రంగా ఎదురుచూస్తూ ఉన్నాడు. అంతేకాదు, ఆ రోజున సాయంత్రంకూడా ఇంట్లోంచి బయలుదేరి, వెదురు గుబుళ్లున్న కాలిదారిని రామనామాన్ని జపించుకుంటూ నరేంద్రుణ్ణి కలుసుకోటానికి వెళ్లాడు. నరేంద్రుణ్ణి ఆప్యాయంగా ఇంటికి ఆహ్వానించి తీసుకువచ్చి, యోగక్షేమాలన్నీ వివరంగా అడిగి తెలుసుకొన్నాడు. ఈపండితుడి ధోరణిచూసే ఒకరిద్దరు మిత్రులు అతడి పిలక కత్తిరించమని నరేంద్రునికి సలహాయిచ్చారు. ఈ విషయం మీద గంభీరంగా ఎన్నోసలహాలూ. కుయుక్తులూకూడా సూచించబడ్డాయి. కాని నరేంద్రుడికి ఊళ్లో అంతపలుకుబడి లేకపోవటంవల్ల—పండితుని పిలక యిప్పటివరకు చెక్కుచెదరకుండా నిలిచిఉంది. నరేంద్రుడిలా ఊళ్లో ఆదరాన్ని—పరాయినగరంలో ఆమోదాన్ని పొందుతూ పెరిగినాడు.

నరేంద్రుడి బాల్యంగతించింది. అనుప్ మరీవృద్ధుడయినాడు. చూపు ఆనటంలేదు. పక్కమీదినుంచి లేవలేని స్థితిలోకి వచ్చాడు.



కరుణను ఒక్క క్షణంకుడా తనదగ్గరనుంచి కదలి వెళ్ళనీయడు. అనుప్ కిరోజులు నిండుతూ ఉండటంతో, అతడు నరేంద్రుణ్ణి కలకత్తానుంచి రప్పించాడు. అంత్యసమయంలో నరేంద్రుణ్ణి, పండితుని పిలిపించి, కూతుర్ని వారిచేతిల్లో అప్పగించి ప్రాణం వదిలాడు.

అనుప్ మరణానంతరం సార్వభౌములుగారు స్వయంగా పౌరోహిత్యం వహించి—కరుణా నరేంద్రుల వివాహం జరిపించాడు....

౧

నేను అనుకున్నట్లే జరిగింది. నరేంద్రు డెలాంటివాడయిందీ ఇప్పటికి పూర్తిగా తెలిసివచ్చింది ఊళ్లోవాళ్లందరికీ అభాగ్యురాలైన కరుణ ఎన్నికష్టాలు పడవలసివచ్చేదీకూడా గ్రహించారు. కాని, ఈ రెండింటిలో ఏ ఒక్కటీ గ్రహించనివాడు రఘునాథ పండితుడు ఒక్కడే.

కరుణ ఇప్పుడు దిగులుగా ఉంటోంది. ఏకాంతంగా ఉండే తోటలో ఉత్సాహంతో ఆడుకుంటూ ఉండవలసినది. గుండెలకి హత్తుకుని పెంపుడుపక్షితో ఎన్నో ముచ్చట్లు చెప్పుకుంటూ ఉండవలసినది, ఒడినిండా పూలు రాసులురాసులుగా పోసుకుని, కాళ్ళు బారచాచుకుని పాటలు పాడుకుంటూ దండలు గ్రుచ్చుకుంటూ ఉండవలసినది, తాను మనసు పడ్డవానిముఖంలోకి చూస్తూ—ఏదో తెలియనిఆనందంలో తేలిపోతూ ఉండవలసినది—చాలా దిగులుగా ఉంటోంది. తాననుకున్నట్లు ఏమీ జరగటంలేదు. నరేంద్రుణ్ణి అంతగా ప్రేమించి. అతడు కన్పించగానే ఆడుకోవటం మరిచి, పూలు గ్రుచ్చటంమాని. పక్షిని వదిలేసి. పరుగెత్తుకువచ్చే కరుణని చూస్తే—నరేంద్రు డెందుకు అంత కంటగించుకుంటాడు ? కరుణ కిలకిల నవ్వుతూ వచ్చి ఏదో మాట్లాడబోతే కనుబొమలు చిట్లించి ఎందుకంత ముఖం చిట్లించుకుంటాడు ? కరుణ అతణ్ణి దగ్గిర కూర్చోమని ఎంతగానో బ్రతిమాలుకుంటుంటే—అత డెందుకు ఏదో మిషపెట్టుకుని లేచిపోతాడు ? నరేంద్రుడామెతో ఎంతో నిరుత్సాహంగా, ఎంతో నీరసంగా మాట్లాడుతాడు. ప్రతిమాటకీ కొరకొరలాడుతూనే చెపుతాడు జవాబు. ఏ పని చేయబోయినా ఏదో ప్రభువులాగానే ఆదేశిస్తాడు. దాంతో ఇహ ఆమె ఆటల ఆడుకోవటం కాని. పూలు గ్రుచ్చుకోటం కాని, పెంపుడు పక్షితో ముచ్చట్లాడుకోవటం కాని సాగనే సాగదు....

అసలు విషయం ఇది. కరుణ. నరేంద్రుల మధ్య ఎన్నటికీ పొత్తుకలియదు. ఇద్దరివీ విభిన్న మనస్తత్వాలు. కరుణ ఎంతో ప్రేమగా మాట్లాడే పరస్పర సంబంధం లేని మాటల్లో అతడికి మాధుర్యం ఏమీ కన్పించటం లా. రెప్ప వాల్చకుండా, అంతం లేని ప్రేమతో ఆమె చూసే చూపులో అతడికి కళ్లకి జిగేల్‌మనే లావణ్య మేమీ కన్పించటం లా. పొంగిపొరలే సెలయేరు లాటి, ఆమె సౌందర్యంలో అనిర్వచనీయ మాధుర్య మేమీ గోచరించటం లేదతడికి. కాని అమాయకురాలైన కరుణకి అదంతా ఏం తెలుసు ? ఆమె చిన్ననాటినుంచి నరేంద్రుడి గుణాల్నే చూసింది కాని. అతడి దోషాల వైపుకి ఆమెదృష్టి పోనేలేదు. కాని కరుణ కేమిటి ఇలాంటి క్లిష్టస్థితి వచ్చిపడింది ? ఆమె ఎలా చూసినా తన ఆశలు తీర్చుకోలేక పోతోంది. ఆమె తనివితీరా నరేంద్రుని చూడలేక పోతోంది. తనివి తీరా తన మనసులోని ఊహల నన్నిటినీ నరేంద్రుడితో చెప్పుకోలేక పోతోంది. ఆమె అన్నీ చెపుతూనే ఉంటుంది. కాని చివరికి ఏమీ చెప్పలేక పోయాను. అని అనిపిస్తూ ఉంటుం దామెకి.

ఒక రోజున నరేంద్రుడు దుస్తులు మార్చుకోవటం చూసి, 'ఎక్కడికి వెడుతున్నారు?' అని అడిగింది కరుణ. "కలకత్తా" అని చెప్పాడు నరేంద్రుడు.

"కలకత్తా ఎందుకు వెళ్ళడం?"

నరేంద్రుడు కనుబొమలు చిట్లించి, అటు గోడ వైపుకి తిరిగి "పనిలేక పోతే ఎన్నటికీ వెళ్ళను" అన్నాడు. ఒక పిల్లికూన పరుగుతీసింది. కరుణ దాన్ని పట్టుకోటానికి పరుగెత్తింది. కాని ఎంతసేపు పరుగెత్తినా దాన్ని పట్టుకోలేక పోయింది. చివరికి మళ్ళీ గదిలోకి తిరిగి వచ్చి—"ఇవాళ మిమ్మల్ని ఒకవేళ కలకత్తా వెళ్ళనియ్యకపోతే?" అన్నది. నరేంద్రుడామెచేతుల్ని తన బుజాల మీదినుంచి త్రోసివేసి, "తప్పుకో. చూడు. కాస్త అయితే—కోటు కాస్తా నలిగిపోయేది" అన్నాడు.

"ఇదుగో మీరు కలకత్తా వెళ్లొద్దు. రఘునాథ పండితులు మిమ్మల్ని వెళ్లవద్దని చెప్పమన్నారు" అన్నది కరుణ. నరేంద్రుడేమీ సమాధానం చెప్పకుండా, ఈల వేసుకుంటూ తల దువ్వుకోవటం మొదలెట్టాడు. కరుణ గబగబా గదిలోంచి వెళ్లిపోయి, అత్తరు సీసా ఒకటి తీసుకువచ్చి, నరేంద్రుడి ఉత్తరీయానికి రాసింది కాస్త. నరేంద్రుడు కలకత్తా వెళ్ళిపోయాడు. కరుణ ఒకటి రెండు సార్లు వారించబోయింది. కాని నరేంద్రుడు 'ఆఁ' 'ఊఁ' అని ఏమీ పలకకుండానే కూనిరాగాలు తీసుకుంటూ వెళ్ళిపోయాడు. నరేంద్రుడు కనుచాటు అయేంతవరకు కరుణ అలా చూస్తూనే నుంచుంది. నరేంద్రుడు వెళ్ళిపోయాక ఆమె దిండుమీద ముఖం పెట్టుకుని ఏడ్చింది. కొంతసేపు అలా యేడ్చి, మనసులోని ఉద్వేగం కొంచెం శాంతించాక, కళ్ళు తుడుచుకుని, పెంపుడు పక్షిని తీసుకుని, అంతఃపురం తోటలోకి పూలు గ్రుచ్చుకోటానికి వెళ్ళింది.

బాలికా స్వభావం వల్ల—విచారమయినా, కోపమయినా ఆట్టేసేపు ఉండవు ఆమె హృదయంలో. నవ్వుతూన్నప్పుడు ఆమె విశాల నేత్రాల్లో లావణ్యం తొణికిస లాడుతున్నట్లే—ఏడుస్తున్నప్పుడు కూడా ఆ యేడుపుని ఛేదించుకుని చిరునవ్వు రేకలు తొంగి చూస్తాయి ఆమె ముఖంలో. ఏమయినా కరుణ చపల ప్రవృత్తి వల్ల ఇరుగు పొరుగు ఆడపిల్లల్లో 'సిగ్గు-శరం' లేనిదనే అపఖ్యాతి మాత్రం పుట్టింది. 'అంత గడేకారితన మేమిటి మరీను?' అని అనుకునేవాళ్ళు అందరూ.

తనని గురించి లోపలు వేసే ఇలాంటి నిందలన్నీ కరుణకు తమ యింట్లో ఎంతో కాలంనుంచి ఉన్న దాసి భవిద్వారా తెలిసేవి. కాని వాటివల్ల తనకి వచ్చేదీ పోయేదీ ఏముంది? ఆమె అలాగే ఉల్లాసంగా తిరుగుతూ ఉండేది. భవిమెడ కావిలించుకుని అలాగే కిలకిల లాడేది. తన పెంపుడు పక్షితో అలాగే ముచ్చట లాడేది. కాని ఆ ప్రఫుల్ల హృదయం ఒక్కసారి విషాదాఘాతానికి గురి అయితే ఎప్పుడూ కళకళలాడుతూ చీకూ-చింతా యెరుగకుండా అమాయక శిశుముఖంలా ఉండే ఆమె ముఖం ఒక్కసారి విచారాంధకారంతో వన్నె తరిగితే—ఆ బాలిక ఇంక పెరికివేయబడిన తీగెలాగా శాశ్వతంగా జీవచ్ఛవమైపోవచ్చు. వసంత వాయువీజనవల్ల కాని, వర్షాకాలపు వృష్టి సేచనవల్ల కాని పునరుజ్జీవితం కాజాలదు.

అనుప్‌వల్ల సంక్రమించిన సంపదతో నరేంద్రుడికి పల్లెటూరిలో సుఖంగానే గడచిపోతుంది. అనుప్ బ్రతికి ఉన్నప్పుడు పొలాల మీద వచ్చేపంట, చెరువుల్లో దొరికే చేపలు, తోటల్లో పండే పళ్లు, కాయగూరలూ సమృద్ధంగా ఉండేవి కనుక తిండి ఖర్చు ఆట్టే ఉండేది కాదు. దుర్గోత్సవాలు ఘనంగా జరిపేవాడు. నిత్యనైమిత్తిక పూజలూ పునస్కారాలూ, ఆతిథ్యపు ఖర్చూ తప్ప వేరే ఖర్చేమీ ఉండేది కాదు. అనుప్ చనిపోయిం తర్వాత అతిథిశాల మాంసాహార శాలగా మారింది. యాచక బ్రాహ్మణుల దాడిని ఎదుర్కొనటానికి నలుగురు దర్వాన్‌లని పెట్టవలసి వచ్చింది. వారు వచ్చే బ్రాహ్మల కందరికీ అర్ధచంద్ర ప్రహార సత్కారాలు అమలు పరిచారు. వచ్చిన ప్రతిభట్టాచార్యుల వారూ నరేంద్రుణ్ణి సర్వనాశనమైపోతావని శపించిన వారే. నరేంద్రుడు స్వంత ఖర్చుతో ఊళ్లో ఒక డిస్పెన్సరీ ఏర్పాటు చేయించాడు. అది లేకపోతే బ్రాందీ దొరికే వీలుండదని.... సర్కారు వారి చవక దుకాణం నుంచి రాయ్‌బహదూర్‌కి తాము కొనుక్కోటానికి గుర్రప్పందాల చందా పుస్తకంలో వెయ్యిరూపాయ లివ్వటానికి సంతకం పెట్టాడు. ఇంకా ఇలాంటి సత్కార్యా లెన్నో చేశాడు. వీటిమీద అమృత బజార్ పత్రికా విలేఖరి ఒకడు ఆందోళన లేవతీస్తూ ఒక ఉత్తరం కూడా రాశాడు. దానిమీద వాద ప్రతివాదుల దుమారం జోరుగా రేగింది. చివరకు నిష్కారణంగా అపవాదు వెయ్యటం పెద్దమనిషి తరహా కాదని తర్క-వితర్కాలు జరిగి చల్లారాయి.

నరేంద్రుణ్ణి గ్రామ ప్రజలు వెలివేశారు. కాని నరేంద్రుడు దాన్ని అసలు పట్టించుకోనే లేదు. సంఘసంస్కర్త అయిన నరేంద్రుని మిత్రుడొకడు అతడి 'మోరల్ కరేజ్'ని గురించి సభలో పెద్దహడావిడి చేసి పారేశాడు.

నరేంద్రుడు బాగ్‌బజారులో ఒక యిల్లు అద్దెకు తీసుకున్నాడు. కాశీపూర్‌లో ఒక తోటను కొన్నాడు. ఒక రోజున బాగ్‌బజారులోని యింట్లో ప్రొద్దున్నే నరేంద్రుడు టీ త్రాగుతూ కూర్చున్నాడు. నరేంద్రుడి ప్రాతఃకాలానికి, మన ప్రాతఃకాలానికి చాలా తేడా ఉంది. ఆనాడు ఆఫీసుకు వెడుతూ వెళ్ళిచూస్తే నరేంద్రుడింకా గుర్రుకొడుతూ నిద్దరోతున్నాడు. ఆ రోజు శనివారం అవటంవల్ల మధ్యాహ్నం రెండు గంటలకి మళ్ళీ ఆఫీసునుంచి తిరిగి వస్తూ చూస్తే, అప్పుడే లేచి కళ్లు నులుముకుంటున్నాడు. మనస్సులో మాత్రం ఇంకొక నిద్రపోతే బాగుండునని ఉంది. ఏమయితే యేం నరేంద్రుడిలా టీ త్రాగుతూ కూర్చుని ఉండగా సంఘ సంస్కర్త అయిన గదాధరబాబు, కవితా కుసుమ మంజరి రచయిత కవిరత్న స్వరూప చంద్రబాబు వేంచేశారు. తొలిపలకరింపు లయిపోయాక అందరూ టీ త్రాగుతూ కూర్చున్నారు.

ఆ సంగతులూ ఈ సంగతులూ, మాట్లాడుకున్నాక గదాధర బాబు—"చూడండి మహాశయా. 'మన దేశంలోని స్త్రీలస్థితి చాలా శోచనీయం' అన్నాడు. 'శోచనీయం' అనే మాటకి అర్థమేమిటని నరేంద్రుడు ప్రశ్నించాడు. 'Deplorable'అని సమాధానం చెప్పాడు స్వరూప చంద్రబాబు. నరేంద్రుడికి రెండు మాటలూ ఒకటిగానే ఉన్నాయి. 'వారి అంతఃపురం కుడ్యాల్ని భేదించడం మన కర్తవ్య మిప్పుడు' అన్నాడు గదాధరబాబు వెంటనే నరేంద్రుడు గంభీరంగా 'అది ఎంతవరకు సాధ్యమో చూడాలి. అలాంటి అవకాశమే ఉంటే అంతఃపురం గోడల్ని పడకొట్టాలనే ఉద్దేశం చాలాసార్లు కలిగింది నాకు. కాని పోలీసులు దానికి చాలా అభ్యంతరం చెపుతారు. పడకొట్టటం మాట అలా ఉంచండి. నేను ఒకసారి ఓ అంతఃపురం గోడ దూకబోయాను. దానికి మేజస్ట్రీట్ నా మీద చాలా కన్నెర్ర చేశాడు," అన్నాడు. ఎంతోసేపు చర్చ జరిగాక గదాధరుడు, స్వరూపుడు ఇద్దరూ కలసి. గోడలు పడకొట్టటం అంటే నిజంగా పడకొట్టటం కాదని స్త్రీలకు అంతఃపురాల నుంచి విముక్తి కలిగించడమే దాని తాత్పర్యమని నరేంద్రుడి కెలాగో నచ్చ చెప్పారు.

'ఎంత మంది వితంతువులు ఏకాదశి ఉపవాసాలకు విలపిస్తున్నారో, ఎంతమంది కులీనలైన భార్యలు భర్తజీవించి ఉండగా వైధవ్య దుఃఖాన్ని సహిస్తున్నారో కదా' అన్నాడు గదాధరబాబు. 'ఈ విషయం మీద నేను వ్రాసిన కవితా గీతికలు చాలా ఉన్నాయి. పత్రికలు వాటిమీద చాలా సదభిప్రాయాన్ని కూడా ప్రకటించాయి. చూడండి నరేంద్రబాబూ: శరత్కాలంలో, వెన్నెల రాత్రిళ్లు యెప్పుడైనా డాబామీద పడుకున్నారా? చంద్రుడు నవ్వులు ఒలకపోస్తూ అలా అలా ఆకాశంలో వెళ్ళిపోవటం చూశారా? అలాంటి హాస్యమయ శశాంకుణ్ణి కారు మబ్బులు క్రమ్మివేసి. గాఢాంధకారమయం చేస్తే మనస్సుకి కలిగే కష్టాన్ని ఎన్నడైనా సహించగలిగారా? అలాంటిది మీకు అనుభవ పూర్వకమయి ఉంటే ఆడవాళ్ల కష్టం చూస్తే అలా బాధగా ఉంటుందా లేదా చెప్పండి ఇప్పుడు" అన్నాడు స్వరూపబాబు. నరేంద్రుడి ఎదుట ఇన్ని ప్రశ్నలు ఒకదాని వెనుక ఒకటి నిలబడితే అతడికి అయోమయంగా తోచి "ఈ విషయంలో నా కెలాటి సందేహమూ లేదు" అన్నాడు. స్త్రీల కష్టాల విముక్తికి మనము దృష్టాంతాన్ని చూపకపోతే ఇంకెవరు చూపుతారు? పదండి. నేటినుంచే దీనికి ప్రయత్నిద్దాం" అన్నాడు గదాధరబాబు. నరేంద్రుడి కందుకు అభ్యంతరం ఏమీ లేదు. ఎవరి అంతఃపురం గోడలను పడకొట్టటమా అని ఆలోచిస్తున్నాడు. "ఆనాడు మోహిని అని ఒక వితంతువుని గురించి చెప్పాను మీకు జ్ఞాపకం ఉందా? మన ప్రథమ పరీక్ష ఆమెమీదనే చేద్దాం. ఈ విషయంలో ఏదైనా చిక్కు ఉంటే తర్వాత ఆలోచిద్దాం.. అంతదాకా ఎందుకు—పెంపుడు పక్షిని పంజరంలోంచి తప్పించినా— స్వేచ్ఛగా ఎగిరి పోవటానికి ఇచ్ఛగించదు. అలాగే ఆ వితంతువు ముక్తికి స్వేచ్ఛకు వెయ్యి అవకాశాలున్నా అంతఃపురం చెరనుంచి బయటపడటాని కిష్టపడక పోవచ్చు. కనుక మన ప్రథమ కర్తవ్యం ఆమెకి స్వేచ్ఛా మాధుర్యాన్ని చవి చూపడం" అన్నాడు గదాధరబాబు. "అన్ని వైపులనుంచి ఆలోచించి చూస్తే ఈ విషయంలో ఎవరికీ ఎలాంటి అభ్యంతరమూ ఉండదని తోస్తుంది" అన్నాడు నరేంద్రుడు. ఆ వితంతువు నివాసానికి పోషణకు అవసరమైన యేర్పాట్లు అన్నీ చేసే భారం తన భుజస్కంధాలపై వేసుకోటానికి నరేంద్రుడు అంగీకరించాడు. తర్వాత ఒకరి తర్వాత ఒకరు త్రిభంగచంద్రుడు, విశ్వంభరుడు, జనమేజయ బాబూ వచ్చారు. క్రమంగా సంజెపడింది. ప్లేట్లు వచ్చాయి. బాటిల్సూ వచ్చాయి. గదాధరబాబు స్త్రీ శిక్షణను గురించి పెద్ద ఉపన్యాసం దంచి. స్వరూపబాబు వెన్నెల రాత్రిని గురించిన కవిత్వపు ఉదాహరణలు కోకొల్లలుగా చెప్పి, పడుకున్నారు. త్రిభంగచంద్రుడు విశ్వంభరుడు నోటికి వచ్చిన పాటలు పాడటం మొదలెట్టారు. నరేంద్రుడు, జనమేజయుడు ఏమిటో తిట్టటం మొదలెట్టారు—ఆ తిట్లేమిటో అర్థం కాలేదు.

## ౨

మహేంద్రుడిన్నాళ్లూ చాలాహాయిగా ఉన్నాడు. స్కూల్లో స్కాలర్‌షిప్ దొరికింది. కాలేజీలో చేరాడు. బి.ఏ. ప్యాసయాడు. మెడికల్ కాలేజీలో మూడు నాలుగేళ్ళు చదివాడు. ఇంకా ఒకటి రెండేళ్ళు చదివితే ప్యాసయిపోతాడు. కాని వివాహమయినప్పటి నుంచీ ఇలా అయినాడెందుకని? మనల్ని కలుసుకోవటానికి రావటం మానెయ్యటం—మనం వెడితే సరీగ్గా మాట్లాడకపోవటం ఇలాంటివి మంచిలక్షణాలు కాదు. హఠాత్తుగా ఈ మార్పు ఎందుకు వచ్చిందా అని. చాటుగా ఆచూకీ తీసి తెలుసుకున్నాం అసలు సంగతి ఇది. మహేంద్రుడి తండ్రి పిల్ల తండ్రివద్ద నుంచి కట్నం తీసుకుని, ఏ పిల్లనయితే చేశాడో—ఆ పిల్ల మహేంద్రుడికి నచ్చలేదు. నచ్చకపోవటం ఒక్కటేకాదు. ఆమె పేరు రజని. పేరుకు తగినట్లుగానే రంగుకూడా కారునలుపు పోనీ మనిషి అయినా సౌష్ఠవంగా ఉంటుందాఅంటే అదీలేదు. కాని ఆమె ముఖం చూస్తే మాత్రం చాలా మంచిదిలా తోస్తుంది. అభాగ్యురాలు ఎన్నడూ ఎవరి ఆదరాన్నీ పొంది యెరుగదు. పుట్టింట ఉన్నన్నాళ్ళూ ఉపేక్షింపబడింది. ముఖ్యంగా తన రూపంవల్ల ఎక్కడా సంబంధం కుదరకపోవటంతో—ఎవరిదగ్గిర పడితే వారిదగ్గిర ఆమె ఎంతో ఓర్పు వహించవలసివచ్చింది. ఎన్నడూ ఎవరితోనూ ముఖం ఎత్తి మాట్లాడటానికి సాహసించేది కాదు. ఓ రోజున అద్దం ఎదురుగా పెట్టుకుని ముఖాన బొట్టుపెట్టుకుంటూ ఉందని, ఎంతమంది ఆమెని ఎన్నివిధాల హేళన చేశా

రని ! అప్పటినుంచి హేళనచేస్తారన్న భయంతో ఎన్నడూ అద్దం చూసుకుని యెరుగదు. ముస్తాబు చేసుకుని యెరుగదు. భర్త ఇంటికి వచ్చింది. అక్కడ భర్తవద్ద ఒక్కక్షణమైనా ఆదరణ పొందలేకపోయింది. వివాహమయిన మర్నాటినుంచి మహేంద్రుడు ఆమెపజ్జను పడుకోవటం మానేశాడు. ఒకవైపునుంచి చూస్తే మహేంద్రుడు చాలా చదువుకున్నవాడు, యోగ్యుడు, బుద్ధిమంతుడు, చక్కటి స్నేహపాత్రుడు. అతణ్ణి చూస్తే అందరికీ ఇష్టమైనట్లే, అతడికీ అందరూ ఇష్టమే. రజని దురదృష్టంవల్ల మహేంద్రుడుకూడా పాడైపోయాడు. మహేంద్రుడు తండ్రిఅంటే భయభక్తులలో ఉండేవాడు. కాని వివాహమయిన మర్నాడే తండ్రిని అనకూడని మాటలన్నీ అని, తిరస్కరించాడు. "తాను అర్థంచేసుకోవడంలోనే పొరబాటు ఉంది. కాలేజీలో చదువుకుంటే కుర్రాళ్ళు ఇలా అదుపు తప్పిపోతారని శాస్త్రంలో ఉండనే ఉందికదా" అనుకున్నాడు తండ్రి.

రజని వృత్తాంతం అంతా వినేసరికి నాకు చాలా కష్టంవేసింది. నేను మహేంద్రుడిదగ్గరకు వెళ్ళి "ఇందులో రజని తప్పుఏముంది? ఆమె అనాకారిత్వానికి ఆమె బాధ్యురాలు కాదు. రెండోది ఆమె వివాహానికి దోషి మీ నాన్న; అలాంటప్పుడు ఏ తప్పూ ఎరుగని అమాయకురాలిని నీ వెందుకు కష్టపెట్టటం?" అని అన్నాను. మహేంద్రుడు తానూ తెలుసుకోలేదు. నాకు తెలిసేట్లు విశదంగా యేమీ చెప్పలేదు. తన స్థితిలోపడితే నేనూ ఇలాగే ప్రవర్తించేవాడినని మాత్రం అన్నాడు. మహేంద్రుడు చాలా పొరపాటు పడుతున్నాడని, అతడికి మరింత నచ్చచెప్పటంవల్ల ప్రయోజనమేమీలేదు. ఎందుచేతంటే ఈ కథకీ నాకూ ఉన్న సంబంధం అతి స్వల్పం.

ఈ సమయంలో మహేంద్రుడు కాలేజీ వదిలివెయ్యటం మంచి పని కాలేదు. సాగుచెయ్యని భూమిలో ముళ్ళ పొదలు మొలకెత్తుతాయి. ఇనుమును ఉపయోగించకపోతే తుప్పుపడుతుంది. మహేంద్రు డీ స్థితిలో పనీ—పాటూ వదిలేసి కూర్చుంటే దుష్ఫలితాలు ఎక్కువ కలగటానికి అవకాశంవుంది. నా అంతట నేనే మహేంద్రుడి దగ్గిరికి వెళ్లాను. అన్ని సంగతులూ స్పష్టంగా చెప్పాను. మహేంద్రుడికి కోపంవచ్చింది. నేను మెల్లిగా వెనక్కి తిరిగి వచ్చేశాను.

ఏదో కాస్త ఆనందంలేకపోతే మానవులు బ్రతకగలరా? మహేంద్రుడు అలా చదువుకోవటంలోనే ఎంతో ఆనందాన్ని పొంగవచ్చు. కాని పరీక్షలకు చదివిచదివి ఉండటంతో అతడికి పుస్తకాలంటే వెగటుపుట్టింది. కాలేజీనుంచి చటుక్కున బయటికి రాగానే అతడికేదైనా ఒక క్రొత్త ఆనందం ఉంటే బావుంటుంది. మహేంద్రు డిప్పుడు కాస్త త్రాగడం మొదలెట్టాడు. కాని దాని వల్ల నష్టం ఏంవచ్చింది? రాకేం? మహేంద్రుడది గమనించాడు. ఒక్కొక్కప్పుడు భయపడేవాడు. ఒక్కొక్కపుడు పశ్చాత్తాపపడేవాడు. ఒకొకసారి ప్రతిజ్ఞ చేసుకునేవాడు... మళ్ళీ మర్నాడు త్రాగేవాడు. త్రాగటానికి ఎన్నో ఉపపత్తులు సిద్ధం చేసుకునేవాడు. క్రమక్రమంగా మహేంద్రుడు అధోగతి గహ్వరానికి ఒక్కొక్క మెట్టే దిగిపోవటం మొదలెట్టాడు. త్రాగుడు మహేంద్రుడి కిప్పుడు బాగా అలవాటైపోయింది. ఇలాంటి సామాన్యవిషయాలు ఇంతటి దుర్ఘటనలకి దారితీస్తాయని నా కిదివరకు తెలియదు. అంతమంచివాడు, స్కూల్లో ఉండగా బిగ్గరగా మాట్లాడికూడా యెరుగనివాడు. చిరునవ్వులతో తప్పుకు తప్పుకు తిరిగేవాడు—ఈనా డింత త్రాగుబోతయి నోటికి వచ్చినట్లల్లా ప్రేలుతాడని, వృద్ధుడైన తండ్రినే నిర్లక్ష్యంచేసి మాట్లాడతాడని నేను కలలోకూడా అనుకోలేదు. చిన్నప్పట్నుంచీ మహేంద్రుడితో నాకు ఎంతో స్నేహం. అతడీనాడు నన్ను చూడగానే కోపగించుకుంటాడని, నన్ను చూస్తే భయపడతాడని, నా ఎదుటే లెక్చర్ కొడతాడని అన్నిటికంటె అసంభవంగా తోచేది అప్పుడు. కాని ఇహ నేను అతడికి నచ్చచెప్పటానికి వెళ్ళటం మానేశాను. లాభమేముంది? చెప్పినదాన్ని పాటించడు. కోపంమాత్రం తెచ్చుకుంటాడు. అలాంటప్పుడు అతడికి చెప్పిమాత్రం ఏమిటి చేసేది? కాని ఏమాటకామాటే అనుకోవాలి. మహేంద్రుడు ఎంత త్రాగుబోతయినా—అతడిలో ఇంక వేరే దుర్గుణాలు యేమీలేవు అని మాత్రం చెపుతాను. తన గదిలో కూర్చునే త్రాగేవాడు. ఎన్నడూ ఇంట్లోంచి బయటికి వచ్చేవాడుకాదు. కాని కొద్దిరోజులుపోయాక మహేంద్రుడి నౌకరు శంభూ వచ్చి 'బాబుగారు సాయంత్రంవేళ ఇంట్లోంచి బయలుదేరివెళ్లి, రాత్రిల్లు ప్రొద్దుపోయాక ఇంటికి వస్తున్నా రిటీవల' అని చెప్పాడు. ఈ మాట వినేసరికి నాకు చాలా కష్టంవేసింది. ఆచూకీ తీసి తెలుసుకున్నాను. దూష్యమయినదేమీ చెయ్యటం లేదతడు. మహేంద్రుడు తమ తోటప్రక్కన రేవులో కూర్చుని గడుపుతున్నాడు. కాని దానికి కారణం యేమిటి? ఆ విషయం ఇంకా పూర్తిగా తెలియలేదు.

సంస్కర్త మహాశయుడు వితంతువయిన మోహినిసంగతి చెప్పాడే—ఆమె మహేంద్రుడింటిప్రక్కనే ఉండేది! మహేంద్రుడింటికికూడా వస్తూవుండేది. మహేంద్రుడుకూడా ఏదైనా జబ్బు వచ్చినా, కష్టం వచ్చినా వాళ్ళ యింటికి వెళ్ళి సాయంచేస్తూ ఉండేవాడు. మోహిని చూస్తే చాలా బావుంది. ఎంత ఉజ్వల నేత్రాలు: ఎంత చక్కని పెదవులు! ఆ ముఖంలో ఏదో ఒక మాధుర్యం కన్పించేది. అదిచెప్ప శక్యం కానిది.

ఏమయితే యేం మోహినిని స్వాతంత్ర్యపు వెలుగులోకి తీసుకురావటానికి రకరకాల యెత్తులు సాగుతున్నాయి. మోహిని ఏకాదశులు చెయ్యాలి. మత్స్య మాంసాదులు తినటానికి వీల్లేదు. మోహినియెడ సమాజం జరుపుతున్న ఈ సకల విధ అత్యాచారాల్ని



పో లి క లు

చూసి, గదాధరబాబు చాలా ఆరాటపడుతున్నాడు. స్వరూపబాబు మోహినిని ఉద్దేశించి వార్తా పత్రికలకు. మాసపత్రికలకు రకరకాల ప్రేమ గేయాలు వ్రాసి పారేశాడు. వాటిలో మన బెంగాలీ సమాజాన్నీ మన దేశాచారాన్ని దుమ్మెత్తి పోశాడు. చివరకు సమస్త మానవ జాతిమీదా కూడా కోపం వెళ్లక్రక్కాడు. అతడు స్వయంగా చాలా దిగులు పడ్డాడు. రాత్రిల్లు ఊరికే నిట్టూర్పులు విడుస్తూ ఉండేవాడు.

నరేంద్రుడి కాశీపూర్ తోట ప్రక్కనే మోహినీ వాళ్ల ఇల్లు. మోహిని సాధారణంగా వచ్చి నీళ్ళుతీసుకుపోయే రేవుకే నరేంద్రుడు కొన్నాళ్లనుంచి రాకపోకలు మొదలెట్టాడు. ఇదంతా చూస్తే మోహినికీ ఏం బావుండటం లేదు. మోహిని ఇంక ఆ రేవుకి నీళ్ళకి వెళ్ళటం మానేసింది. అప్పటినుంచి ఆమె స్నానం చెయ్యటానికి, నీళ్ళు తేవటానికి మహేంద్రుడువెళ్ళి కూర్చునే రేవుకే.... వెళ్ళటం మొదలెట్టింది....

3

"ఇలా చేస్తే తట్టుకోవటం సాధ్యం కాదు. మహేంద్రు డింటికి వెళ్ళటం మానేశాను - దూరంగా ఉందాం. మనస్సు నిహ అటు పోనీయకూడదు అనుకున్నాను. మహేంద్రుడు మా యింటికి వస్తే. నేను వంటింట్లోకి పోయి దాక్కునే దాన్ని. ఈ మధ్య రేవులోకి వచ్చి కూర్చుంటున్నాడు. ఎంత బెడద వచ్చిపడింది. అతడి మూలంగా నీళ్లు తెచ్చుకోవటం మానుకో వల్సిందేనా? సరే పోనియ్. రేవులో కూర్చుంటే కూర్చుండనియ్—కాని అలా చూస్తాడెందుకు? లోకులు ఏమనుకుంటారు? నాకు చచ్చే సిగ్గుగా ఉంటుంది. ఇంక రేవుకి వెళ్ళకూడదు అనుకుంటాను. కాని వెళ్ళకుండా ఏం చెయ్యను? అసలు వెళ్ళకుండా ఎలా ఉంటాను? నిజం చెపుతున్నా, మహేంద్రుణ్ణి చూస్తే నా కేవేవో ఆలోచనలు వస్తూ ఉంటాయి....ఆ ఆలోచనలన్నీ మరిచిపోదామని అనిపించదు. సాయంత్రమప్పుడు ఒకసారి మహేంద్రుణ్ణి చూస్తే హాని ఏం వుంది? హాని ఉంటే ఉండనీ—నే నతణ్ణి చూడందే బ్రతకలేను. కాని 'నిన్ను నేను ప్రేమించా'నని మాత్రం మహేంద్రుడికి తెలియనివ్వను. తెలియనిస్తే ఇహ అతడు నా విషయంలో తన ఇష్టం వచ్చినట్లల్లా చేస్తాడు. ఇహ ఈ ప్రేమ గొడవ అంతా వెల్లడి అయిపోతుంది—"మోహిని మనస్సులో అనుకుంటున్నది....

"నేను రోజూ రేవులోకివెళ్ళి కూర్చుంటున్నా. కాని మోహిని ఒక్కరోజునయినా నా వంక కన్నెత్తి చూడటంలా—కనీసం నే నెటువైపు కూర్చుని ఉంటానో, అటువైపునుంచైనా వెళ్ళదు. నన్ను చూస్తే కంగారుగా అవగుంఠనం సవరించుకుంటుంది. దారిలో నన్నుచూస్తే అటుప్రక్కకు తప్పుకుంటుంది. మోహిని ఇంటికి వెడితే ఎక్కడికో పారిపోతుంది. ఇలా చేస్తుంటే కష్టం వేస్తుంది నాకు. మొదట్లో మోహిని నన్ను ప్రేమిస్తోంది అనుకున్నాను. ప్రేమించకపోయినా కనీసం ఆదరభావం ఉందను

కున్నా. కాని ఇటీవల ఇలా చేస్తోంది ఎందుకని? ఈ సంగతి మోహినిని అడగాలి. అడిగితే తప్పేముంది? మోహినిని నేను ఎన్ని సంగతులు అడగలేదు; మోహిని యింట్లో వాళ్లందరికీ నేనంటే ఎంతో అపేక్ష. మోహినితో మాట్లాడితే ఎవరూ ఏమీ అనుకోరు" ఇది మహేంద్రుడి భావన...

ఒకరోజున సాయంత్రం మోహిని నీళ్ళు తీసుకు వెళ్ళటానికి వచ్చింది. మహేంద్రుడు రేవులో అలాగే కూర్చుని ఉన్నాడు. తోటలో ఇంక ఎవ్వరూలేరు. మోహిని నీళ్ళు తీసుకుని బయలు దేరింది. మహేంద్రుడు కంపితకంఠంతో మెల్లిగా 'మోహినీ!' అని పిలిచాడు. మోహిని వినిపించుకోలేదు. వెళ్లిపోయింది. మహేంద్రుడు మళ్ళీ పిలవటానికి సాహసించలేకపోయాడు. మరొకరోజున మోహిని ఇంటికి తిరిగివెడుతూంటే మహేంద్రుడు ఎదురుగా వెళ్ళి నుంచున్నాడు. మోహిని కంగారుగా అవగుంఠనం ముందుకు లాక్కుంది. మహేంద్రుడికి ముచ్చెమటలు పోశాయి. అయినా ఏవో కొన్ని మాట్లాడాడు. కొన్నిమాటలు సగంలో ఆగిపోయాయి. చివరికి ఏదీ ఆమెకి అర్థమయేలా మాట్లాడలేకపోయాడు. మోహిని కంగారుగా "తప్పుకోండి. నేను నీళ్ళు తీసుకుని వెడుతున్నాను" అన్నది.

ఆ రోజున మహేంద్రుడింటికి వెళ్ళగానే—ఏదో చిన్నవిషయం మీద తండ్రితో తగాదాపడ్డాడు. నిర్దోషి అయిన రజనిని నిష్కారణంగా చాలాసేపు దూషించాడు. నౌకరు శంభూని రెండుమూడు సార్లు కొట్టబోయాడు. త్రాగుడు మైకం మరింత ఎక్కువయింది. తరువాత కొద్దిరోజులకే గదాధరునితో మహేంద్రుడికి పరిచయమయింది. ఆతర్వాత నాలుగయిదు రోజులకి స్వరూపబాబుతో సఖ్యత ఏర్పడింది. ఆతర్వాత ఇంకొక వారానికల్లా నరేంద్రుడితో పరిచయమైంది. నెల తిరిగేసరికల్లా మహేంద్రుడు రోజూ సాయంత్రం నరేంద్రుడికి అతిథిగా రావటం మొదలెట్టాడు.

౪

పూర్వం రఘునాథ సార్వభౌమ పండితుడికి ఒక పాఠశాల ఉండేది. ధనాభావంవల్ల కొద్దిరోజులకే అది మూసివేయబడింది. గ్రామంలో వర్ధిష్ణు జమీందారయిన అనుప్‌కుమార్ స్థాపించిన పాఠశాల్లో స్వల్ప వేతనంమీద ఉపాధ్యాయుడుగా నియమింపబడ్డాడు. కాని ఉపాధ్యాయ పీఠం అధిష్ఠించినా అతడి శాంత స్వభావంలో మార్పేమీ రాలేదు....అతడు తన కప్పుడే నలభయ్యోయేడు వచ్చిందని చెపుతూండేవాడు. కాని అతడికి నలభై ఎనిమిదేళ్ళకి తక్కువలేదని ఘంటాపథంగా చెప్పవచ్చు. మామూలు ఉపాధ్యాయులతో అతడి కే విషయంలోనూ పొత్తు కలిసేది కాదు. అతడు విలాసంగా ఉండే రసికపురుషుడు కాదు. ఝంఝ్‌మని గబగబా మాట్లాడకలిగిన మాటకారీ కాదు. వాళ్ళకీ వీళ్ళకీ లావాదేవీలు పెట్టి చెయ్యి తడిచేసుకునే వ్యవహర్తా కాదు. శాస్త్ర విషయకమైన చర్చల్లో మునిగితేలేవాడు కాదు. కేవలం బొజ్జలో, నస్యం పీల్చటంలో, పిలకలో, మాత్రమే జతకుదిరేది. పాఠశాలలోని బాలురు ఇంచుమించు ఇరవైనాలుగు గంటలూ, వాళ్ళింట్లోనే పడి ఉండేవాళ్లు. ఈ పిల్లలమూలంగా అతడు చాలా 'సందేష్' లకి ఖర్చుపెట్టాల్సివచ్చేది. సందేష్‌లమీది ఆశతో కుర్రవాళ్ళు జలగల్లాగా వాళ్ల యింటిని పట్టుకుని వదిలివెళ్లేవాళ్ళు కాదు. అతడు చాలా మంచివాడసలు. అల్లరిపిల్లలు అతడిమీద అత్యాచారాలెన్నో చేస్తూండేవారు. అతడికి నిద్ర ఎంత అలవాటయిందంటే—పడుకుంటే చాలు వెంటనే నిద్రపోయేవాడు. కూచుంటే కునికిపాట్లు పడేవాడు. ఇహ నుంచుంటే ఆవలిస్తూ ఉండేవాడు. ఈ వీలు చూసుకుని కుర్రవాళ్లు అతడి పొడుండబ్బాని, ఆకు చెప్పుల్ని, సులోచనాలను దొంగిలిస్తూ ఉండేవాళ్ళు. రఘునాథ్ అసలే జావలాంటి మనిషి. దానికితోడు అల్లరిపిల్లలు అతడి యింటిని ఒక కొలిక్కి తీసుకువచ్చేవాళ్ళు. పాఠశాలకి వెళ్లేప్పుడు ఎంత వెతికినా అతడి జోళ్ళు కన్పించేవికావు. చివరికి జోళ్ళు లేకుండా ఒట్టికాళ్ళతోనే వెళ్లేవాడు. ఒకరోజున ఉదయం లేచి చూసేసరికి అతడి పడకగదిలో కందిరీగలు ఝుయ్‌న లేచాయి. భయంతో కంగారుగా ఆగది వదిలేశాడు. ఆగదిలో మూడు కందిరీగల పుట్టలు వెలిశాయి....ఎలికలు కన్నాలు త్రవ్వాయి. సాలీళ్ళు గూళ్ళు కట్టుకున్నాయి. ఇహ చీమలబారులకి అంతేలేదు. వారికి ఋశ్యమూక పర్వతం ఎలాంటిదో—పండితమహాశయుడికి ఆగది అలా పరిణమించింది. పాఠశాలకి వెళ్ళటం ఇష్టంలేని కుర్రవాడు ఆ గదిలోకెళ్ళి దాక్కున్నాడంటే అతడిహ ఆ కుర్రవాణ్ణి పట్టుకోగలిగేవాడు కాదు.

ఇల్లంతా ఇలా తీరూ తెన్నూ లేకుండాపోవటం చూసి, పండిత మహాశయుడు చాలారోజులనుంచి ఇల్లాలి తాపత్రయంలోపడ్డాడు. అతడి గతించిన భార్య చాలా గయ్యాళి అని ప్రతీతి. శాంత స్వభావుడైన ఈ సార్వభౌముడు ఆమె ఆజ్ఞను ఢిల్లీశ్వరుని ఆజ్ఞలా పాటించేవాడు. భార్య ప్రక్కన ఉండగా మరొక స్త్రీ కన బడితే కళ్లు మూసుకునేవాడు. ఒకసారి ఒక యెనిమిదేళ్ల బాలిక వంక చూస్తూ కూర్చుంటే అతడిభార్య ఆ బాలిక పితృపితామహ ప్రపితామహాదుల్ని బండెడు తిట్లు తిట్టింది. ఇహ సార్వభౌమ మహాశయుడ్ని "మీరు చావండి. చావండి. చావండి" బుగ్గపోట్లు పొడిచింది. అతడికి చావంటే మహాభయం. చావుమాట వినేసరికి అతడి గుండెలు దడదడా కొట్టుకునేవి. భార్య చనిపోయాక రోజూ తిట్లు లేకపోవటంతో అభ్యాస దోషంవల్ల కొన్నాళ్ళు కష్టంగానే ఉండేది. ఏమయితే యేం పండితమహాశయుడు బహువిధ కారణాలవల్ల పునర్వివాహం చేసుకోవాలనే ప్రయత్నంలో ఉన్నాడు. అతడికొక అలవాటుంది. ఎన్నో పింపివంటలతో

భోజనం లభిస్తుందని ఆశ ఉన్నా సరే—అతడు ఏ పెళ్లి పందిట్లోకి అడుగు పెట్టేవాడు కాదు. ఎవరిదైనా పెళ్లి అని వార్త తెలిస్తే చాలు ఆ రోజల్లా అతడికి మనస్సు బావుండేదికాదు. సార్వభౌముడికి భట్టాచార్య అని ఒక మిత్రుడున్నాడు. అతడికి తాను చాలా పరిహాసంగా మాట్లాడతాడని విశ్వాసం. తన మాటలకి నవ్వని వ్యక్తిని చూస్తే నమిలి మ్రింగుదామన్న కోపం వచ్చేదతడికి. ఆ మిత్రుడు మధ్యమధ్య వచ్చి తన భట్టాచార్య భంగిమలో—కంఠస్వరంతో సార్వభౌముడితో చెపుతూండేవాడు. "అరే భాయీ! శాస్త్రంలో ఏముందో తెలుసా? 'యావన్న విందతే జాయాం, తావదర్ధో భవేత్పుమాన్. యన్నబాలైః పరివృతం శ్మశాన మివ తద్గృహమ్" అట: కాని నువ్వు తద్విరుద్ధంగా కన్పిస్తున్నావే. మీ బ్రాహ్మణి బ్రతికి ఉన్నరోజుల్లో నువ్వు భయంతో, బెంగతో చిక్కి సగమై ఉండేవాడివి. భార్యావియోగానంతరం చూస్తూ చూస్తూ ఉండగానే రెండింత లయినావే! అదీకాక పిల్లలు లేకపోతే శ్మశానంలా ఉంటుంది ఇల్లు అని ఉంది శాస్త్రంలో. కాని పిల్లలతో బిలబిలలాడుతున్నా నీ యిల్లు శ్మశానంలాగానే ఉందే!" అని ప్రక్కనున్న బాలురకు సైగచేశాడు. వాళ్ళందరూ ఒక్కసారి గొల్లున నవ్వారు. ఆ సంతోషంలో అతడు క్షణక్షణానికి నశ్యం పీల్చటం మొదలెట్టాడు. రఘునాథ్ సార్వభౌముడికి అద్దరి పిల్లసంబంధం ఒకటి వచ్చింది. అది వచ్చినప్పట్నుంచీ అతడు ఎంతో సంతోషంగా ఉంటున్నాడు. పాఠశాలకి సెలవు వచ్చింది. ఇవాళ వరుణ్ణి చూడటానికి వస్తారు. ఆ వీధిలో ఏ అల్లరిపిల్లవాడి సలహాయో విని, పండితమహాశయుడు నరేంద్రుడిదగ్గిరనుంచి ఓ జత మేజోళ్లు, జరీదుస్తులు, తలపాగా ఎరువు తెచ్చుకున్నాడు. అల్లరి కుర్రవాళ్ళు అతడిచేత ఇవన్నీ ధరింపచేసి,పగటివేషగాణ్ణిగా తయారుచేశారు. చిన్న తలపాగా సార్వభౌమపండితుకి పెద్ద తలకాయకి చాలక, పిలక ఉన్నమేరవరకు సరిపోయింది. రెండు మూడు గుండీలు వదిలేస్తే లాంగ్‌కోటులాంటి చొక్కా అతికష్టం మీద అతడిపొట్టకు సరిపెట్టటం అయింది. గంటలతరబడి ఈ ముస్తాబు పూర్తయాక సార్వభౌమ పండితుడు ఒక్కసారి అద్దంలో ముఖంచూసుకున్నాడు. జరీదుస్తుల తళతళ అతడికి చాలా సంతృప్తి కలిగించింది. కాని ఆ నిగనిగలాడే జోళ్లూ, బిగుతుగా ఉన్న చొక్కా తొడుక్కోవటంతో నడవనూలేక పోయాడు, కదలనూలేకపోయాడు; జడభరతుడిలా అక్కడే కూర్చుండిపోయాడు. తల కాస్త క్రిందికి వంచితేచాలు పాగా పడిపోతుందేమో అనిపించింది. మెడ నొప్పిపుట్టింది. అయినా సాధ్యమైనంతవరకు మెడ అలాగే పెట్టుకుని కూర్చున్నాడు. ఇలా ఒక గంటసేపు కూర్చునేసరికి అతడికి తలనొప్పి వచ్చింది ముఖం వాడిపోయింది. చెమటలు కాల్వలు కట్టసాగాయి. శ్వాస ఉక్కిరిబిక్కిరి అయింది. ఊళ్ళో పెద్దమనుషులు కొందరు వచ్చి అనేకవిధాల నచ్చచెప్పి అతడి వేషాన్ని మార్పించారు. రఘునాథపండితులు చెల్లాచెదరుగా ఉన్న తన యింటిని శుభ్రంగా బాగు చేయించి అలంకరించటానికి, ఎంతో ముఖస్తుతి చేసి, నిధిరాం భట్టాచార్యులవారిని ఆహ్వానించి రప్పించుకున్నాడు. ఈ నిధిరామ్ మీద రఘునాథ్‌కి చాలా భక్తి ప్రపత్తులున్నాయి. 'గృహవిషయాలను చక్కదిద్దటంలో అతడు తన పూర్వపు భార్యతో సమానమైనవాడనీ, దావాలు మొదలైన వ్యవహారవిషయాల్లో అతడు మేజస్ట్రేటునుకూడా మూడుచెరువుల నీళ్లు తాగిస్తాడని, రకరకాల వార్తలను సేకరించి పెట్టటంలో—మెలకువగా అన్నిపనులూ నిర్వహించటంలో అతడు కాలేజీ విద్యార్థులకు కాస్త అటూ యిటూగా ఉంటాడని చెప్పేవాడు రఘునాథ్.


చాతుర్యంకలవాళ్ళు సాధారణంగా తమ దారిద్ర్యానికి కూడా గర్వం వ్యక్తంచేస్తూనే ఉంటారు. గార్హస్థ్య వ్యవస్థలోని చాతుర్యాన్ని చెప్పతలచినవాళ్ళు తమ దారిద్ర్యానికి గర్విస్తూ ఉంటారు. అంటే డబ్బు లేకపోయినా సంసార జీవితాన్ని ఎలా క్రమపద్ధతిలో పెట్టామో చూశారా అని! కబుర్ల రాయుళ్లు అయినవాళ్ళందరూ పండితమహాశయుడియెడ చాలా అనుకూలంగా ఉంటారు. ఎంచేతంటే ఎవరు ఏది చెప్పినా మారుచెప్పకుండా విని విశ్వసించటంలో పండితమహాశయునిలాంటి వాళ్లు ఇంకెవరూ లేరు ఊళ్ళో. ఈ గుణానికి వశీభూతుడై నిధి నెలకు అధమపక్షం రెండుసార్లయినా తన పెళ్ళి కథనే రకరకాలుగా చెపుతూండేవాడు. ఆ కథ చిలవలూపలవలూ త్రుంచివేస్తే సారాంశం ఇది—నిధిరామ్ అక్షరాలు అయిదుబళ్లూ రావటంతోనే చదువుకు స్వస్తిచెప్పాడు. కాని చదువులేని లోపాన్ని కుయుక్తులతో పూరించుకున్నాడు. నిధికి పెళ్ళి చేసుకోవాలని బుద్ధిపుట్టింది. కాని నిధిలాంటి మూర్ఖుడికి కూతుళ్ళను కట్టపెట్టటానికి సిద్ధమయేవాళ్ళెవరూ లేరు ప్రపంచంలో. ఎంతో శ్రమపడి, ఎన్నో కుయుక్తులు పన్ని, చివరికి ఓ సంబంధాన్ని కుదుర్చుకోగలిగాడు. ఆనాడు అల్లుణ్ణి పరీక్షించటానికి వచ్చారు పిల్లవైపువారు. అద్వితీయచతురనిధి అయిన నిధిరాం అన్నగారితో సంప్రతించి ఒక మేనా తెప్పించాడు. కుచ్చు తలపాగా కోటూ ధరించి, కాగితాలకట్ట ఒకటి చేతపుచ్చుకుని ఆ వచ్చినవారు చూస్తుండగానే మేనా యెక్కాడు. 'నిధీ! నిన్ను ఇవాళ చూడటానికి వచ్చారు' అన్నాడు అన్నగారు. "వీల్లేదు అన్నయ్యా ఇవాళ దొర పెందరాళే వస్తారు. బోలెడు పని—బోలెడు వ్రాయవలసిన కాగితాలు అవీ ఉన్నాయి. ఇవాళ వీలుపడదు" అన్నాడు. పిల్లవైపువారు నిధి ఏదో చదువుకున్నవాడు, ఉద్యోగం కూడా చేస్తున్నవాడని అనుకున్నారు. ఆ మర్నాడే వివాహం అయింది. నిధి ఇక్కడ కప్పిపుచ్చిన విషయం ఒకటి తర్వాత తెలిసింది. ఇరుగుపొరుగునవున్న మెట్రిక్ చదువుతున్న యువకుడొకడు 'నువ్వు ఏ కాలేజీలో చదువుకున్నావని అడిగితే బిషప్స్ కాలేజీలో

అని చెప్పమని సలహాయిచ్చాడు. పెళ్ళిపందిట్లో ఎవరో ఈ ప్రశ్న వెయ్యగానే నిధి గంభీరంగా 'విషాక్త కాలేజీలో' అని చెప్పాడు. అదృష్టవశాత్తూ పెళ్ళికూతురువైపువారు నిధి మూర్ఖత్వాన్ని పరిహాసంగా భావించటంతో అప్పటికి అతడి మర్యాద దక్కింది.

నిధి రావటంతోనే పెద్ద గందరగోళం మొదలెట్టాడు. అరె ఆగదిలో — ఆగదిలో అంటూ అక్కడున్నవన్ని అటూయిటూ తీసిపారేసి, ఒకటిరెండు సామానులు పగలకొట్టి, విరగకొట్టి ఎదుట కనిపించిన రెండుమూడు పుస్తకాలు చించిపారేసి, ఆవాడ అంతా ఒక కొలిక్కి తీసుకువచ్చాడు. చేస్తున్నపని యేమీలేదు, కాని ఒకటే గోల, ఒకటే కంగారు. కాళ్ళజోళ్ళు టకటకలాడించుకుంటూ ఈగదిలోంచి ఆగదిలోకి, ఈయింట్లోంచి ఆయింట్లోకి, ఈవాడనుంచి ఆవాడకి ఎక్కడా క్షణం కాలు నిలవకుండా తిరుగుతున్నాడు — రొప్పుతూ రోజుతూ ఎదురైన వాళ్ళతో ఒకటిరెండు మాటలు మాట్లాడుతున్నాడు; మళ్లీ రఘునాథ మహాశయుడి ఇంట్లోకి వెడుతున్నాడు. ఫలితం ఏమిటంటే ఆయిల్లు శుభ్రం చెయ్యబోతే అక్కడొక పెద్ద బెడద వచ్చిపడింది. చీపుళ్ళతాకిడికి మనుషుల అలికిడికి అక్కడ కాపురం పెట్టిన కందిరీగల కుటుంబాలు మూడు—ఝుంఝున ఎదురుతిరిగాయి. నిధిరామ్ ముక్కు ముఖం ఉబ్బిపోయాయి. చెప్పులు వదిలేసి, ధోవతి కుచ్చిళ్ళతో కాళ్ళు కప్పుకుంటూ, గుమ్మాల ఎదురుదెబ్బలతింటూ, పండిత మహాశయుణ్ణి తిట్టుకుంటూ ఇట్లోంచి బయటపడ్డాడు. వారంరోజుల నుంచి ఇంట్లో కందిరీగలు పేట్రేగిపోయాయి. పాపం రఘునాథ్ వాటి భయంతో ఆ యింట్లో అడుగుపెట్టకుండా ప్రక్కవారి యింట్లో ఉంటున్నాడు. తర్వాత ఇంటికివచ్చిచూస్తే, వెళ్ళేప్పుడు ఇంట్లో చూసివెళ్ళిన చెంబులూ, తపేలాలు ఒక్కటీ కన్పించలా.

ఆరోజున పెళ్లి జరగబోతోంది. పడింత మహాశయుడికి ఆ క్రితంరాత్రి కలవచ్చింది. ఎంతోకాలంక్రిందటి ఆ చీపురుకట్టకలలో కన్పించింది మళ్ళీ ఇన్నాళ్ళకి. దాన్ని శుభ లక్షణంగా భావించుకున్నాడు. ప్రొద్దున్నే తనలోతాను నవ్వుకుంటూ మంచంమీది నుంచి లేచాడు. పట్టుబట్టలు కట్టుకుని, మంచిగంధం పూసుకుని, పెళ్లికొడుకు వేషంలో కూచున్నాడు ప్రొద్దుటనుంచి. అలా కూర్చుని కూర్చుని ఉండటంతో హఠాత్తుగా అతడికొక బెంగ పట్టుకుంది. 'అంతా బాగానేఉంది. ఇప్పుడిహ పడవలో ఎక్కడం ఎలాగా అని: ఎంతోసేపు ఆలోచించాడు — చిలుందమ్ములు కొట్టికొట్టి, డబ్బాడు నస్యం పీల్చగా పీల్చగా చివరికొక ఉపాయం తోచింది. నిధిరామ్‌ను వెంటపెట్టుకుని వెడదామని నిశ్చయానికి వచ్చాడు. నిధిరామ్ ప్రక్కనుంటే పడవ మునగటానికి అవకాశం యేమీ ఉండదని అతడి విశ్వాసం. నిధిని వెతుక్కుంటూ బయలుదేరాడు. ఆనాడు ఆ దుర్ఘటన జరిగినప్పటినుంచి నిధి, రఘునాథ్ ఇంటి చాయలకు పోకూడదుమళ్ళీ అనుకున్నాడు. ఎంతో ముఖస్తుతి చేయగా చివరకు ఒప్పుకున్నాడు. ఇహ పడవలో ఎక్కాలి. రఘునాథ్ ఒడ్డున పొడుం పీలుస్తూ నుంచున్నాడు. నిధిరామ్‌కి పడవంటే తక్కువ భయమేమీకాదు. పెళ్ళివారింట భోజనం ఆశ లేకపోతే అతడు ప్రాణం పోయినా ఎక్కేవాడుకాదు. ఎంతో కష్టంమీద నలుగురయిదుగురు పల్లెకారులు పట్టుకుని అతణ్ణి ఎలాగో పడవలో ఎక్కించారు. పడవ బయలుదేరింది. పడవ అటూ యిటూ ఊగినకొద్దీ పండిత మహాశయుడు కంగారుపడసాగాడు. అతడు కంగారుపడినకొద్దీ పడవ ఊగసాగింది. ఒకటే హంగామా. పడవవాళ్ళందరూ హడావిడిపడుతున్నారు. ఒకవేళ పడవ దిగి నది దాటవలసివస్తే తనను ఎత్తుకు తీసుకువెళ్ళి ఒడ్డున దింపమని పల్లెవాళ్ళను బ్రతిమాలుకున్నాడు. నిధిరామ్ నోట మాట లేదు. కాస్త గాలికొట్టినా మబ్బుపట్టినా ఇంకేంలేదు. పడవ తెరచాప చిరిగిపోయి, మునిగిపోతుందనే భావనలో ఉన్నాడతడు. పండిత మహాశయుడు బిక్కుబిక్కుమంటూ నిధిరామ్ ముఖంకేసి చూస్తూ కూర్చున్నాడు. ఒకటిరెండుచోట్ల తరంగాల తాకిడికి పడవ కొంచెం ఎక్కువ ఊగిసలాడింది. నిధిరామ్ ఎగిరిపడ్డాడు. రఘునాథ్ నిధిని వాటేసుకున్నాడు. నిధినికనుక అంటిపట్టుకుని ఉంటే ప్రాణహాని ఏమీ ఉండదనీ అప్పటికీ అతడి విశ్వాసం. నిధి రఘునాథ్ చేతులు విడిపించుకోటానికి చేతనయిన ప్రయత్నం చేస్తున్నాడు. అతడలా చేస్తున్నకొద్దీ రఘునాథ్ గట్టిగా వాటేసుకుంటున్నాడు. సన్నటివాడైన నిధి, రఘునాథ్ అంత గట్టిగా తనకు మెలివేసుకుపోవటంతో ఊపిరాడని స్థితిలో పడ్డాడు. రోషంతో, కోపంతో, బాధతో అరవటం మొదలెట్టాడు. ఇంత గొడవ మధ్య పడవ ఎలాగయితే యేం ఒడ్డు చేరుకుంది. పల్లెకారులు ఇంత గొడవతో జరిగిన పడవ ప్రయాణాన్ని ఎన్నడూ చూడలేదు. వాళ్లు 'అమ్మయ్య' అనుకున్నారు. కంఠగతప్రాణుడైన నిధి ఒక్క నిట్టూర్పు విడిచి బ్రతికా మనుకున్నాడు. రఘునాథ్ ఒడ్డుకి రాగానే చెంబెడు నీళ్లు తాగి బ్రతికా ననుకున్నాడు.

పెళ్ళిముహూర్తం దగ్గరపడింది. రఘునాథ్ పెండ్లిటోపీ పెట్టుకుని పీటలమీద కూర్చున్నాడు. ఉపవాసంవల్ల, పడవ ప్రయాణం బడలికవల్ల, అభ్యాసదోషంవల్ల ఊరికే ఊగుతున్నాడు. మధ్యమధ్య నెత్తిమీది టోపీ జారిపడితోంది. ప్రక్కనున్న నిధి మధ్యమధ్య ఒకపోటు పొడుస్తున్నాడు. చచ్చిపోయినవాడికైనా మళ్ళీ చైతన్యం వచ్చేటంత బలమైనపొట్లుతిని రఘునాథ్ కంగారుపడుతున్నాడు. తలమీదనుంచి జారిపోతున్న టోపీని తలమీద పెట్టుకుంటూ తలగోక్కుంటూ నాల్గువైపులా కలయ చూశాడు. పందిట్లోఉన్న వాళ్ళందరూ నోళ్ళకి గుడ్డలు అడ్డుపెట్టుకుని నవ్వుకుంటున్నారు. లగ్న సమయమవుతోంది. వివాహానుష్ఠానం ప్రారంభమైంది. రఘునాథ్ చూశాడు. పురోహితుడు తను పాఠశాలలో చదువుకున్న శిష్యుడే. శిష్యుడు చాలా సిగ్గుపడటం



సినిమాతారల క్రమ వికాసం

మొదలెట్టాడు. రఘునాథ్ అతడితో అతినెమ్మదిగా చెవిలో చెపుతున్నట్లు—'దీనికి సిగ్గెందుకు? ఇందులో సిగ్గుపడాల్సిందేమీ లేదు, అనటానికి అతడు కల్కి పురాణంలోంచి, స్కంద పురాణంలోంచి ఉదాహరణలు తీసి చూపించాడు. పురోహితుడు మంత్రాలు చదవడంలో ఒకటి రెండు తప్పులు చదివాడు. సంస్కృతంలో తప్పుచదివితే పండిత మహాశయుడు సహించ లేడు. వెంటనే పాణిని సూత్రాల్లోంచి కొన్ని సూత్రాలు చదివి వ్యాఖ్యానంచెప్పి, పండితుడి పొరబాటును సరిదిద్దాడు. పురోహితుడు కంగారుపడిపోయి, మరికొన్ని తప్పులు చదివాడు మంత్రాల్లో. తాను పాఠశాల్లో కష్టపడి, చెప్పిన చదువంతా ఈ శిష్యుడు వ్యర్థంచేశాడు.

పెళ్ళి అయిపోయింది. లేచేటప్పుడు పండిత మహాశయుడి కాళ్ళు పట్టుకోపోవడంతో నడవబోయి తూలిపడ్డాడు మామగారి మీద. దాంతో ఒకరిమీద ఒకరు ఇద్దరూ క్రిందపడ్డారు. వరుడి ధోవతి చిరిగిపోయింది. మామగారికి శూలనొప్పి ఉంది. స్థూల కాయుడైన రఘునాథ్ అతడి పొట్టమీద పడడంతో గట్టిగా కేకలు పెట్టాడు. ఏడెనిమిదిమంది పట్టుకుని ఇద్దరిని లేవతీశారు. పందిట్లో వారందరూ నవ్వుకోసాగారు. రఘునాథ్ చాలాఖంగారుపడి రెండు మూడు మాటలు మాట్లాడాడు, కాని అవేమిటో అర్థంకాలేదు ఒక సారి దైవవశాత్తు కంగారుగా ప్రారంభమయిందంటే—ఇకపోయిన పొడుగునా ఒకటే కంగారుపడక తప్పదు. అంతఃపురంలోకి వెళ్ళి తొట్రుపాటుతో అత్తగారికాలు త్రొక్కాడు. 'ఎబ్బే' ఏంలేదు. కాలునలగలేదులే, అంటూనే అత్తగారు లోపలికి వెళ్ళి కాలికి తడిగుడ్డ చుట్టుకుని వచ్చింది. భోజనం చేస్తున్నప్పుడు మంచినీళ్ళు తాగుతూండగా కొలమారి దగ్గుతో అరగంటసేపు ఉక్కిరిబిక్కిరయాడు. కళ్ళవెంబడి నీళ్లువచ్చాయి. శోభనపుగదిలో కూర్చుని ఉంటే ఒక బొద్దింక ఎగిరివచ్చి అతడి వీపుమీద పడింది. దాంతో అతడు ఉలిక్కిపడి ముఖం వికృతంగా పెట్టి, అవతలకుగెంతి వెళ్ళి మరదళ్ళమీద పడ్డాడు. వాళ్లు చెవులు మెలిపెట్టటంతో మళ్ళీ యథాస్థానానికి వచ్చి కూర్చున్నాడు అన్నట్టు మరచి పోయాను— అసలు పాన్పుమీద కూర్చోబోతూనే ఒకటే తుమ్ములు తుమ్మటం మొదలెట్టాడు. చుట్టూఉన్న పేరంటాళ్ళు అందరూ తెల్లబోయారు. ఈ శోభనపు గదిలోని బెడదలన్నీ ఎలాగా తప్పించుకోవటం అని మహా ఆలోచించాడు. చివరకి మళ్ళీ నిధిరాం జ్ఞాపకం వచ్చాడు. కాని నిధిని ఆ గదిలోకి తీసుకెళ్ళే ఉపాయం ఏమీలేదు. ఏమయితే యేం అమాయకుడు చాలా గందరగోళంలో పడ్డాడు. ఒకటి రెండు ప్రశ్నలేవో ఆడవాళ్లు అడిగితే సమాధానం చెప్పబోయి, శ్రుతి స్మృతి వేదాంత సూత్రాల వ్యాఖ్యానం చెప్పాడనికూడా వినికిడి. అలాగే అత్తణ్ణి పాట ఏదైనా పాడమని బలవంతపెట్టినప్పుడు— పండిత మహాశయుడు మనస్ఫూర్తిగానే పాడాడొకపాట. అందులో సందేహం యేమీలేదు. కాని ఆపాట వింటే అతడికి సంగీతంలో ఏమాత్రం ప్రవేశం లేదన్నసంగతి స్పష్టమయింది. మంత్రాలు చదివినట్లే పాడాడు పాటకూడా. మొత్తానికి ఎలాఅయితే యేం అతి కష్టంమీద పెళ్ళిరోజు రాత్రి గడిచింది.

౩

మహేంద్రుడు, నరేంద్రుడు వాళ్ళ జట్టులో చేరాడు. నిజమే— కాని, ఇంకా మహేంద్రుడి వైఖరిలోనూ ప్రవర్తనలోనూకూడా ఒకవిధమైన ఆధిక్యత వ్యక్తమవుతూ ఉండటంలో నరేంద్రుడు అతడితో సరీగ్గా మాట్లాడటానికి సాహసించలేక పోతున్నాడు.

అంతేకాదు, అతడు అక్కడ ఉన్నంతసేపూ నరేంద్రు డేమిటో ఇరుకులో ఉన్నట్లు ఇదవుతాడు. అతడు వెళ్లిపోగానే నరేంద్రుడి ప్రాణానికి హాయిగా ఉన్నట్లుంటుంది. తెలియకుండా నరేంద్రుడి మనస్సు మహేంద్రుడి సమ్మోహనశక్తికి పాదాక్రాంతమైపోయింది. మహేంద్రుడు చాలా మృదు స్వభావుడు నవ్వవలసివచ్చినప్పుడు చిరునవ్వుతప్ప బిగ్గరగా నవ్వడు. మాట్లాడటంకూడా నెమ్మదిగా మాట్లాడతాడు. అందులోనూ మరీ ఎక్కువమంది ఉన్నప్పుడు అసలు మాట్లాడనే మాట్లాడడు. ఎవరిమాటకైనా బదులుపలక వలసివస్తే 'ఊఁ.' అని మాత్రం అంటాడు. అలా పలకటం ఇష్టంలేనప్పుడు 'ఊఁ.' అనడు, 'ఉహూఁ.' అనడు. ఇలాంటి మహేంద్రుడు నరేంద్రుడి మనస్సుమీద ఆధిపత్యాన్ని వహించటం ఆశ్చర్యకరమైన విషయమే.

మహేంద్రుడికి గదాధరుడితో బాగా స్నేహం అయింది. ఇద్దరూ ఇంట్లో కూర్చునే దేశాచారాలకు విరుద్ధంగా కాల్పనికమైన ఘోర యుద్ధం సాగిస్తూ ఉంటారు. స్వేచ్ఛా వివాహాలు, విధవా వివాహాలు మొదలైన విషయాల్లో మంహేంద్రుడు సంస్కర్త అయిన గదాధరుడితో ఎంతో ఉత్సాహంగా ఏకీభవిస్తూ ఉంటాడు. కాని బహుభార్యా నిషేధం విషయంలో అతడికంత ఉత్సాహంలేదు. ఇందులోని ఆంతర్యాన్ని గదాధరబాబు గ్రహించ లేకపోవచ్చు. కాని మనకి కొంతవరకు తెలుసు....గదాధర, స్వరూప్‌లతో మహేంద్రుడు కలిసినంతగా నరేంద్రుడు కలవలేక పోయాడు. మహేంద్రుడు క్రమక్రమంగా వీరిముందు తన మనసు లోని విషయాలని ఒకటీ, రెండు చెప్పటం మొదలెట్టాడు చివరికి మోహినితో తనకుగల ప్రణయగాథనుకూడా చెప్పాడు. ఈ ప్రణయగాథ విని స్వరూప్ చాలా ఉద్రిక్తుడయినాడు. మహేంద్రుడు తన ప్రణయానికి అన్యాయంగా ప్రతిద్వంది అయినాడని భావించాడు. ఎంతో బాధ అనుభవించి, ఎంతో కవిత్వాన్ని వ్రాశాడు తాను. చివరికి తనను నవలల్లోని నాటకాల్లోని నాయకుడిగా భావించుకుని కొంతవరకు తృప్తిపడ్డాడు.

ఎలాగయినాసరే మోహినిని సాంసారిక బంధనాల్లోంచి తప్పించి ఆమెని స్వేచ్ఛావాయువుల్ని అనుభవించేట్లుగా చెయ్యమని గదాధరుడు మహేంద్రుని కోరాడు. మన స్వేచ్ఛా శిక్షణ ఇంటిదగ్గరనుంచి ప్రారంభం చెయ్యటం నేర్చుకుంటే క్రమంగా మనం స్వేచ్ఛామార్గంలో ముందుకు పోగలుగుతాం. Charity begins at home అన్నట్లుగానే, స్వాతంత్ర్యంకూడా ఇంట్లో నుంచే ప్రారంభం. సంస్కర్త అయిన గదాధరుడు ఈ నీతిని స్వయంగానే ఆచరణలో పెట్టాడు. పన్నెండేళ్ళప్పుడు తండ్రితో తగాదా పెట్టుకుని అతడు ఇంట్లోంచి పారిపోయాడు. పదహారేళ్లప్పుడు అధ్యాపకుడితో వివాదం తెచ్చుకుని, క్లాసులోంచి వెళ్ళిపోయాడు. తర్వాత ఇరవయ్యోయేట భార్యతో అభిప్రాయభేదం తెచ్చుకుని, ఆమెని పుట్టింటికి పంపివేసి నిశ్చింతుడయినాడు. ఇలా ఒక్కొక్క స్వేచ్ఛా సోపానాన్నే ఎక్కుతూ వచ్చి ఇప్పుడు ముప్పయి యేళ్ళవాడయి, తాను కుసంస్కారాలు, ప్రెజుడిస్‌ల లోంచి విముక్తుడై, అనన్య వంగదేశపు కఠోరమైన ఆచారాలను తన తీక్ష్ణమైన ఉపన్యాస బాణాలతో నిర్మూలించాలనే ప్రయత్నంలో ఉన్నాడు. కాని గదాధరుడి అభిప్రాయాలతో మహేంద్రుడికి ఏకీభావం కుదరలేదు. అంతేకాదు, మహేంద్రుడు లోపల్లోపల కొంచెం అసంతుష్టుడుకూడా అయినాడు. గదాధరుడు ఇంకేమీ మాట్లాడలేదు. కొన్నాళ్ళు పోయాక మళ్ళీ అప్పుడు తీసుకు రావచ్చులే ఈ ప్రసక్తి అని ఊరుకున్నాడు.

మరికొన్నాళ్ళు గడిచాయి. మహేంద్రు డిప్పుడు నరేంద్రుడి వర్గంలో పూర్తిగా కలిసిపోయాడు. మహేంద్రుడి హృదయంలో మానవత్వం ఇంకేమీ మిగల్లేదు. గదాధరుడు ఇంకొకసారి ఆ వెనుకటి ప్రసక్తి తీసుకునివచ్చాడు. మహేంద్రుడికింక ఇప్పుడు అభ్యంతరం ఏమీ లేకపోయింది.

మహేంద్రుడి అప్రతిష్ఠ క్రమంగా వ్యాపించటం మొదలెట్టింది. కాని మహేంద్రుడి కిప్పుడు లోకభీతి అనేది ఏ కోశానాలేదు. అంచేత దీనికతడు లవలేశమయినా బాధపడలేదు.

మహేంద్రుడి తండ్రికి, చెల్లెలికి, తక్కిన ఆత్మీయులకి దీనివల్ల కొంచెం మనస్తాపం కలిగింది నిజమే. కాని. అభాగ్యురాలైన రజని మనస్సుకి తగిలినంత ఆఘాతం ఎవరికీ తగల్లేదు. మహేంద్రుడు చిత్తుగా త్రాగివచ్చి, నోటికివచ్చినట్లల్లా ప్రేలుతున్న సమయంలో—ఎవరూ ఆ చాయలకు రాకుండాఉండాలని ఉండేది ఆమెకి. మహేంద్రుడు త్రాగి తూలుతూ యింటికివస్తే, రజని అతణ్ణి ఎలాగో పట్టుకుని లోపలికి తీసుకువెళ్లి, తలుపులు వేసేసేది. అప్పుడెవరైనా చూస్తారేమో అని చాలా భయపడేది మనస్సులో. అభాగ్యురాలు మహేంద్రుణ్ణి 'అలా మాట్లాడకండి' అని వాదించటానికి కానీ, 'ఇలా చెయ్యండి' అని కాని సలహా యివ్వటానికి సాహసించేదికాదు. తనకి సాధ్యమయినంతవరకు మహేంద్రుడి దోషాన్ని ఇతరులకి తెలియనిచ్చేదికాదు. మహేంద్రుడు కట్టుతప్పి ఉన్నప్పుడు అతణ్ణి తన హృదయంతో కప్పి ఎవరికీ కనపడకుండా దాచాలని ఆమె వాంఛ పాపం! ఎవరైనా తనయెదుట మహేంద్రుణ్ణి నిందిస్తే, ఆమె వారి మాటల్ని ఖండించటానికి సాహసించేదికాదు. చాటుకివెళ్లి ఏడవటం తప్ప గత్యంతరం ఉండేదికాదు. ఆమె తన మహేంద్రుడికోసం దేవతల్ని ఎన్నో ప్రార్థించేది. కాని మహేంద్రుడు త్రాగి ఉన్నప్పుడు రజని చావుని తప్ప మరేమీ కోరుకునేవాడుకాదు. 'రజని చావటం అంటే ఎంతసేపు? కాని రజని చస్తే మిమ్మల్ని చూసేవారెవరు?' అనుకునేది ఆమె.

మహేంద్రుడు ఒకరోజు రాత్రి రెండుగంటలకి తూలుతూ వచ్చి క్రిందపడుకుని నిద్రపోయాడు. రజని మేలుకునే కిటికీలో కూర్చుని ఉంది. గబగబా వచ్చి అతడిదగ్గర కూర్చుంది. మహేంద్రు డప్పుడు తెలివి తప్పి ఉన్నాడు. రజని భయంతో మెల్లిగా అతడి తలను తన ఒళ్ళోకి తీసుకుంది. అంతకుముందెప్పుడూ ఆమె అలా చెయ్యలేదు. ఆ రోజున ధైర్యంచేసి అలా ఓ విసనకర్ర తీసుకుని మెల్లిగా విసరటం మొదలెట్టింది. తెల్లవారకట్ల మహేంద్రుడికి తెలివివచ్చి లేచాడు. విసనకర్రని దూరంగా విసిరిపారేసి, "ఇక్కడేం చేస్తున్నావ్ ? పోయి పడుకోరాదూ !" అని కసరికొట్టాడు. రజని భయంతో తొట్రుపడుతూ లేచి వెళ్ళిపోయింది. మహేంద్రుడు మళ్లీ అక్కడే నిద్రపోయాడు. ఉదయం తలుపులు తెరిచివున్న కిటికీలోంచి ఎండ అతడి ముఖం మీద పడుతూంటే, రజని మెల్లిగా కిటికీ తలుపులు మూసింది.

రజని మహేంద్రుని యెడ ఆదరణ చూపేది. కాని పైకి చూడటానికి ధైర్యం చేసేదికాదు. ఆమె చాటుగా మహేంద్రుడికి భోజనం అదీ మూతపెట్టి ఉంచేది. పక్క దులిపి వేసేది. తనకి నెలనెలా చిల్లరఖర్చులకి వచ్చేడబ్బుని మహేంద్రుడికి కావలసిన వస్తువులు కొనటానికే వినియోగించేది. కాని ఈ సంగతు లెవరికీ తెలియనిచ్చేదికాదు. ఊళ్ళో యువతులు, ఇరుగుపొరుగువాళ్ళు—ఇంతమంది ఉండగా నిర్దోషి అయిన రజని చేసే ప్రతిపనినీ తప్పుపట్టేవారు. వాళ్లేకాదు, వీలుచిక్కితే ఇంట్లో దాసీలుకూడా ఆమెని ఏదోఒకటి అనటం మానేవాళ్లుకాదు. కాని రజని వా రనే మాటలకి ఏం మాట్లాడేదికాదు. మాట్లాడగలిగేదే అయితే అన్ని మాటలు పడవలసివచ్చేదేకాదు.

రాత్రి ఇంచుమించు రెండుజాములయి ఉంటుంది. మబ్బు వేసింది. గాలిలేదు. చెట్ల ఆకుల్లో లెక్కలేనన్ని మిణుగురు పురుగులు మిలమిలలాడుతున్నాయి. మోహినివాళ్ళ యింట్లో ఒక్కరు కూడా మెలకువగాలేరు. ఈ సమయంలో వాళ్ళ పెరటి తలుపు తీసుకుని ఇద్దరు వ్యక్తులు తోటలో ప్రవేశించారు. ఒకరు చెట్టుక్రింద ఆగిపోయారు. ఒకరు యింట్లో ప్రవేశించారు. చెట్టుక్రింద నుంచున్న వ్యక్తి గదాధరుడు. ఇంట్లోకి వెళ్ళిన వ్యక్తి మహేంద్రుడు. ఇద్దరి పరిస్థితీ బాగాలేదు. గదాధరుడికి గుక్కత్రిప్పుకోకుండా ఏదో మాట్లాడాలనిఉంది. మహేంద్రుడికి దారిలోనే పడుకోవాలనిపిస్తోంది. పెద్ద వర్షం ప్రారంభమయింది. గదాధరుడు అలాగే తడుస్తూ నుంచున్నాడు. అవునుమరి. పరోపకారం తలపెట్టినపుడు ఎంత కష్టమయినా పడక తప్పుతుందా ? ఇప్పుడొక వేళ పిడుగుపడినాసరే తలఒగ్గటానికి సిద్ధంగానే ఉన్నాడు గదాధరుడు. కాని ఈమాటనే చాలాసేపు ఆలోచించి చూశాడు. తాను సిద్ధంగాలేడు, బ్రతికిఉంటే ప్రపంచాని కెంతయినా ఉపకారం చెయ్యగలడు. ఉరుములతో వర్షం కురుస్తున్నప్పుడు చెట్టుక్రింద నుంచోటం క్షేమం కాదని, ఆచ్ఛాదనలేని చోటికి వచ్చి కూర్చున్నాడు. వర్షం మరింత జోరయింది.

ఇక్కడ మహేంద్రుడు అడుగులు చప్పుడుకాకుండా మోహిని గదివైపుకి నడిచాడు. ఎంత జాగ్రత్తగా నడిస్తే అంత సవ్వడి కాక మానడంలేదు. గదిముందుకివచ్చి మెల్లిగా తలుపు కొట్టాడు. లోపలనుంచి వాళ్ళ నాయనమ్మ 'చూడు మోహినీ ! పిల్లిలాగా ఉంది' అన్నది. ఆమె గొంతు విని, మహేంద్రుడు కంగారుగా తప్పుకుని వెళ్ళిపోటానికి ప్రయత్నించాడు. ఆ హడావిడిలో వెళ్ళి పాత్రసామానుల దొంతరమీద పడ్డాడు. బిందెలమీద గిన్నెలు, గిన్నెలమీద పళ్ళాలూ పడ్డాయి. మొత్తం వాటన్నిటిమీదా మహేంద్రుడు పడ్డాడు. అవన్నీ పడటంతో ధన్ ధన్ మని చప్పుడయింది. బిందెల్లో నీళ్లు ఒలికి గలగల చప్పుడయినాయి. 'ఏమి టది ? ఏమి టది ?' అని యింట్లో కలవరం ప్రారంభమైంది. తల్లి లేచింది. అక్క లేచింది. పసివాడు 'క్యార్' మని ఏడ్చాడు. నాయనమ్మ పక్కమీదేఉండి, పాడుపిల్లిని తిట్టిపోసింది. మోహిని దీపం చేత్తోపుచ్చుకుని బయటికి వచ్చింది. చూస్తే మహేంద్రుడు గబగబా దగ్గరకువెళ్ళి 'పారిపో,పారిపో.'అన్నది మెల్లిగా. మహేంద్రుడు పారిపోవటానికి ప్రయత్నించాడు. మోహిని చేతిలోఉన్న దీపాన్ని ఆర్పేసింది. నాయనమ్మకి కళ్ళయితే కన్పించవుకాని, చెవులు విన్పిస్తాయి. మోహిని మాటలు విన్పించాయి. ఆమె గబగబా గదిలోంచి బయటికివచ్చి — "ఎవరినే పారిపొమ్మంటున్నావ్ మోహినీ ?" అని అడిగింది. నాయనమ్మకి చీకట్లో యేమీ కన్పించలా. కాని పారిపోతున్న అడుగుల చప్పుడు విన్నది. ఇంతలో ఇంట్లోవాళ్ళంతా పోగయారు.

మహేంద్రుడు మరోదారిని పారిపోయాడు. ఇక్కడ గదాధరుడు తోటలో కూర్చుని తడుస్తున్నాడు. చాలాసేపు అలా కూర్చుని, కొంచెం నిద్రమబ్బు రావటంతో పడుకున్నాడు. నిద్రపోతూ కలగనటం మొదలెట్టాడు — తాను ఉపన్యాసం ఇస్తున్నట్లు, సభికులు చప్పట్లు కొడుతున్నట్లు, ఆ సభకు గవర్నర్ జనరల్ వచ్చాడు. ఉపన్యాసం ఆగిపోగానే అతడు చాలా సంతుష్టుడై దగ్గిరకువచ్చి షేక్‌హాండ్ యిస్తుండగా — పృష్ఠంమీద ఒక్క దెబ్బ పడింది. కంగారుగా లేచి కూర్చున్నాడు. "ఇక్క దేం చేస్తున్నావ్ ? ఎవరునువ్వు ?" అని అడిగారు ఒకరు. గదాధరుడు జడితకంఠంతో "దేశ సంస్కరణకి — సంఘ సంస్కరణకి ప్రాణా లివ్వటం ప్రతి మానవునికీ కర్తవ్యం. హాయిగా కడుపునిండా తింటూ, కాలుమీదకాలు వేసుకుని కూర్చుందా మనుకునే వాళ్ళు కంఠానికి ఉరిపోసుకుని చచ్చినా దేశానికి నష్టం యేమీలేదు. దేశ సంస్కరణ తలపెట్టినప్పుడు రాత్రిలేదు, పగలులేదు. తన యిల్లనిలేదు, పరాయిఇల్లనిలేదు. ఎప్పుడు ఎక్కడికి వెళ్ళినా అభ్యంతరం ఉండకూడదు. ఎలాంటి విఘ్నాన్నీ లక్ష్యపెట్ట

కూడదు. ఈ ఉద్దేశంతో తన సాధన ఫలింపచేసుకోటానికి ప్రయత్నించాలి. అలా ప్రయత్నించనివాడు పశువు. పశువు, పశువు. అందుకనే"— ఇంక ముందుకు పోనక్కర్లేకపోయింది. ఒంటి మీద పడుతున్న దెబ్బలకి హూనం హూనం అయేట్లుంది ఒళ్లు. ఇంకాస్సేపుఉంటే, గదాధరుడింక ఉపన్యాసాన్ని కట్టిపెట్టి. చనిపోయిన తన తల్లిని. తండ్రిని, బ్రతికిఉన్న సోదరుల్ని. జనాన్ని కేకెయ్యటం మొదలెట్టాడు. మరీ రభసచేస్తే తమ యింటి గౌరవానికే భంగమని భయపడి, వారు అతణ్ణి మెల్లిగా బయటికి సాగనంపారు.

మోహినిమీద ఇంట్లోవాళ్ళందరికీ పెద్ద అనుమానం కలిగింది. రాత్రి ఎవరు వచ్చారో. ఎవరిని పారిపొమ్మన్నదో — ఈ సంగతి బయటికి లాగటానికి ఆమెమీద కఠినమైన ఒత్తిడి ప్రారంభమైంది. కాని ఎంత ఒత్తిడి చేసినా మోహిని నోరు మెదల్పలేదు. కాని ఇది దాగే విషయంకాదు. మహేంద్రుడు పారిపోయేప్పుడు చెప్పులు ఉత్తరీయం విడిచిపెట్టి పోయాడు. దాంతో ఇది మహేంద్రుడి పనే అని అందరూ అనుకున్నారు. నీలాటిరేవులో, రచ్చబండ దగ్గిర. ఊళ్ళో ఎక్కడచూసినా ఇదే ప్రసక్తి. మోహిని ఇంట్లోంచి బయటికి వెళ్ళిపోవక తప్పలేదు. అందరూ ఆమెకేసి ఓరగా చూసి మాట్లాడేవారు. పైకి మాట్లాడకపోయినా వారి మనసులో ఉన్నది తన మాటే అనిపించేది. దారిలో ఎవరైనా నవ్వుతూ మాట్లాడుకుంటూంటే — తనని గురించే నవ్వుకుంటున్నారనిపించేది. కాని మోహిని తప్పు యేమీలేదు....

## ౬

మహేంద్రుడు రాత్రి తిరిగి యింటికి వచ్చేసరికి ఇంకా చాలా ప్రొద్దు ఉంది. మైకం చాలావరకు వదిలిపోయింది. మహేంద్రుని మనస్సులో ఇప్పుడు తీవ్రమైన పశ్చాత్తాపం ప్రారంభమయింది. సిగ్గుతో, అసహ్యంతో, కోపంతో కుమిలిపోతూ పడుకున్నాడు. చిన్ననాటి స్మృతులు ఒక్కొక్కటే అతడి హృదయానికి ములుకుల్లా గ్రుచ్చుకుంటున్నాయి. తొలి యౌవనపు పొంగులో భవిష్యజ్జీవితాన్ని గురించి ఎంత హృద్యమైన చిత్తరువు అతడి హృదయంలో హత్తుకుపోయింది! ఎన్ని ఆశలు : ఎన్ని ఊహలు అతడి మనసులో పెనవైచుకుపోయాయి. యౌవన సుఖస్వప్నాల్లో మాతృదేశపు చరిత్రలో తన అభిమానం ప్రత్యక్షరంలోనూ సగౌరవంగా అభివ్యక్తమవుతుందనీ, తన జీవితం దేశీయ సోదరులకు ఆదర్శప్రాయ మవుతుందనీ. భవిష్యత్తు తన యశస్సును పెంపొందింప చేస్తుందనీ అనుకున్నాడు. కాని ఆ హృదయం, ఆ ఆశలు, ఆ ఊహలు ఈనాడిలా పరిణమించాయి. తన యశస్సు కళంకితమైంది. నైతికంగా భ్రష్టుడయినాడు తాను. మనస్సు వికృత రూపాన్ని ధరించింది. కులవధువులు తాను కంటపడితే దూరంగా తప్పుకుపోతారు. మిత్రులు సిగ్గుతో తలలు వంచుకుంటారు. శత్రువుల పెదవులమీద వికృత పరిహాసం తొంగి చూస్తుంది. తన ఈ అనపేక్షిత పరిణామాన్నిచూసి వృద్ధులు విచారిస్తారు. యువకులు చాటున గేలిచెయ్యటం మొదలెడతారు. అన్నిటికంటె తను నిరపరాధినియైన వితంతువు పవిత్రనామానికి కళంకం తెచ్చిపెట్టినవాడయాడు. ఆమె ఇహ తలయెత్తుకోటానికి వీలుండదు. మహేంద్రుడు మనస్సును దహింపచేస్తున్న దుఃఖంతో మంచంమీద పడుకుని కుర్రవాడిలా ఏడవడం మొదలెట్టాడు. మహేంద్రుడి ఏడుపు చూస్తుంటే రజనికి ఎంత రంపం కోత గా ఉందో అది ఆమెకే తెలుసు. 'మీకు ఏం జరిగిందో చెప్పండి, దాని ప్రతీకారానికి అవసరమైతే నా ప్రాణా లివ్వమన్నా ఇస్తాను' అని అనుకున్నది తనలో. రజని ఇంక ఊరుకుని ఉండలేకపోయింది. మెల్లిగా భయభయంతో మహేంద్రుడి దగ్గరకు వచ్చి కూర్చుంది. అతడి కాళ్ళు పట్టుకుని 'ఏం జరిగింది?' అని అడిగి తెలుసుకుందామని ఎన్నోసార్లు అనుకుంది. కాని సాహసించలేకపోయింది. నోట్లో మాట నోట్లోనే ఉండిపోయింది. మహేంద్రుడు ఉద్వేగంతో గబగబా మంచంమీదినుంచి లేచి వెళ్లిపోయాడు. తాను దగ్గిరకు రావటంవల్లనే అతడు లేచి వెళ్లిపోతున్నాడనుకుంది రజని. ఇంక మాట్లాడకుండా ఊరుకోలేకపోయింది. భయకంపిత కంఠంతో 'నేను వెళ్లిపోతున్నాను, మీరు పడుకోండి,' అన్నది. మహేంద్రుడు దానికి జవాబేమీ చెప్పకుండా పరధ్యానంగా వెళ్లిపోయాడు.

మెల్లిగా వెళ్ళి కిటికీలో కూర్చున్నాడు. అప్పటికి మేఘవిముక్తుడయిన చతుర్దశిచంద్రుడు వెన్నెల వెదచల్లుతున్నాడు. కిటికీ దిగువున చెరువు. చెరువు ఒడ్డున వరుసగా దట్టంగా ఉన్న కొబ్బరిచెట్ల చివళ్ళమీద తెల్లటి వెన్నెల కిరణాలు పడుతున్నాయి. జ్యోత్స్నామయమైన గ్రామం కనిపిస్తున్నంత మేర ఎంతో ప్రశాంతంగా. పవిత్రంగా—ఇక్కడ ఏ పాపతాపాలు, దుఃఖబాధలూ లేనట్లు, వాత్సల్యమూర్తినియైన తల్లి ఒడిలో కొంతమంది పసిపిల్లలు కలిసి పడుకుని నిద్రపోతున్నట్లు నిద్రపోతోంది. మహేంద్రుడి మనస్సు ఉదాసీనమయింది—'అందరూ నిద్దరోతున్నారు. ఎవరికీ ఎలాంటి దుఃఖమూలేదు కష్టమూలేదు. రేపు ప్రొద్దున్నే మళ్లీ నిశ్చింతగా లేస్తారు. తమతమ పనులు చేసుకుంటారు. ఎవరూ—పృధివి విపర్ణమైతే పోయి ముఖం దాచుకోవాల్సిన పని చెయ్యలేదు. ఎవరూ అనుక్షణ పశ్చాత్తాపంతో హృదయం కుమిలిపోయే పనిచెయ్యలేదు. నేనుకూడా ఇలా నిశ్చింతగా నిద్రపోగలిగితే. నిశ్చింతగా మళ్ళీ నిద్రలేవగలిగితే! నాకు నచ్చిన వివాహమే కనుక జరిగిఉంటే—గృహస్థులలాగా ఏ దుఃఖమూ లేకుండా సంసారయాత్ర నిర్వహించగలిగేవాణ్ణిగా! భార్యని ఎంత ప్రేమించేవాణ్ణి! ఎంత సహజంగా పగలు అయినాక రాత్రి, రాత్రి



"హీరోయిన్ వేశానని అట్టా ఎందుకు మిడిసి పడతావు?... నీ వేస్తూవున్నపాత్రనే స్టేజిమీద వెలిగించి వెలిగించి, ఇదే పేరు, కథగల మొదటి చిత్రంలో ఇంత మేకప్ బరువు మోయనవసరంలేకుండానే కనకవర్షం కురిసేలానటించి ఇప్పుడు అదే హీరోయిన్ పాత్రకు తల్లి నయ్యాను; ఈ వేషాన్నే ఇంకోసారికూడ వేస్తానని నా నమ్మకం"

---

తర్వాత పగలు గడిచిపోయేవి! రాత్రిళ్ళు అంతా మేల్కొని పగలల్లా నిద్రబోతూ ఈ విరక్తిమయ జీవితాన్ని గడపవలసి వచ్చేదికాదు. ఆహా? ఎలాంటి వెన్నెల: ఎలాంటి రాత్రి; ఎలాంటి పృథివీ! చీకటిగాడ్పు కొబ్బరిచెట్లు శిరస్సులమీద వెన్నెలవ్యాపింప చేసుకుని, గంభీరంగా ఒకదాని ముఖాలొకటి చూసుకుంటూ ఉన్నాయి—వాటి హృదయాల్లో ఏదో ఒకమాట దాగివున్నట్లు—వాటి చీకటినీడలు, చీకట్లోని తటాకపు నీళ్ళలో నిద్రిస్తున్నట్లున్నాయి అని అనుకోసాగాడు. మహేంద్రుడు కొంతసేపుచూస్తూ ఉండిపోయాడు. తర్వాత ఓ నిట్టూర్పు విడిచి, 'ప్రాపంచిక సుఖాన్ని చక్కగా అనుభవించటం నా నొసట వ్రాసిపెట్టలేదు,' అనుకున్నాడు. మహేంద్రుడు ఆ రాత్రే ఇల్లువిడిచిపెట్టి పోవటానికి నిశ్చయించుకున్నాడు. పృథివిలో ప్రేమించినవారిని పూర్తిగా మరిచిపోదామనుకున్నాడు. ఇంతవరకూ లోకానికి ఏ ఉపకారం చెయ్యలేకపోయాడు. కాని ఇహనుంచి పరోపకారానికై తన స్వాతంత్ర్య జీవితాన్ని ధారపోయాలనుకున్నాడు. కాని ఇంటి దగ్గిర రజనిని ఒంటరిగా వదిలేసి వచ్చాను. ఆ నిరపరాధిని ఏం కష్టపడుతోందో. దానికి ప్రాయశ్చిత్తమనేది యెలా? దీన్ని ఆలోచించాలంటే చాలాసేపు ఆలోచించాలి కాని మహేంద్రుడికి ఆలోచించాలని బుద్ధిపుట్టలేదు. ఆలోచించలేకపోయాడు. మహేంద్రుడు తన అపరాధాలకు, దోషాలకు వచ్చిన అపవాదులనన్నీ రజనిని సహించనిచ్చి, ఇంట్లోంచి వెళ్ళిపోయాడు. గాలి స్తంభించిపోయింది. పల్లెటూరి కాలిబాట దారిన పోతూంటే రెండు వైపులా ఉండే కొబ్బరిచెట్లు స్తబ్ధగంభీరభావంతో నిలిచినట్లున్నాయి. ఆ చీకటిదారిని పడి, తుపాను రాత్రివేళ గాలిచేత తరిమి వేయబడే మేఘంలాగా, మహేంద్రుడు తన యిచ్ఛవచ్చిన దిక్కుగా వెళ్లిపోయాడు.

తాను దగ్గిరకు రావడంవల్లనే మహేంద్రుడు వెళ్లిపోయాడనుకుంది రజని. కిటికీలో కూర్చుని, వెన్నెల్లో నిద్దరోతున్న చెరువులోని నీళ్ళవైపుకు చూస్తూ ఏడవటం మొదలెట్టింది.

౭

'ఏమిటీ విపత్తు? నరేంద్రుడింటికి రాడు ఎందుకని?' అని దిగులు పడసాగింది కరుణ. మనసు ఉండపట్టక చిన్నప్పటినుంచి యింట్లోఉన్న దాసీ భవిని నరేంద్రుడెందుకు రావటంలేదని అడిగింది. భవి నవ్వి. "నాకేం తెలుసు?" అన్నది. "అహఁ. నీకు తెలుసు" అన్నది కరుణ. "అమ్మో? నేనెలా చెప్పేది?" అన్నది భవి. కరుణ ఏ మాటా వినిపించుకోలేదు. నరేంద్రు డెందుకు రావటంలేదో భవి చెప్పక తప్పదు. కాని ఎంత పీడించినా భవి దగ్గిరనుంచి సరియైన సమాధానం యేమీ రాలేదు. కరుణ చాలా విసుక్కుని, ఏడ్చి, చివరికి 'మంగళవారంలోగా కనుక రాకపోతే తనకి ఉన్న బొమ్మలనన్నిటినీ తీసుకెళ్ళి చెరువులో పారేస్తా' నని శాబ్ది చేసింది. 'బొమ్మల్ని పారేసినంత మాత్రాన నరేంద్రుడు రావటానికి సదవకాశం కలుగుతుందనుకోటానికి ఏమీలేదు' అన్నది భవి. కాని ఆమె మాట వినిపించుకునేదెవరు? రాకపోతే బొమ్మల్ని విరక్కొట్టి పారేసి తీరుతుంది.

నిజంగా నరేంద్రుడు చాలారోజులనుంచి ఊరికి రావటమేలేదు. కాని అతడు రాకపోవటంవల్ల ఊళ్ళోవాళ్ళు బ్రతికిపోయారు. ఎంచేతంటే ఇటీవల నరేంద్రుడు ఊళ్లోకి వస్తున్నాడంటే అతడి వెంట రెండుమూడు కుక్కలు, వాటికంటె చిరాకు కల్గించే నలుగురయిదుగురు స్నేహితులు వెంట ఉంటున్నారు. అందరూ కలిసి ఉన్న రెండు మూడురోజుల్లో ఊరిని ఒక కొలిక్కి తీసుకువస్తుంటారు. మన పండితమహాశయుడికి ఈ కుక్కల్ని చూస్తే చాలు—ఎక్కడలేని కంగారు.

ఏమయితేనేం— పండితమహాశయుని వివాహాన్ని గురించి ఊళ్ళో ఎగతాళిగా చెప్పుకుంటున్నారు. కాని అతడు ఇరవైముప్ఫయి చిలుందమ్ములు లాగి, అరడబ్బా నస్యం పీల్చి, అభిమాన కుంచితములైన నవగృహిణీ భ్రూమేఘాల్లో తొణికే ఒకటిరెండు మెరుపులకి ఇలాంటివన్నీ ఎగరకొట్టి పారేస్తుంటాడు. నిధిరామ్ తప్ప పండితమహాశయుని ఇంట్లోంచి బయటికిరప్పించగలవా రెవరూలేరు. పండితమహాశయుడీమధ్య అద్దం ఒకటి కొన్నాడు. సులోచనాల జోడుకి బంగారు ఫ్రేమ్ వేయించుకున్నాడు. పొరుగూరునుంచి ఎక్కడినుంచో సన్నటి యజ్ఞోపవీతాలు తెప్పించి వేసుకున్నాడు. అతడి పత్ని కాత్యాయని ఇరుగుపొరుగువాళ్ళతో— "ఇంతోటి ఆయనా ఈ మధ్య ముసిముసి నవ్వులు నవ్వుతూ బొజ్జ విరుచుకుంటూ రసికత్వం వెలగబెట్టాలని తంటాలుపడుతున్నారు" అని ఈసడింపుగా అంటూ ఉంటుంది. కాని పండితమహాశయుని గురించి ఇదివరకెప్పుడూ ఇలాంటిమాట వినలేదు. అతడి రసికతను గురించి మాకున్న అనుభవాన్నిబట్టి చూస్తే, అందులోని ఆంతర్యం తెలుసుకోవటం అసాధ్యం. అందులో ప్రకృతి, పురుషుడు, మహత్, అహంకారం, ప్రమా, అవిద్య, రజ్జుసర్పభ్రమ, పర్వతోవహ్నిమాన్ ధూమాత్—ఇలాంటి దార్శనికపు గొడవలు చాలా ఉంటాయి. పండితమహాశయుని వేదాంత చర్చలమీద, సాంఖ్య సిద్ధాంతాలమీద సాలీళ్ళు గూళ్ళు అల్లేశాయి. ఇటీవల జయదేవుడి గీతగోవిందాన్ని తీసుకుని, దానిలోని భావాలతో ఊరిపోతున్నాడు. ఇదీ పండితమహాశయుడి ప్రకృత స్థితి. పోతే మన కాత్యాయనమ్మగారు వచ్చిన మర్నాటినుంచీ ఆ వాడని జరిగే ఆడవాళ్ల సమావేశాలకి ఎక్కడలేని ఉత్సాహాన్ని కలిగించింది. మాటకారితనంలో ఆమెకి సాటివచ్చేవా రెవరూలేరు. కళ్లూ చేతులూ త్రిప్పుతూ పధ్నాలుగు భువనాల్లోని వార్తలనూ ఏకరువు పెడుతుంది. కలకత్తా నగరం ఎలా ఉంటుందో చూద్దామని ఒకామె వెళ్లింది. కాత్యాయని ఆమెకి కలకత్తాలో పెద్దపెద్ద మైదానాలున్నాయని, దొరలక్కడ వ్యవసాయం చేస్తారని, రోడ్లకి రెండు వైపులా తెల్ల సిపాయిలు కాపలా ఉంటారని—ఇలా ఎన్నెన్నో చెప్పింది. అన్నీ సరిగ్గా జ్ఞాపకంకూడా లేవు. కాత్యాయనికి వలమాలిన పతిభక్తి ఉండేది. అయితే పతిభక్తికి సంబంధించిన నిందావాక్కులు ఆమెదగ్గర విననన్ని ఇంకెవరిదగ్గరా వినబోము. ఊళ్ళో ఆడవాళ్ళ అనుపానులన్నీ ఆమె కొనగోటిని ఉండేవి. ఆమెకి మరొక స్వభావం మాత్రం ఉండేది—తనకు అనవసర ప్రసక్తి అంటే అసలు కిట్టనే కిట్టదని. వాళ్ళ బిందుబోస్‌గారి పెద్ద కోడలూ—వాళ్ళలాగా లోకుల్ని ఆడిపోసుకునేవాళ్లు ఇంకెవరూ ఉండబోరని, గంటగంటకీ—ఎక్కడ మరచిపోతారో అని జ్ఞాపకం చేస్తూ ఉండేది. కాని ఏమాటకి ఆమాటే—కాత్యాయని అనాకారి యేమీకాదు. అయితే ఆ చూపు, ఆ నడక ఆ తీరు అవన్నీ అదొక రకంగా ఉంటాయి. కొంతకొంతమంది కలాంటివి స్వాభావికాలు ...

౮

నరేంద్రుడికి దురభ్యాసాలు చాలా అలవడ్డాయి. నిజమే. కాని వాటినన్నిటినీ కరుణకి ఎవరు చెపుతారంటారు ? ఆ అభాగ్యురాలు అతణ్ణి పరిపూర్ణంగా విశ్వసించి పగటికలలు కంటోంది. వాటికి అంతరాయం కలిగించటంవల్ల ఏమిటి ప్రయోజనం ? ఆమెకి అవన్నీ ఏమీ తెలియవు. అసలు చెవినిపడనీయదుకూడా. అయితే అహోరాత్రాలు చెవికింద అదే పోరు అయితే ఒకటిరెండు మనస్సుకి ఎందుకు గ్రుచ్చుకోవు ? అంత ప్రఫుల్లంగాఉండే కరుణ ముఖం ఒకటిరెండుసార్లు చిన్నవోలేదనా ? కాని నరేంద్రుడు దగ్గరకురాగానే వాటినన్నిటినీ మరచిపోయేది. అడుగుదామంటే జ్ఞాపకం ఉండేవేకావు. అంత అవకాశమూ చిక్కేదికాదు. ఆమెకి ఎంత చెప్పుకున్నా తరగని సంగతులు ఎన్నెన్నో ఉండేవి ఇంకా. వాటికే టైం సరిపోయేదికాదు. అది వేరేగాథ. కాని కరుణ ఇలాగే ఉండాలంటే ఎక్కువరోజు లుండలేదు, ముందుగానే చెపుతున్నా, నరేంద్రుడు చేస్తున్న అన్యాయాలు చెప్ప నలవికానివి. నరేంద్రుడిప్పుడు కలకత్తా అంతగా వెళ్ళటమేలేదు. కరుణని ప్రేమిస్తున్నాడని ఇప్పుడింక ఎవరూ పొరపాటునయినా అనుకోరు. కలకత్తాలో ఎక్కడచూసినా అప్పులే అతడికి. అప్పులవాళ్ళ భయంతో అతడు కలకత్తా వదలి పరారయినాడు.

రోజురోజుకీ కరుణ ముఖం దిగులుగా ఉంటోంది. నరేంద్రుడు కలకత్తాలో ఉన్నన్నాళ్ళూ బాగానేఉంది. ఇరవైనాలుగ్గంటలూ కళ్ళయెదుట కన్పించే వాళ్ళని ఎలా గుర్తించటం ? నరేంద్రుడి స్వభావం కరుణకి క్రమక్రమంగా తెలిసిరావటం మొదలెట్టింది. కరుణకి అదేమీ బావుండలేదు. ఎప్పుడూ చిరచిరలే, ఎప్పుడూ చికాకే. ఒక్కక్షణంకూడా ముఖం సరీగ్గాపెట్టి మాట్లాడియెరుగడు. కరుణ సంతోషంతో ఉప్పొంగిపోతూ దగ్గిరకువస్తే — ఆ సంతోషమంతా చటుక్కున ఎగిరిపోయేటంత ఇదిగా కస్సుమనేవాడు. కరుణ తనసంగతులన్నీ అతడితో చెప్పుకోటానికి సాహసించలే

నంత కొరకొరలాడుతూ ఉండేవా డెప్పుడూ, దగ్గిరకు వెడితే ఏం కోపపడతాడో అని — అన్నప్పుడల్లా అతడి దగ్గిరకి వెళ్ళటానికి భయపడేది. అదీకాక సాయంత్రమప్పుడు అతడి చాయలకు వెళ్ళటానికే వీలుండేదికాదు. అతడు త్రాగివచ్చి ఇష్టంవచ్చినట్లల్లా ప్రవర్తించేవాడు. ఏమయితేఏం కరుణ ముఖం రోజురోజుకీ వాడిపోతూఉంది. కొంచెం అభిమానం వచ్చినప్పుడు, ఆశించినది ఒట్టిదయినప్పుడు తప్ప ఇప్పుడామె కళ్ళవెంట నీళ్ళే వచ్చేవికావు. ఇప్పుడా అభాగ్యురాలు మనోవేదన భరించలేక ఏడుస్తూఉంటుంది. చిన్నప్పటినుంచీ ఎన్నడూ అనాదరణని, నిర్లక్ష్యాన్ని చవిచూసి యెరుగ దామె. ఈనాడు ఆదరంతో ఆమె అభిమానాశ్రువులను తుడిచే వారే లేరు. అభిమానానికి ప్రతిఫలంగా ఆగ్రహానికి గురికావలసి వస్తోంది. ఏమయినా కరుణ ఇంక వెనుకటిలాగా ఆడుకోవటం మానేసింది. తన పెంపుడు పక్షిని తీసుకుని అంతఃపురం తోటలోకివెళ్లి కూచుంటూ ఉంటుంది. నరేంద్రు డెప్పుడైనా మధ్య మధ్య ఓరోజు కలకత్తా వెడితే — కరుణ ఒకొకసారి వెన్నెల రాత్రి ఆతోటప్రక్కన పావంచాలమీద పడుకుని గడపటంకూడా కద్దు. ఏమేమి ఆలోచిస్తూ ఉంటుందో తెలియదు. కాని నిద్రావిహీనములైన ఆమె కళ్లముందు రాత్రిఅంతా గడిచిపోయి తెల్లవారుతూంటుంది.

౯

నరేంద్రు డెలా విచ్చలవిడిగా ఖర్చుపెడతాడో అలా అప్పులు కూడా చెయ్యసాగాడు. అతడు స్వయంగా ఒక్కపైసాగూడ సంపాదించి యెరుగడు. కనుక అతడికి డబ్బుమీద కాపీనంకూడా లేదు. కుటుంబ పోషణకు, రక్షణకు గాని డబ్బుసంపాయిస్తూ ఉంటారు, కూడపెడుతూ ఉంటారనేది అతడి ఊహకి అందని విషయం. కాస్త కాస్త అప్పు—క్రమంగా పెరిగిపెరిగి కొండంత అయింది. చివరికి యింట్లో పాత్రసామానులుకూడా ఒకటీ—అర తాకట్టు పెట్టాల్సిన దుస్థితి వచ్చింది.

కరుణ ఆరోగ్యం పాడయింది. నిద్రాహారాల విషయాల్లో నియమాలేమీ పాటించక పోవటంవల్ల అనారోగ్యం పట్టుకుంది. 'రాత్రింబగళ్లు ఎప్పుడూ ఈ సుస్తీతో నేను సతమతం కాలేను. అంచేత చికాకుగావుండి కలకత్తా వెడుతున్నాను' అన్నాడు నరేంద్రుడు. ఇక్కడ కరుణను కనిపెట్టుకుని ఉండేవారెవరో తెలియదు. పండిత మహాశయుడేదో చేతనైనంతవరకు కనిపెట్టుకునే ఉంటున్నాడు. కాని అతడివల్ల ఎంతవరకు అవుతుంది? కరుణ ఏమందూ పుచ్చుకోవడానికి ఒప్పుకోదు. ఏ జాగ్రత్తా తీసుకోదు. కరుణకి జబ్బు ఎక్కువయింది. పండిత మహాశయుడు చాలా కంగారు పడిపోయి, నరేంద్రుణ్ణి రమ్మని ఒక ఉత్తరం రాశాడు. నరేంద్రుడు వచ్చాడు. కాని కరుణకు జబ్బు ఎక్కువయిందన్న వార్త తెలిసికాదు. కలకత్తాలో అతడి అప్పులుపెరిగి, బాకీదార్లు అతడిమీద దావాలు వెయ్యటం మొదలెట్టడంతో—పరిస్థితులేమీ బాగాలేవని అతడు అక్కడినుంచి తిరిగి వచ్చాడు.

నరేంద్రుడి కీసారి కొంచెం భయం పట్టుకుంది. తిరిగి వచ్చినప్పటిచుంచి తలుపు బిడాయించుకుని ఇంట్లోనే కూర్చుంటున్నాడు. మదిరా పాత్రతో మనస్సులోని భయాలనన్నిటినీ మరిచిపోవాలని ప్రయత్నిస్తున్నాడు. ఎవర్ని కలుసుకోవటమూ లేదు, మాట్లాడటమూలేదు. అతడి గదిలోకి ఎవరూ అడుగు పెట్టడానికీ వీల్లేదు. నరేంద్రుడెంత చిరచిరగా తయారయాడంటే, నౌకర్లు—చాకర్లు కూడా అతడి చాయలకు పోవాలంటే హడలిపోతున్నారు. సుస్తీగా ఉన్న కరుణ, అతడికి ఆహారాన్ని తీసుకుని గదిలోకి వచ్చింది. "నిన్నెవరు రమ్మన్నారు ఇక్కడికి?" అంటూ నరేంద్రుడు మండిపడ్డాడు. ఈ ప్రశ్నకి సమాధానం ఏం చెపుతారు ఎవరైనా! తర్వాత ఆ దైత్యుడు చేసినపని ఊహించటానికి అలవికానిది. జబ్బుగా ఉన్న కరుణను నిర్దాక్షిణ్యంగా కాలితో తన్నాడు. ఆ తాపుకి ఆమె అక్కడే మూర్ఛపోయింది. నరేంద్రుడు ఆగదిలోంచి మరొక చోటికి వెళ్ళిపోయాడు.

కొద్దిరోజులకే, కరుణచూస్తే గుర్తుపట్టటానికి వీల్లేనంతగా మారిపోయింది. చిక్కి పాలిపోయిఉన్న ఆమెముఖంచూస్తే ఎంత జాలేస్తుందో చెప్పలేం. నరేంద్రుడింక ఆమెయెడ ఎన్ని అత్యాచారాలు చెయ్యాలో అన్నీ చెయ్యటం మొదలెట్టాడు. సరళహృదయ అయిన ఆమె అన్నిటినీ సహించి ఊరుకుంది. ఒక్కమాటకూడా ఎదురు చెప్పలేదు. నరేంద్రుడి దగ్గిర ఒక్కక్షణం ఏడవనుకూడా లేదు. ఒక రోజున మాత్రం మరీ బాధ కలగటంతో నరేంద్రుడి ముఖంకేసి చూస్తూ ఉండి ఉండి—"నేను మీకేంచేశాను?" అనిమాత్రం అడిగింది. నరేంద్రుడు దానికి సమాధానం ఏమీ చెప్పకుండా ఎక్కడికో వెళ్ళిపోయాడు.

౧౦

ఒక్కసారి అప్పుల సుడిగుండంలోపడితే ఇహ అందులోంచి బయటపడటం ఉండదు. కొందరు దావాలు చేస్తామని భయపెట్టగానే నరేంద్రుడు మరొకరిదగ్గర అపరిమితమైన వడ్డీకి అప్పు తీసుకువచ్చి, ఈ అప్పులు తీర్చటం మొదలెట్టాడు. ఇలా అనటం కంటె వడ్డీ విపరీతంగా పెరిగింది. నరేంద్రుడు చాలా కంగారు పడిపోయాడు. దావాలు పడ్డాయి. సమనులు వచ్చాయి. ఒకనాడు ఉదయం శుభమూహూర్తాన నిద్రలేవగానే, శ్రీకృష్ణ జన్మస్థానానికి తీసుకువెళ్ళారు.

పాపం. కరుణతిండీ—తిప్పలు మాని ఒకటే ఏడవటం మొదలెట్టింది. ఏం చెయ్యటానికీ పాలుపోలేదు. పండిత మహాశయుడీ దుర్వార్త విని, చాలా కంగారుపడి పోయాడు. కాని ఏమిటి

చెయ్యటం అన్న విషయంలో—కరుణకి ఎంత తెలుసో—అతడికీ అంతే తెలుసు. ఎంతో కిందామీదాపడి ఆలోచించి. చివరకు నిధికి కబురుచేశాడు. నిధి ఇంట్లో వస్తువులూ అవీ అమ్మి ఆ బాకీసొమ్ము కట్టెయ్యమని సంహా ఇచ్చాడు. ఎవరు విక్రయిస్తారు? ఆ భారం ఎవరిపైన వేసుకుంటారు? కరుణ నగలు ఎన్నోలేవు. చాలావరకు అప్పటికే తాకట్టు పెట్టాడు నరేంద్రుడు. మిగిలినవేవో తీసుకువచ్చి ఇచ్చింది కరుణ. నిధే ఆ నగల్ని—మరికొన్ని ఇంట్లో వస్తువుల్నీ ఏదో సామాన్యమైన ధర ఇచ్చి, కొన్నిటికి అసలివ్వకుండానూ తీసుకుని విక్రయం చేయించాడు. పండిత మహాశయుడు ఏడుస్తూ కూర్చున్నాడు. భయంతో. బాధతో కరుణ బేజారయిపోయింది. అమ్మగా వచ్చిన కాస్త మొత్తానికి, పండిత మహాశయుడు—కూడ పెట్టుకున్న తనడబ్బులోంచి కొంత మొత్తాన్ని చేర్చి—ఇవ్వవలసిన బాకీ మొత్తాన్ని ఎలాగో సరిపుచ్చాడు. నరేంద్రుడు జైలునుంచి విముక్తుడయినాడు. కాని ఋణాలనుంచి విముక్తుడు కాలేదు. అది కాక ఈ సంఘటన అతడికేమీ గుణపాఠం కాలేదు. ఎలా అయినా సరే ఇప్పుడు మద్యం లేనిదే గడవదు అతడికి. పైగా కరుణ వస్తువులూ అవీ అమ్మినందుకు—బాధపెట్టసాగాడు.

గదాధరుడు—స్వరూప్ ఇక్కడికికూడా సిద్ధమయినారు. అప్పుడు అన్నిదెబ్బలు తిన్నా గదాధరుడికి అంతఃపుర సంస్కరణ ప్రియత్వం ఏమీ తగ్గలేదు. పైగా పెరిగిపోయింది. ఎక్కడికి వెళ్ళినా అతడికి అహర్నిశలూ అదేచింత. నరేంద్రుకి ఊరు రావటంలో కూడా ఆంతర్యం ఇదే. ఇక్కడకూడా ఒకటి రెండు సాధించాలని తాపత్రయం. పాత మిత్రులువచ్చి కలుసుకోవటం నరేంద్రుడికి చాలా ఆనందంగాఉంది. స్వరూప్—గదాధరుల దగ్గిర ఇంకా మరి కొంత ఋణం చేశాడు. నరేంద్రుడి ఆస్తిఅంతా హరించిందన్న సంగతి వారికి తెలియదు. అంచేత నమ్మకంతో—మంచివడ్డీ వస్తుందికదా అన్న ఆశతో అప్పు ఇచ్చారు. గధాధరుడికిప్పుడు పెద్దపని తగిలింది. కాత్యాయని వృత్తాంతమంతా నరేంద్రుడు చెప్పగా విన్నాడతడు. విని చాలా మండిపడిపోయాడు. వివాహితులైన స్త్రీపురుషులమధ్య ఇంతటి వయో వ్యత్యాసాన్ని సహృదయుడైన మానవుడెవ్వడూ సహింపజాలడు. ముఖ్యంగా సంఘ సంస్కరణే తమ జీవిత లక్ష్యంగా పెట్టుకున్నవారు, ప్రధానాశయంగా భావించినవారు, అవకాశానికై ఎదురుచూస్తున్నవారు, కార్యాచరణే ముఖ్యకర్తవ్యంగా యెంచినవారు—సంఘంలోని ఈ దురాచారాల్ని, దురాగతాల్ని అసలు సహించలేరు. దీన్నిసరిదిద్దటానికి, ఇలా అన్యాయంగా వివాహం కావింపబడిన స్త్రీల కష్టాన్ని నివారించటానికి—సర్వవిధాల యిక త్యాగాన్ని చెయ్యటం సంస్కర్తల కర్తవ్యం. కనుక మన కాత్యాయినీ దేవిని ఉద్ధరించటానికి గదాధరుడు సర్వవిధములయిన త్యాగాన్ని చెయ్యటానికి సంసిద్ధుడయి ఉన్నాడు. స్వరూప్ తన గేయాల్ని పుస్తకాకారంలో ముద్రించినప్పుడు 'రాహుగ్రస్త చంద్రుడు' అని ఒక క్రొత్త గేయాన్ని చేర్చాడు. అందులో విధాత కుసుమాల్లో కీటకాల్ని, చంద్రుడిలో కళంకాన్ని, కోకిలకి రూపహీనతను సృష్టించినందుకు—ఆయన్ని ఘాటుగా నిందిస్తూ, అందంలో ఒక వివాహాన్ని వర్ణించాడు. చాటుగా ఆ చూకీ తీస్తే అది కాత్యాయనీ దేవిని ఉద్దేశించి వ్రాసినదే అని స్పష్టంగా తేలిపోయింది. అనేకమంది సమాలోచకులు దాన్ని చదివి అశ్రువులు ఆపుకోలేక పోయారుట!

౧౧

రోజంతా మబ్బుమబ్బుగానే ఉంది. సన్నగా పడుతోంది వాన. ఈదురు గాలిగా ఉంది. ఆ రోజున కరుణ ఆలయానికి వెళ్ళింది మహాదేవుని పూజించటానికి. కంట తడిపెట్టుకుంటూ—తన కీ కష్టాలు ఎక్కువరోజు లుండకుండా చెయ్యమని, తన కలగబోయే సంతానం పుత్రుడే కావాలని, పుత్రిక కాకూడదని, ఆ పుట్టుకవల్ల వచ్చే ఇలాంటి బాధలు ఎవరికీ కలగకుండా ఉండాలని ప్రార్థించింది...తనకి మరణాన్ని ప్రాప్తింప చెయ్యమని, ప్రాప్తిస్తే నరేంద్రుడు తన యిష్టానుసారం నిరాటంకంగా సుఖభోగాలను అనుభవించ గలుగుతాడని కోరుకుంది....

ఈ దుఃఖ సమయంలో నరేంద్రుడి కొక కొడుకు పుట్టాడు. డబ్బు వచ్చేదారి లేకపోయాక జరుగుబాటు ఎలాగో తోచటం లా. నరేంద్రుడి పూర్వపు వైఖరి ఏమీ మారలేదు. ఆనాటి సాయంత్రం స్వరూప్ గదాధరులతో కూర్చుని యథాప్రకారంగా త్రాగుతున్నాడు. ఆ గడియారం అలాగే వుంది. ఆ చైనూ అలాగే ఉంది. ఉల్లిపొరలాంటి తెల్లటి ధోవతి, ఎసెన్సు, అత్తరు—అన్ని యథాతథంగానే ఉన్నాయి; లేనిది డబ్బు ఒక్కటే. కరుణకి సంసారంలో పొదుపు అనేది తెలియదు. అంతా గందరగోళం-అయోమయం...జాగ్రత్తగా దేనికెంత ఖర్చుపెట్టాలి అనేది ఆమెకి తెలియదు. జమా ఖర్చులసలు తెలియవు. ఏం చేయబోయి ఏం చేస్తూంటుందో ఆమెకే తెలియదు. కరుణ ఎంత అయోమయంలో పడిందో ఆమెకే తెలియదు. నరేంద్రుడామె కేమీ సాయపడడు. మధ్యమధ్య తిడుతూ మాత్రం ఉంటాడు. ఏది అవసరమో, ఏది అనవసరమో, ఏం చెయ్యాలో, ఏం చెయ్యకూడదో ఆమెకెంత ఆలోచించినా అంతు పట్టదు. కరుణ రాత్రింబగళ్ళు పిల్లవాడినే చూసుకుంటూ ఉంటుంది. నిజమే—కాని బిడ్డని ఎలా పెంచాలో ఆమెకేమయినా తెలుస్తేగా! భవి అని ఎంతోకాలంనుంచి ఉంటున్న దాసీ ఉంది. ఆమె కరుణ యీ దుర్దశచూసి చాలా చింతించింది. కరుణను ఆమె తన చేతులతో పెంచింది. అంచేత కరుణ అంటే ఆమెకి అపరిమితమైన అపేక్ష. నరేంద్రుడి అన్యాయ ప్రవర్తన చూసి ఆమె మధ్యమధ్యవచ్చి అతణ్ణి నోటికి వచ్చినట్లల్లా దులిపేది. నరేంద్రుడు ఉగ్రుడైపోయి. "నువ్వుపో ఈ యింట్లోంచి" అనేవాడు. "కరు



"నిన్నెక్కడో చూసినట్టుందే?"
"స్వతంత్రం రాకముందు మనిద్దరం ఒకే జైలులో ఉన్నాము."

ణను నీలాంటి రాక్షసుడి చేతుల్లో అప్పగించి ఎలా పోతాను?" అనేది ఆమె. చివరికి నరేంద్రుడు లేచి నాలుగు తన్నితే—అప్పుడామె తిట్టుకుంటూనో, లేదా ఏడుస్తూనో అక్కడినుంచి వెళ్లిపోయేది. ఇంటి పెత్తనం అంతా భవిదే ఇంట్లో పనులన్నీ తానే చేసేది. కరుణని ఒక్కపనికూడా చెయ్యనివ్వదు. కరుణకి వచ్చిన ఈ దుస్థితిలో ఆమె చెయ్యగలిగినదంతా చేసింది. భవికి ఇంకెవరూ లేరు. తాను దాచుకున్న డబ్బు ఏదయినా ఉంటే—అది కరుణ కోసమే ఖర్చుపెట్టేది. కరుణ ఒంటరిగా ఏడుస్తూ కూర్చున్నప్పుడు ఆమె ఓదార్చటానికి ప్రయత్నించేది. కరుణకీ భవి అంటే చాలా యిష్టం. మనస్సులో దుఃఖాన్ని అణచుకోలేనప్పుడు—రెండు చేతులలో భవికందాన్ని కౌగలించుకుని, ఆమె ముఖంలోకి చూస్తూ ఏడ్చేది, అలాంటప్పుడు భవికూడా కన్నీళ్ళు ఆపుకోకలిగేదికాదు. పసిపిల్లలాగా బావురుమనేది. భవి లేకపోతే కరుణ, నరేంద్రుల స్థితి ఏమయేదో భగవంతుడికి తెలియాలి.

౧౨

ప్రపంచం తనను రానురాను నానా బాధలూ పెడుతూన్నదనీ—వీళ్ళంతా మనుషులు కాదు, నా దృష్టిలో పిశాచాలనీ అంటూ ఉంటాడు స్వరూప్. కాని మనకు తెలిసినంతవరకు నిజానికి లోకాన్ని బాధపెట్టేది అతడే. అతడితో కొద్దోగొప్పో సంబంధం ఉన్నవాళ్ళని అందర్కీ చివరికి ఎలాంటిముప్పు తెచ్చిపెడతాడని.

స్వరూప్ ఎప్పుడూ కవిత్వ చింతనలో మునిగి ఉంటాడు. ఎన్ని పిలిచినా పలికేస్థితిలో ఉండడు. పిలవగా పిలవగా చివరకి ఆఁ అంటూ ఉలిక్కిపడతాడు. సాధారణంగా చెరువు మెట్లమీద ఆకాశంలోకి చూస్తూ కూచుని ఉంటాడు. చుట్టుప్రక్కల ఎవరున్నా తాను గమనించనట్లే ఉంటాడు. ఒకవేళ గమనించినా తాను గమనించనట్లు ప్రక్కవాళ్ళు గ్రహించకుండా ఉండేట్లు నటిస్తాడు. ఇంట్లో కూర్చున్నప్పుడు కూర్చుని కూర్చుని, హఠాత్తుగా లేచి బయటికి వెళ్ళిపోతూఉంటాడు. ఎవరైనా అదేమిటి అని అడిగితే—కిటికీలోంచి ఓ అద్భుతమైన మేఘాన్ని చూశానని, ఇంతచక్కటి మేఘాన్ని ఇదివరకెన్నడూ చూసి యెరుగననీ అంటూ ఉంటాడు. ఒక్కొక్కప్పుడు—ఎక్కడైనా కూర్చుని ఉన్నప్పుడు తాను కవిత్వం రాసుకున్న కాయితాన్ని అలా వదిలేస్తుంటాడు. ఎవరైనా తీసి అందిస్తే—అదా! దాని దేముందిలెండి, అంటూ ఆ కాయితాన్ని చించిపారేస్తూ ఉంటాడు. దాని తాలూకు మరొక ప్రతి అతడిదగ్గిర ఉండే ఉంటుంది. కాని పైకిమాత్రం పెద్దపెద్ద కవులకు చాలామందికి అలవాటే ఇది. వాళ్ళకున్నంత పరధ్యానం ఇంకెవరికి ఉండదు. ఏ కాయితం ఎక్కపెట్టినదీ గుర్తు ఉండదు. 'ఇలా రాసిన కాయితాలు ఎన్ని పారేసుకున్నానో నేను లెక్కలేదు' అంటూ ఉంటాడు. కాని గొప్పవిషయం ఏమిటంటే,

గడియారం, డబ్బు, ఇలాంటి విలువైన వాటిని ఎన్నడూ పారేసుకోడు. పాపం స్వరూపబాబుకి మరొకజబ్బు ఉంది. అతడు ఏ కవిత్వపు పంక్తులు రాసినా ప్రక్కన బ్రాకెట్‌లో 'నిర్జనారణ్యంలో' అనో—'అర్ధరాత్రి 'అనో వ్రాస్తుంటాడు. కాని నాకు బాగా తెలుసు అతడు వ్రాసినవన్నీ పట్టపగలు పన్నెండు గంటల ప్రాంతాల్లో తన పిల్లలతో చాలీచాలని ఇరుకు కొంపలో కూర్చుని వ్రాసినదే. ఏమయితేయేం, మన స్వరూప్‌బాబు గొప్ప ప్రేమికుడు. అతడంత చప్పున ప్రేమలో పడేవాళ్లు ఇంకెవరూ ఉండరు. దాని మూలంగా అతడూ ఇబ్బందుల్లో పడతాడు — ఇతరుల్నీ ఇబ్బందుల్లో పెడతాడు.

స్వరూప్‌బాబు రాత్రింబగళ్లు ఇంచుమించు నరేంద్రబాబు ఇంట్లోనే మకాం. అంచేత తరచు కరుణనుచూస్తూ ఉంటాడు, కాని దాని వల్ల చాలా పెద్దచిక్కు వచ్చిపడింది. మనస్సు మనస్సులో ఉండటం లేదు. పెద్ద పెద్ద నిట్టూర్పు లొస్తున్నాయి. రాత్రిళ్లు నిద్ర పట్టటంలేదు. అతడు దారుణమయిన పందొమ్మిదో శతాబ్దంలో జన్మించడం. అంచేత అతణ్ణి కోయిలలూ మోసగించలేవు. చంద్ర కిరణాలు దహించలేవు — నిజమే. కాని అంతమాత్రాన ఏమిటి ? ప్రపంచమంతా అతడి కంటికి అరణ్యంలాగానూ, శ్మశానంగానూ అయింది. పూలు ఎండిపోతున్నాయి, మళ్ళీ పుష్పిస్తున్నాయి. సూర్యుడు అస్తమిస్తున్నాడు, మళ్ళీ ఉదయిస్తున్నాడు. పగళ్లు వస్తున్నాయి, పోతున్నాయి. మనుషులు తింటున్నారు, తిరుగుతున్నారు, నిద్దరోతున్నారు. అన్నీ ఎలా ఉన్నవి అలాగే ఉన్నాయి. కాని అతని హృదయానికి శాంతిలేదు. ఒంట్లో బలంలేదు, కళ్ళకి నిద్ర లేదు. మనస్సుకి సుఖం లేదు. ఒక్కమాటలో చెప్పాలంటే సహజంగా ఉండవలసినవి అన్నీ లేకుండాపోయాయి. స్వరూప్ చాలా కవిత్వం వ్రాశాడు. ఏమేమి వ్రాయాలో అంతా వ్రాశాడు. అందులో కరుణ పేరుకూడా సూచనప్రాయంగా ఉల్లేఖించాడు.

## ౧3

నిధి నరేంద్రుడింటికి అప్పుడప్పుడు వస్తూ ఉంటాడు, కాని మనం ఏ ఘటనా సూత్రంలో వస్తున్నామో, ఆ సూత్రంలోకిరాలా ఇదివరకు. ఇప్పుడు వచ్చాడు. స్వరూపబాబు, అలవాటు ప్రకారంగా నయితేనేం, బుద్ధిపూర్వకంగా నైతేనేం, దైవాద్యా అయితేనేం ఒక కాయితాన్ని గదిలో పారేశాడు. నిధి ఆ కాయితాన్నితీసి జాగ్రత్త చేశాడు. ఆ కాయితంలో రెండు మూడు కవిత్వపు పంక్తులున్నాయి. మరెవరైనా అయితే ఆ పంక్తుల్లోని సహజమైన అర్థాన్ని తెలుసుకుని, మెదలకుండా ఊరుకునేవారు. కాని తెలివైనవాడు నిధి — అందరిలాంటివాడు కాదు. ఒకవేళ అందులో నిగూఢమైన అర్థం ఏమీ లేకపోయినా, అందులోంచి ఏదో ఒకటి బయటికి లాగగలడు నిధి. ఇందులో ఏదో ఉండి ఉండాలి అలాంటిదేదయినా. నిధికి ఆ పంక్తుల్లో కవిత్వం ఏమీ నచ్చలేదు. అయినా దాన్ని మడిచి జేబులో పెట్టుకుని, 'ఇందులోని నిగూఢార్థాన్ని ఏమైనాసరే తెలుసుకోవాలి' అనుకున్నాడు. తనలాంటి తెలివైనవాళ్ళ దాపరికాలు ఏం సాగవు. చూడగానే పట్టేస్తారు. ధూర్తులైనవాళ్ళు తమ తెలివితేటలమీద నిస్సంకోచంగా ఆధారపడి ఒక్కొక్కప్పుడు తెచ్చిపెట్టేటంత వినాశనాన్ని ఎవరూ తెచ్చిపెట్టలేరు.

'చెల్లీ ! ఎలా ఉన్నావో ఒకసారి చూసి పోదామని వచ్చాను' అంటూ నిధి కరుణ దగ్గరకి వెళ్లాడు. నిధి చిన్నప్పట్నుంచీ కరుణ వాళ్ల యింటికి వస్తూపోతూ ఉండటం కరుణ తల్లిని పిన్ని అని పిలుస్తూ ఉండటం మామూలే. నిధి ఇటీవల అప్పుడప్పుడు 'చెల్లీ ! ఎలా ఉన్నావు.' అని కరుణను వచ్చి పలకరించి పోవటం కూడా అలవాటే. ఒక రోజున నరేంద్రుడు కలకత్తా వెళ్లాడు. నరేంద్రుడు కలకత్తానుంచి ఎప్పుడు తిరిగి వస్తాడో స్వరూప్ బాబుని అడిగి తెలుసుకుని రమ్మని కరుణ భవితో అన్నది. నిధి చాటున ఉండి, ఆ మాట విని—ఊఁ అర్థమైంది. ఇంతమంది ఉండగా స్వరూప్ బాబునే అడిగి రమ్మని పంపటం దేనికి? ఏం, గదాధర బాబుని అడిగినా సరిపోతుందిగా. అనుకున్నాడు మనస్సులో. ఒక రోజున కరుణ భవితో ఏం మాట్లాడుతున్నదీ దూరంగా ఉన్న నిధికి సరీగ్గా వినపడలా. కాని ఒకసారి ఆమెమాటల్లో 'స్వరూప్ బాబు' అన్నమాట వచ్చినట్లు తోచిందతడికి ఇంకేముంది. మరొక ప్రమాణం దొరికింది. మరొక రోజున నరేంద్రుడు, స్వరూప్, గదాధర్ తోటలో కూర్చుని ఉన్నారు. కరుణ హఠాత్తుగా కిటికీ తలుపు తెరిచి అటువైపుకి చూసింది. కరుణ స్వరూప్‌నే చూస్తోందని నిధి స్పష్టంగా తెలుసుకున్నాడు. నిధికి ఈ మూడు తిరుగులేని ప్రమాణాలు లభించాయి. ఇతరుల కెలాంటివి అయినా నిధికి మాత్రం ఇవి స్పష్టమైన ప్రమాణాలు. ఈ శుష్క ప్రమాణాలు మూడేకాదసలు. కరుణ రోజు రోజుకీ చిక్కిశల్యమై అనారోగ్యంగా ఉంటోంది. అది ఎందుచేతనో నిధికి స్పష్టంగా తెలిసిపోయింది. దానికి కారణం ఇంకేమీ లేదు — స్వరూప్‌బాబు మీది చింతే...

ఇహ స్వరూప్‌బాబు దగ్గిర్నుంచి సంగతి బయటికి లాగాలి అనుకుంటూ నిధి మెల్లిగా అతడి వద్దకి చేరుకున్నాడు. వెళ్ళి హఠాత్తుగా 'కరుణ నీకోసం పిచ్చిదైపోతుంది భాయీ' అన్నాడు. స్వరూప్ గతుక్కుమన్నాడు. సంతోషంతో ఉబ్బిపోయి, 'నీ వెలా తెలుసుకున్నావ్ ?' అని అడిగాడు. "ఊఁ. నేను మీ మనస్సుల్లోని రహస్యాన్ని ఎలా తెలుసుకున్నానా అని భయపడుతున్నావా?" ఎందుకు తెలుసుకోను, నిధిరామ్ కళ్లు కప్పలేరు ఎవరూ !' అనుకున్నాడు తనలో తాను. పైకిమాత్రం — 'ఎలాగో తెలుసుకున్నానులే' అని కొనకంటితో చూస్తూ వెళ్ళిపోయాడు. ఆ

మర్నాడు వచ్చి, మళ్లీ 'నువ్వు కరుణను చాటుగా చూస్తున్న సంగతి, కలుసుకుంటున్న సంగతి నరేంద్రుడికి తెలియనిచ్చేవు సుమీ !" అన్నాడు స్వరూప్‌తో.

"అదేమిటి ? నేను కరుణను ఒక్కసారికూడా ఎప్పుడూ కలుసుకుని మాట్లాడందే" అన్నాడు స్వరూప్. 'తప్పకుండా కలుసుకొని ఉంటావ్. లేకపోతే ఇంత మాయ పుచ్చాలని ప్రయత్నించటం దేనికి ?' అనుకున్నాడు నిధి మనస్సులో. ఇదీ ఒక ప్రమాణం అయింది. స్వరూప్ ఒకవేళ ఆఁ కలుసుకున్నాను అని అంటే – అదీ మరొక ప్రమాణ మయేదే.

ఏమయితేయేం, నిధికింక మనస్సులో ఏమీ సందేహం లేదు. ఈ రహస్యాన్ని నిధి తన బుద్ధికౌశలంవల్ల బయటికి లాగినప్పుడు ఇంక దాన్ని రహస్యంగా ఉంచుతాడా ? తన బుద్ధికౌశలాన్ని ప్రపంచం తెలుసుకోకపోతే ఏమయినట్లు : 'నువ్వు ఏమనుకుంటున్నావో అదికాదు. ఆంతర్యంలో ఉన్న సంగతులన్నీ తెలుసుకున్నాను నేను –' నేర్పరులైన వాళ్ళకి ఈ విషయాన్ని వెల్లడించగలిగితే ఎంతైనా సంతృప్తి. నిధి దగ్గిర ఒకవేళ 'రామహరిబాబు చాలా మంచివాడు' అని అంటామనుకోండి – వెంటనే నిధి గతుక్కుమని, 'ఏం అన్నావ్ ? ఎవరు మంచివాళ్లు ? రామహరి బాబా ?' అంటూ – అతడి ఆంతర్యంలో ఉన్న ఇది అంతా నీకేం తెలుసులే ? అన్నట్లు చూస్తాడు. బలవంతంచేసి అడిగితే 'అది అంతా చాలా ఉందిలే గాథ' అంటాడు. నిధి తాను కనుక్కోగలిగిన రహస్యాన్ని – సలహా చెపుతున్న రూపంలో నరేంద్రుడికి చెప్పాలి అని నిర్ణయించుకున్నాడు.

## ౧౪

కొన్నాళ్లనుంచీ చంటిపిల్ల వాడికి సుస్తీగా ఉంటోంది. ఎందుకు ఉండదు? వాడి పెంపకంలో నియమాల్ని పాటించటం లేకపోయే! కరుణ డాక్టర్ని పిలిపించింది. డాక్టరు వచ్చి జబ్బు విషమించింది అని చెప్పాడు. కరుణ రాత్రిం బగళ్లు పిల్లవాణ్ణి ఒళ్లో పెట్టుకుని కూర్చునేది. జబ్బు ఎక్కువయింది. కరుణ కుమిలి కుమిలి ఏడుస్తోంది. ఊళ్లో ఉన్న నేటివ్ డాక్టరు వచ్చి పరీక్షించి, మందు యిచ్చి వెళ్లేబోయేటప్పుడు ఫీజు యివ్వబోతే–"ఉంచండి. జబ్బు నయంకానీండి" అన్నాడు. నరేంద్రుడి దుస్థితి గమనించి దయార్ద్రహృదయుడుకనుక డాక్టరు ఫీజు తీసుకోవటంలేదని పండిత మహాశయుడు గ్రహించాడు. రెండు పూటలా వెళ్ళి తానే పిలిచేవాడు. డాక్టరు కూడా విసుక్కోకుండా వచ్చేవాడు....

నరేంద్రు డీస్థితిలో ఇంటి దగ్గిర లేడు. అటువైపున ఉన్న తల్లి తండ్రులు లేని జమీందారు బిడ్డ ఈ మధ్యనే మైనర్ వెళ్ళిపోయి మేజరయినాడు. జమీందారీ అంతా చేతిలోకి వచ్చింది. నరేంద్రు డతణ్ణి పోయి పట్టుకున్నాడు. నరేంద్రు డతడినెత్తినెక్కి స్వరూప్ గదాధరులను కూడా అతడికి అప్పగించి నిశ్చింతగా ఉందామని ప్రయత్నిస్తున్నాడు. కాని గదాధర్ స్వరూప్‌లు త్వరలో అతడి నుంచి తప్పుకుంటారు. నరేంద్రుడికి లేదుకాని. స్వరూప్-గదాధర్‌కి–ఇద్దరికీ వేరే ఉద్దేశాలున్నాయి.

పిల్లవాడి జబ్బు బాగా ఎక్కువయింది. డాక్టర్ని పిలుచుకు రావటానికి ఒక మనిషిని పంపారు. డాక్టరు తాను రెండుపూటలా వస్తున్నందుకు వాటికీ మొత్తం బిల్లు అంతా అతడి చేతికిచ్చి పంపాడు. పిల్లవాడు స్పృహలేకుండా ఉన్నాడు. కరుణ వాణ్ణి ఒళ్ళో పెట్టుకుని, ముఖంకేసి చూస్తూకూచుంది. అన్ని పనుల్లోనూ చెయ్యి తిరిగినవాడైన నిధి మధ్యమధ్య నాడి పరీక్షిస్తున్నాడు. నాడి క్షీణిస్తోంది అని చెపుతున్నాడు. అందరూ ఆత్రంగా ఎదురు చూస్తున్నారు డాక్టరు కోసం. ఈ సమయంలో డాక్టరు కోసం వెళ్లిన వ్యక్తి బిల్లు తీసుకొని వచ్చాడు. "డాక్టరు ఏడీ?" అని అందరూ ఒక్కసారిగా అడిగారు. అతడాబిల్లు ముందు పెట్టాడు. అందరూ నిర్ఘాంతపోయారు. పండిత మహాశయుడు ముఖం చిన్నపుచ్చుకుని నిధి చెయ్యిపట్టుకుని "ఏమిటి ఉపాయం ఇప్పుడు?"అని అడిగాడు. ''డబ్బు సర్దుబాటు చెయ్యాలి'' అన్నాడు నిధి. హఠాత్తుగా ఎక్కడి నుంచి వస్తుంది డబ్బు? ఇక్కడ రోగి స్థితి ఏమీ బావుండలేదు. ఆలస్య మవుతున్నకొద్దీ ప్రమాద పరిస్థితి ఎక్కువవుతోంది. విషమ సమస్య వచ్చిపడింది. పాపం, కరుణ ఏడుస్తూకూచుంది. పండిత మహాశయుడు కంగారుగా ఇంటికి తిరిగి వెళ్ళి, తనదగ్గిర ఉన్నదేదో తీసుకొని వచ్చాడు. డబ్బు బయటికి తీస్తున్నప్పుడు కాత్యాయని చాలా అభ్యంతరాలు చెప్పింది. అయినా పండిత మహాశయుడు కాళ్లు గడ్డం పుచ్చుకుని బ్రతిమాలుకుని ఎలాగో ఆ డబ్బు తీశాడు. భవి తన దగ్గిర ఉన్న డబ్బు తీసుకు వచ్చింది. ఎంతో కష్టం మీద చివరికి ఎలా అయితేయేం డాక్టరు వచ్చాడు. రోగి అప్పుడు నిమిషాల మీద ఉన్నాడు. డాక్టరు ఏమితోణక్కుండా ''పిల్లవాడు బ్రతకడు" అని చెప్పాడు.

ఈ సమయంలో నరేంద్రుడు తూలుతూ తూలుతూ వచ్చాడు ఇంటికి. ఇంట్లోకి వచ్చినా ఇంట్లో ఈ అలజడి ఆందోళనా అంతా ఏమిటో అతడికేమీ అర్థంకాలేదు. కాసేపు శూన్యందృష్టితో పండిత మహాశయుడి ముఖంకేసి చూస్తూ ఊరుకున్నాడు. చివరి కేమనుకున్నాడో పండిత మహాశయుని పట్టుకుని దబదబ బాదటం మొదలెట్టాడు. పండిత మహాశయుడు అయోమయంలో పడ్డాడు. డాక్టరు విడిపించ పోతే నరేంద్రు డతణ్ణి నెత్తురు వచ్చేట్లు కొరికాడు. ఇంత రభసచేసి అక్కడేపడి నిద్దరోయాడు.

క్రమంగా శిశువు ముఖం నల్లపడసాగింది. ఈ గొడవ మధ్యలోనే కరుణ స్పృహ తప్పి బాలీసుకి చేరగిలపడింది. తర్వాత శిశువు ప్రాణం పోయింది. అప్పుడు పాపం కరుణకి స్పృహ లేదు....

౧౫

విచారంలో ఉన్న కరుణని చూస్తే—ప్రాణమిచ్చి అయినా సరే ఆమె విచారా న్నెలాగయినా పోగొట్టాలన్నంత జాలేస్తుంది. కొన్నాళ్ళనుంచి ఆమె ముఖంలో నవ్వు అనేది మాయమయింది. సరీగ్గా తిండి తినటంలేదు, నిద్ర పోవటంలేదు. స్నానం చెయ్యటం లేదు. చిక్కి శల్యమై, నల్లపడి, కాంతిలేని దృష్టితో అలా చూస్తూ కూచుని ఉంటుంది. ఆ ముఖంలో కన్పించే దైన్యాన్ని చూస్తే ఈమె అసలు ఎన్నడైనా నవ్వి యెరుగునా అనిపిస్తుంది. భవి దగ్గిర ఉన్న డబ్బేదో ఇంచుమించు అంతా ఖర్చయి పోయింది. సంసారం ఎలా గడుస్తుందో దైవానికే తెలియాలి. పండిత మహాశయుకి సహాయంతో ఎలాగో రోజులు గడుస్తున్నాయి.

నిధి స్వరూప్‌ని ఉద్దేశించి—"అతడేం చేస్తూ ఉంటా డసలు?" అని అడిగాడు నరేంద్రుడు.

''ఎందుకో చెప్పు?''

''అతడి వైఖరి అదీ నాకు అంత బావుండలేదు.''

''ఏం? ఏం జరిగింది?''

"అహఁ. ఏం జరగలేదు. అయినా-ఆ సంగతి అలా ఉంచుదాం కాని అతడిది ఏ వూరు?''

''కలకత్తా.''

"నేను అలాగే అనుకున్నాను. లేకపోతే ఇలాంటి స్వభావం ఎందు కవుతుంది?''

''ఏమిటి? ఏం జరిగిందో చెప్పరాదూ?''

"నా కా సంగతి చెప్పటం ఇష్టం లేదు. కాని అతణ్ణి ఇంట్లోంచి పంపించివెయ్యండి".

నరేంద్రు డాత్రంగా "అదేమిటో చెప్పి తీరాల్సిందే" అన్నాడు.

అయిపోయిందాని కిహ చెయ్యగలిగిందేమీ లేదు. కాని జాగ్రత్తగా ఉండండి. అతణ్ణిహ ఇంట్లో లోపలికి వెళ్ల నీయకుండా చేయండి"

"అదేమిటి. స్వరూప్ లోపలి కెప్పుడూ వెళ్ల లేదే''

''అదేంమాట. మీతో చెప్పి వెడతాడా?''

నరేంద్రుడు నిధి ముఖం కేసి తెల్లబోయి చూశాడు.

"నా పనేదో నేను చేసేశాను భాయి. ఇహనీవు చెయ్యవలసిందేదో చెయ్యి. నీ యిష్టం," అన్నాడు నిధి. ఈ లక్షణాలేమీ బాగాలేవు అనుకున్నాడు నరేంద్రుడు.'కరుణ నాకోసం పిచ్చెత్తిపోతోందిట', నిధి హఠాత్తుగా వచ్చి తనతో ఎందుకు చెప్పాడీమాట! కరుణ కచ్చితంగా అతడిద్వారా కబురు చేసి ఉంటుంది—అనుకున్నాడు. తర్వాత—'నేనూ ఆమె ప్రేమలో పడ్డాను. ఈ సంగతి ఆమెకి తెలియచెయ్యటం మంచిది' అని తోచింది. అవకాశం చిక్కినప్పుడు స్వయంగానే వెళ్ళి చెప్పాలని నిశ్చయించుకున్నాడు.

వెన్నెలరాత్రి. కరుణ చిన్నప్పుడు రాత్రింబవళ్లు ఎక్కడైతే ఆడుకుంటూ తిరిగేదో—ఆ తోటలో రాతి అరుగుమీద—అక్కడే పడుకుని ఉంది. రవగాలి వేస్తోంది. ఆ వెన్నెల రాత్రితో, ఆ పిల్లగాలితో ఆ కొబ్బరితోటతో—ఆమెచిన్నతనం అంతా తానూ వాటిల్లో ఒక భాగం అన్నంతగా మిశితమైపోయింది. ఆనాటి సంగతి—శ్మశానంలో హోరు గాలిలాగా—ఆమె హృదయాన్ని ఊరికే కలిచి వేస్తున్నాయి. ఆ బాధతో ఆమె హృదయం విదీర్ణమైనట్లు— కట్టుతెంచుకున్నట్లు కన్నీళ్లు కాల్వలు కట్టసాగాయి. తోటలో మరొకరిద్దరు వ్యక్తులు దాక్కుని ఉన్నారు. నరేంద్రుడు—స్వరూప్. నరేంద్రుడు మెల్లిగా స్వరూప్ వెనకాలే వచ్చాడు—స్వరూప్ ఏం చేస్తాడో చూద్దామని. ఎవరో ఒకవ్యక్తి వస్తూంటం కరుణ హఠాత్తుగా చూసి గతుక్కుమంది. "ఎవరది?" అని ప్రశ్నించింది. "నేను. స్వరూప్ చంద్రుణ్ణి. నిధి ద్వారా కబురుచేసిన ఆ సంగతి జ్ఞాపకం లేదూ?" అన్నాడు స్వరూప్. కరుణ కంగారుగా అవగుంఠనం ముందుకు లాక్కుని వెళ్లిపోతోంది. ఈ స్థితిలో నరేంద్రుడు ఊరుకుని ఉండలేక బయటికి వచ్చాడు. కరుణ గబగబా అంతఃపురంలోకి వెళ్ళిపోయింది. తనని చూడటంవల్ల భయపడి పారిపోయి ఉంటుంది అనుకున్నాడు నరేంద్రుడు...



౧౬

"దౌర్భాగ్యురాలా, పో ఇంట్లోంచి" అని గర్జించాడు నరేంద్రుడు. కరుణ ఏమీ మాట్లాడ లేదు, "ఇప్పుడే పో, తక్షణం పో," అన్నాడు మళ్ళీ అతడు. కరుణ అతడి ముఖంకేసి చూస్తూ ఊరుకుంది. నరేంద్రుడు ఉగ్రుడైపోయాడు. ముందుకు వచ్చి కరుణ చెయ్యి గట్టిగా పట్టుకున్నాడు—

"ఎక్కడికి పోను?" అన్నది కరుణ. నరేంద్రుడు కరుణను జుట్టు పట్టుకుని లాగి నిర్దాక్షిణ్యంగా కొట్టటం మొదలెట్టాడు. "పో. ఇంట్లోంచి తక్షణం పో బయటికి" అని అరుస్తూ. భవి పరుగెత్తుకుంటూవచ్చి "ఎక్కడికి పోతుంది" అని అడిగింది.

'ఇది నీబాబు ఇల్లేమీ కాదు' అన్నసంగతి కూడా గుర్తుచేసింది.

"నువ్వు ఎందుకు వచ్చావ్ ఇక్కడికి?'' అంటూ నరేంద్రుడు ఆమెమీద హుంకరించాడు. భవి అడ్డువచ్చి కరుణను విడిపిస్తూ "నా కంఠంలో ప్రాణం ఉండగా నువ్వు కరుణను అనుప్‌బాబు గారింట్లోంచి ఎలా వెళ్ళకొట్టగలవో చూస్తాను" అన్నది. నరేంద్రుడు భవినికూడా కొట్టి. చివరికి "పోలీసులకి రిపోర్టు చేస్తాను" అని బెదిరించాడు. "ఓ యబ్బో! అంత అరాచకంగా లేదులే దేశం" అన్నది భవి.

నరేంద్రుడు వెళ్ళిపోయాక కరుణ భవి కంఠాన్ని కావిలించుకుని ఏడుస్తూ "భవి, నాకు దారి చూపించు. నేను వెళ్ళిపోతాను'' అన్నది. భవి కరుణను గుండెలకి హత్తుకుని. "అదేమిటి తల్లీ? ఎక్కడికి వెడతావ్? నేను బ్రతికి ఉండేంతవరకు నువ్వు ఎలాంటి బెంగా పెట్టుకో నక్కర్లేదు'' అంటూ ఏడ్చింది. కరుణ ఇంకేమీ మాట్లాడలేక పోయింది. దభాలున తన పక్కమీదికి పోయిపడి, చేతులతో ముఖం కప్పుకుని ఏడవ సాగింది. ఆ రోజల్లా కరుణ ఏమీ తినలేదు. భవి వచ్చి ఎంతో బ్రతిమాలింది. కాని ఏమయినా ఆమెచేత మాత్రం ఏమీ తినిపించలేకపోయింది. రోజంతా ఎలాగో గడిచింది. సంజెపడింది. గ్రామంలో ప్రతియింటా సంజెదీపాలు వెలిగాయి. పూజాగృహాల్లో శంఖాలూ, జేగంటలూ మ్రోగాయి. రోజంతా కరుణ తనపక్కమీద అలాగే పడిఉంది. చీకటి బడ్డాక లేచి మెల్లిగా తను యింటిని ఆనుకుని ఉండే ఆ తోటలోకి వెళ్ళింది. అక్కడ అలా ఎంతసేపుకూర్చుందో! రాత్రి చాలాపొద్దుపోయింది. పృధివిని నిద్రపుచ్చి, నిశీధ వాయువు నెమ్మదిగా, అతి నెమ్మదిగా వెళ్ళిపోతోంది. ఎంత ప్రశాంతంగా నిద్రపోతున్నది గ్రామం అంటే—ఇక్కడ ఒకయువతి హృదయ విదారకమైన బాధతో మరణాన్ని ఆహ్వానిస్తోంది అన్నమాటే గుర్తుకురాదు.

కరుణ ఒంటరిగా కూర్చుని చేసుకుంటున్న ఆలోచనలకు విఘాతం ఏర్పడింది హఠాత్తుగా. నరేంద్రుడు వస్తూ ఉండటం కంట పడింది. పాపం భయంతో కంపించిపోయింది. నరేంద్రుడు వచ్చి అతి కఠోరంగా "నేను అతడి కోసం ఇంట్లో ప్రతి గదీ వెదకి చూశాను. అత దేమిటి—తోటలోకి వచ్చి కూర్చున్నారు? ఇవాళ రాత్రేమిటి—తోటలోకి వచ్చి కూర్చున్నాడా? స్వరూప్ ఇక్కడ లేడూ?" కరుణ మనస్సులో "ఈసారి చెపుతాను సమాధానం: నిరపరాధిని మీద అతడికి ఎందుకు సంశయం కలిగిందో అడగాలి అనుకున్నది. కాని ఏం మాట్లాడాలో ఎలా మాట్లాడాలో తోచలేదు. నరేంద్రుడి వైఖరి చూసి, భయంతో కంగారు పడిపోయి. ఒక్క మాటకూడా మాట్లాడలేక పోయింది. "ఇవాళ నిన్నింక ఒక్క క్షణం కూడా ఉండనివ్వను యింట్లో" అన్నాడు నరేంద్రుడు. కరుణ ఒక్క మాటకూడా మాట్లాడ లేక పోయింది. ఏదో ఒక అలక్షితమైన ఆకర్షణతో ముందుకి పోతోందామె. 'ఒకసారి భవిని కలుసుకుని చెప్పి వెళ్ళిపోతాను' అని చెపుదామా అనుకుంది. కాని ఒక్క మాటకూడా మాట్లాడలేక పోయింది. ఇంటి బయటి గుమ్మం దాకా వెళ్ళింది. వ్యాకుల హృదయంతో చూసింది. ఎదురుగా దిగంత ప్రసారితమైన మైదానం. ఎక్కడా ఒక్క మనిషికూడా లేడు. నరేంద్రుడి కాళ్ళు పట్టుకుని, తనకి చాలా భయం వేస్తోందని, తాను ఎక్కడికీ పోలేనని, ఈ దారులూ డొంకలూ తన కేమీ తెలియవని చెప్పుకుందామా అనుకున్నది. కాని ఒక్కమాట కూడా పెకిలి రాలేదు. మెల్లి మెల్లిగా గుమ్మం కూడా దాటి వెళ్ళిపోయింది.

"రేపు ప్రొద్దున నువ్వు కనుక ఇంకా ఊళ్లో కన్పించావంటే పోలీసుల్ని పిలిపించి వెళ్లగొట్టిస్తా" అన్నాడు నరేంద్రుడు. తలుపులు మూసి, నరేంద్రుడు లోపలివైపు తాళం వేశాడు. కరుణ తల తిరిగిపో సాగింది. కరుణ ఇంక నిలబడలేక పోయింది. నిస్సత్తువ మూలంగా గోడమీదికి పడిపోయింది.

కొంతసేపయాక లేచింది. భవిని ఒకసారి కలుసుకో లేకపోయానే అనుకుంది తనలో. కొంతసేపటి వరకు శూన్య దృష్టితో ఇంటికేసి చూస్తూ ఉండిపోయింది. ప్రహరీ బయటికి వచ్చి చూసింది. తన తోటలోని పూల మొక్కలు నిశ్చలంగా అలాగే నిలబడి ఉన్నాయి. రెండో అంతస్తులో ఇదివరకు తన తండ్రి ఉండే గది - తాను తన తండ్రితో ఆడుకున్న గది అది. ఆ గది తలుపులు బార్లగా తెరిచి ఉన్నాయి. లోపల ఒక విరిగిపోయిన మంచం మాత్రం ఉంది. దాని కెదురుగా ఓ గ్రుడ్డి దీపం మాత్రం వెలుగుతోంది. కొంతసేపయాక కరుణ ఒక నిట్టూర్పు విడిచి. వెనక్కి తిరిగి నుంచుంది. మెల్లిగా వీధే నడవటం మొదలెట్టింది. కొంతదూరం వెళ్లాక మళ్లీ ఒకసారి వెనక్కి తిరిగి చూసింది. ఆ నిర్జనంగా ఉన్న గదిలో ఒక గ్రుడ్డి దీపం వెలుగుతూ ఉండటం మాత్రం కన్పించింది. చిన్నప్పుడు కరుణ ఎంతో ఉల్లాసంగా ఆడుకోవటం చూసిన వాళ్లందరూ తమతమ యిళ్లల్లో హాయిగా నిశ్చింతగా నిద్రపోతున్నారు. వారి ఇళ్ళముందునుంచి కరుణ మెల్లిగా నడిచివెళ్లింది. ఇంకొక సారి వెనక్కి తిరిగి చూసింది. తండ్రిగదిలో ఆ దీపం ఇంకా అలా వెలుగుతూనే ఉంది. ఆ గంభీర నిశబ్ద నిశీధంలో అసంఖ్యాకములైన నక్షత్రాలు అనిమేష దృష్టితో క్రిందికి చూస్తున్నాయి. దిగంత వ్యాప్తమైన నిర్జనాంధకారంలో మైదానంలోంచి ఒక యువతి ఒంటరిగా నడిచి వెడుతోంది....

## ౧౨

పండిత మహాశయుడు ప్రొద్దున్నేలేచి చూస్తే కాత్యాయని ఇంట్లోలేదు. ఇరుగు పొరుగు యిళ్లకి ఎక్కడికైనా పేత్తనానికి వెళ్లిందేమో అనుకున్నాడు. చాలా ప్రొద్దు ఎక్కింది. అయినా ఆమె రాలేదు. అప్పుడప్పుడు ఆమె ఇలాచేస్తూ ఉండటంకూడా మామూలే. కాని పండిత మహాశయుడు ఇంక ఎక్కువసేపు ఊరుకుని ఉండలేకపోయాడు. కాత్యాయని ఎక్కడెక్కడికి వెళ్లి ఉండవచ్చునని తోచిందో అక్కడికల్లా వెళ్ళి కనుక్కోవటం మొదలెట్టాడు. 'ఇతగాడు మొత్తానికి కాత్యాయనిని ఒక్కక్షణం కూడా విడిచిపెట్టి ఉండలేడల్లే ఉంది. ఎక్కడికి వెళ్లిందా అని వెతకటం మొదలెట్టాడు. కాని, మగాడికి అంత ఆత్రం ఉండడం మంచిది కాదు' అనుకుంటూ ఆ యిళ్లల్లో ఆడవాళ్లు నవ్వుకున్నారు. అంటే తమ భర్తలు అలా చెయ్యరు. చేస్తే ఎంత బావుండును! అని వారి భావం. కాత్యాయిని వెళ్లి ఉండ వచ్చునని తోచిన చోట్లలో ఆమె కనిపించకపోయేసరికి — ఆమె వెళ్లి ఉంటుందని అనుకోడానికి వీలులేని చోట్లకి కూడా వెళ్లి కనుక్కున్నాడు. అక్కడకూడా ఆమె దొరకలేదు. దాంతో ఇహ పండిత మహాశయుడు కంగారు పడిపోయి, నస్యం పీల్చటం మొదలెట్టాడు. రొప్పుకుంటూ రొజుకుంటూ నిధిరాం ఇంటికిపోయి పడ్డాడు. నిధిఘోష్ గారింటి కెళ్లి చూశావా? మైత్రాగా రింటికి వెళ్లేవా? దత్తుగా రింటికి వెళ్లి చూశావా? ఇలా బెనర్జీ, ముఖర్జీ, ఛటర్జీ మొదలైనవారి అందరి యిళ్లను పేరు పేరునా అడిగాడు. కాని అన్నిటికీ అసంతోషకరమైన సమాధానమే రావటంతో కొంచెం ఆలోచనలోపడ్డాడు. చివరికి నిధి తాను స్వయంగా నరేంద్రుడింటికి వెళ్లాడు. శూన్యగృహంలా బావురుమంటూ ఉంది వాళ్ల యిల్లు. యింటిచుట్టూ గుయ్‌మని ప్రతిధ్వనించే కారుచీకట్లు క్రమ్ముకుని ఉన్నట్లుందా యిల్లు. ఒక నౌకరు తలుపులువేసి ఉన్న గుమ్మం ముందు మెట్లమీద పడుకుని నిద్దరోతున్నాడు. నిధి అతణ్ణి లేపి. "గదాధర బాబు ఎక్కడ?" అని అడిగాడు. "నిన్న రాత్రి ఎక్కడికో వెళ్లారు. ఇవాళ ఇంత వరకు రాలేదు. బహుశా కలకత్తా వెళ్లిఉండొచ్చు" అన్నాడతడు. నిధి వెనక్కి తిరిగి వచ్చి, "వెతక తలచుకుంటే కలకత్తా వెళ్ళి వెతకాలి" అని చెప్పాడు పండిత మహాశయుడితో. అతడికి ఆ మాటలోని భావ మేమిటో బోధపడలేదు. "గదాధర బాబు అనే ఒక ఆయన వచ్చి ఉన్నాడు, చూశావా?" అని అడిగాడు నిధి. "ఆఁ" అంటూ పండిత మహాశయుడు నోరు తెరిచాడు. "అతడితో కాత్యాయని కలకత్తా చూడటానికి వెళ్లింది" అన్నాడు నిధి. పండితమహాశయుడి ముఖంకాస్తా వాడిపోయింది. కాని అతడి మాట నమ్మలేకపోయాడు. తాను నందీవాళ్ల యింటికి వెళ్లి కనుక్కోలేదు, తప్పకుండా అక్కడికే వెళ్లిఉంటుంది అని అన్నాడు. వెంటనే నందీవాళ్ల యింటికి వెళ్లి వెతికివచ్చాడు. కాత్యాయని జాడ ఏమీ తెలియలేదు. వాడిపోయిన ముఖంతో ఇంటికి తిరిగి వచ్చాడు. "ఇలా జరుగుతుందని నేను ముందే చెప్పానుగా." అన్నాడు నిధి. కాని నిజాని కత డిదివరకు ఎన్నడూ చెప్పలేదీ మాట. పండితమహాశయుడు పెట్టె తీసిచూస్తే కాత్యాయనికి తాను యిచ్చినవే కాకుండా, పెట్టెలోఉన్న నగలూ, డబ్బూ అన్నీ తీసుకుని వెళ్లిపోయినట్లు తేలింది. తలుపులు వేసుకుని కూర్చుని పండిత మహాశయుడు ఆరోజల్లా యేడుస్తూనే ఉన్నాడు, 'ఇదంతా నరేంద్రుడి కుట్రమూలంగా జరిగింది. అతడిమీద దావా వెయ్యి. నేను సాక్షుల్ని తయారుచేస్తాను' అన్నాడు నిధి. అతడికి ఇలాంటి పని చేతిలో ఉంటేనే ఆనందం, 'నా మొహాన ఎలా రాసిపెట్టి ఉందో అలా జరిగింది. దీనికోసమని నరేంద్రుడిమీద నేను దావా చెయ్యను' అన్నాడు పండితమహాశయుడు.

నిధిని వెంటబెట్టుకుని పండితమహాశయుడు కలకత్తా వచ్చాడు. ఒకరోజున మిట్టమధ్యాహ్నా మప్పుడు పండితమహాశయుడు తన స్థూలదేహాన్ని దొర్లించుకుంటూ కాళీఘాట్‌లోని గుంపుమధ్యనుంచిపోతున్నాడు. ఇంతలో ఒక కోచీ వచ్చి ఆగింది ఎదురుగా. పండితమహాశయుడు ఆలయంలోకి వెళ్లివచ్చాడు. కాళీఘాట్ నుంచి వెళ్లిపోదామనే ప్రయత్నంలో ఉన్నాడు. ఆ కోచీచూసి, అది బాడుగకి మాట్లాడుకుని వెళ్లిపోదామని ఉద్దేశంతో ఎలాగో జనాన్ని తప్పించుకుంటూ కోచీ



దగ్గిరకివచ్చి చేరుకున్నాడు. వచ్చిచూస్తే ఆ కోచీలోంచి ముందు ఒక'బాబు'దిగాడు. అతడివెనుకనే ఒక స్త్రీ నవ్వుచూ, తాంబూలం నములుతూ దిగి ఒయ్యారంగా ఆలయంవైపుకి వెళ్లసాగింది. పండిత మహాశయుడు ఆమెనిచూసి నిర్ఘాంతపోయాడు. ఆమె యెవరో కాదు, తనభార్య కాత్యాయనే. గబగబా ఆమె ప్రక్కకివచ్చి నిలబడ్డాడు. కాత్యాయని బిగ్గరగా "ఎవరోయ్ నువ్వు? మీది మీదికి వచ్చి పడతావేమిటి? కళ్లు కన్పించటంలా?" అటూ చాలాసేపు తిట్టిపోసి, చివరికి పండిత మహాశయుని "నీకళ్లేమయినా బయర్లు కమ్మిపోయాయా, ముసిలితనంలో ఇలాచెయ్యటానికి సిగ్గయినాలేదు నీకు?" అని అడిగింది. పండిత మహాశయుడు ఆ రెండు ప్రశ్నల్లో ఒక్కదానికీ సమాధానం చెప్పలేకపోయాడు నోరుతెరచుకుని అలాగే నిలబడిపోయాడు. అతడి తల తిరిగిపోతోంది. మూర్ఛపోతాడేమో అనిపిస్తోంది. కాత్యాయని వెంట ఉన్న 'బాబు' పరుగెత్తుకుంటూ వచ్చి, తనచేతిలోని స్టిక్‌తో పండితమహాశయుని రెండుఅంటించి, విజాతీయభాషలో ఇష్టం వచ్చినట్లల్లా తిట్టి. చివరికి 'పోలీస్, పోలీస్' అని అరిచాడు. పోలీసులు వచ్చారు. పండితమహాశయుడి చుట్టూ జనం గుమికూడారు. 'నా జేబులోంచి డబ్బు కొట్టేశాడు' అని బాబు ఫిర్యాదు చేశాడు. పండితమహాశయుడు భయంతో కళ్లనీళ్ల పర్యంతమై 'లేదు బాబూ! నేను కొట్టెయ్య లేదు. మీరు భ్రమపడి ఉంటారు. ఒకవేళ ఇంకెవరైనా కొట్టేస్తే కొట్టేసి ఉండొచ్చు' అన్నాడు. 'దొంగ, దొంగ' అంటూ పెద్ద కలవరం బయలుదేరింది. చుట్టూ కొందరు కుర్రాళ్ళు పోగయారు. కొందరు అతడి పిలక పట్టుకు లాగారు. కొందరు గిల్లటం మొదలెట్టారు. పండిత మహాశయుడు కంగారుపడిపోయి ఏడవసాగాడు. తన బొడ్డులోఉన్న డబ్బు అంతా తీసి బాబుకి యిస్తూ "మీ డబ్బు కనుక పోతే ఇది తీసుకోండి. నేను బ్రాహ్మణ బిడ్డను. మీ కాళ్లు పట్టుకుంటున్నాను. నన్ను కాపాడండి" అన్నాడు. దీనివల్ల అతడి నేరం బలమయింది. పోలీసులు అతడి చెయ్యిపట్టుకున్నారు. ఈ సమయంలో నిధి ముఖం, కళ్లూ ఎర్రజేసుకుని, జనాన్ని తోసుకుంటూ వచ్చాడక్కడికి. నిధికి ఒక సూట్ ఉంది. కలకత్తాలో ఉన్నప్పుడు సూటు వేసుకోందే బయటికి రాడతడు. సూటు ధరించిన నిధి వచ్చి "ఎవరది?" అన్నాడు గంభీరంగా. అనగానే చుట్టూ అంతా నిశ్శబ్దమయిపోయింది. నిధి జేబులోంచి ఒక కాయితమ్ముక్క పెన్సిల్ తీసుకుని. పోలీసుల్ని వాళ్ల నెంబరు ఎంతో, ఏ పోలీసు స్టేషన్‌లో ఉండేవాళ్లో చెప్పమని దబాయించాడు. వాళ్ళ సమాధానం చెప్పకపోయేసరికి ఎదురుగా ఉన్న కోచ్ మాన్‌ని 'లాల్‌దఘిలోని ఆండ్రూస్ దొరగారిల్లు తెలుసా?' అని అడిగాడు. ఆ దొర ఇతడికి ఏమవుతాడో అనుకున్నారు పోలీసులు. వాళ్ళు బాబూ! బాబూ! అనటం మొదలెట్టారు. నిధి వెంటనే వెనక్కి తిరిగి, ఆ బాబుని, "మీ యిల్లెక్కడ మహాశయా! మీ పేరేమిటి?" అని ప్రశ్నించాడు. బాబు ఈ గందరగోళంలో చల్లగా జారుకున్నాడు. ఆ పోలీసులు కూడా ఇంకేం మాట్లాడకుండా జనం గుంపులో కలిసిపోయారు. నిధి పండితమహాశయుణ్ణి చెయ్యిపట్టుకుని తీసుకువెళ్ళి ఒక బండిలో ఎక్కించాడు. ఆ రాత్రే స్వగ్రామానికి ప్రయాణమైనారు. పాపం పండితమహాశయుడు సిగ్గుతో, దుఃఖంతో పసిపిల్లవాడిలా ఏడవసాగాడు. 'నగలు, డబ్బు ఎత్తుకుపోయినట్లు కాత్యాయనిమీద కేసు పెడితే సరి' అన్నాడు నిధి. పండిత మహాశయుడు దానికే మాత్రం ఒప్పుకోలేదు.

ఊరికి తిరిగివచ్చాక పండితమహాశయుడు కరుణ వృత్తాంతమంతా విన్నాడు. 'ఈ ఊళ్ళో ఉండి ఏం చెయ్యనిహ? శూన్య గృహాన్ని విడిచిపెట్టి కాశీ వెళ్ళిపోతాను. విశ్వేశ్వర సన్నిధానంలో ప్రాణాలు వదుల్తాను' అని పండితమహాశయుడు తన ఆస్తి అంతా అమ్మి కాశీకి వెళ్ళి పోయాడు. ఊళ్లో పిల్లలందరూ అతడిచుట్టూ మూగారు. అశ్రుపూర్ణ నేత్రాలతో అత డందర్నీ ఆదరంగా పలకరించాడు. అతడి ముఖంకేసి చూసి కంట తడిపెట్టని కుర్రవాడంటూ లేనేలేడు. ఇలా ఏడుస్తూ పండిత మహాశయుడు ఊరు వదిలిపెట్టి వెళ్ళిపోయాడు. ఎంతోమందిని చూశాం కాని అంత మంచివాణ్ణి ఎక్కడా చూడలేదు — అనుకున్నారు అందరూ.

నరేంద్రుడి ఇల్లూ, ఆస్తీ అంతా వేలం వేసేశారు. నరేంద్రుడు ఊరు విడచిపెట్టి కలకత్తా వెళ్ళిపోయాడు. కలకత్తాలో ఎక్కడుంటున్నాడో ఎవరికి తెలుసు?

## ౧౮

మహేంద్రుడు వెళ్ళినాక—అతడు వెళ్ళిపోవటానికి తానే కారణమనుకుంది రజని. మహేంద్రుడితల్లి రజని దురుసుగా ఏదో ప్రవర్తించటంవల్ల కొడుకు వెళ్ళి పోయా డనుకుంది. ఆమె వచ్చి "దౌర్భాగ్యురాలా? దయ్యంలా దాపురించావ్!" అని నిందించింది కోడల్ని. "రాక్షసీ! నువ్వే ఈ సంసారాన్ని పాడు చేశావ్" అన్నాడు రజని మామగారు. "ఈ దౌర్భాగ్యురాలితో ఏ దుర్ముహూర్తాన అయిందో అన్నయ్యపెళ్లి" అన్నది ఆడబిడ్డ. రజని ఒక్కమాట కూడా మాట్లాడ లేదు. రజనికే అసలు తనమీద తనకి అసహ్యం పుట్టింది. ఆ అసహ్యత మూలంగా వీళ్ళు అన్న మాటల్లో అనుచితం ఏమీలేదని తోచింది. తనకిన్ని తిట్లురావడం, తాను వాటినన్నీ పడటం సబబే అనుకుంది రజని. ఎవర్నీ ఏమీ అన లేదు. ఒక్కసారి కంట తడికూడా పెట్టుకో లేదు. కొన్నాళ్లనుంచి ఆమెముఖం గంభీరంగా, శాంతంగా ఉంటోంది. ఆమె తనలో తాను ఏదోఒక నిర్ణయానికి వస్తోంది. మహేంద్రుడు ఇంట్లోంచి వెళ్లిపోయి రెండు మాసాలయింది. ఈ రెండు నెలలనుంచీ ఏదో

ఆలోచన ముగిసింది. అందుకనే రజని ముఖంలో అంత గాంభీర్యం! అంత శాంతం!

సంజెపడ్డాక ఆమె మెల్లిగా మోహిని ఇంటికి వెళ్లింది. మోహినిని కలుసుకుంది. ఏదో చెపుదామనుకుంది కాని చెప్పలేకపోయింది. చెప్పటానికి సాహసించ లేకపోయింది. దాంతో తడబడుతూ నుంచుంది. మోహిని ఎంతో స్నేహంగా "ఏమిటి రజనీ! ఏమిటి చెప్పాలని వచ్చావ్?" అని అడిగింది. రజని భయంతో మెల్లిగా—"అక్కా నువ్వు ఒక్కపని చేసి పెట్టాలి" అన్నది. "ఏమిటిచెప్పు?" అని ఆత్రంగా అడిగింది మోహిని. రజని చెప్పటమా మానటమా అని సందిగ్ధావస్థలోపడి. చివరకు ఎంతో బలవంతం చేసిన మీదట—మెల్లిగా "ఒకఉత్తరం రాసిపెట్టాలి" అన్నది మోహిని. ఎవరకి రాయాలి? మహేంద్రుడికి.. ఏమని వ్రాయాలి?.. అతణ్ణింటికి తిరిగి వచ్చెయ్యమని. అత డింక ఎక్కువ రోజులు బాధపడ నవసరం లేదు. రజని తన అక్కగారింటి దగ్గరఉంది—ఇలా చెపుతూనే ఏడ్చింది రజని...

౧౯

జ్యేష్ఠమాసం—మధ్యాహ్నం. ఎండ మండిపోతోంది. పల్లెటూరి వీధిలో దుమ్మని రేగకొడుతూ ఒకటి రెండు ఎడ్లబళ్లు నెమ్మదిగా వెడుతున్నాయి. ఒకళ్లిద్దరు మార్గస్థులు గబగబా నడిచి వెడుతున్నారు. ఆ మిట్టమధ్యాహ్నం వేళ ఎక్కడిదో పిల్లంగ్రోవి పాట మాత్రం ఒకటి వినుపిస్తోంది. బహుశా ఏ గొల్లపిల్లవాడో పశువుల్ని పచ్చిక బీడులో వదిలి, ఏ చెట్టుక్రిందో చేరి వాయిస్తూ ఉండి ఉంటాడు.

కరుణ రాత్రి అంతా నడిచి నడిచి అలసిపోయి, చెట్టుక్రింద పడి ఉంది. ఎవరింట్లో నయినా భోజనం చెయ్యటం కాని, ఎవర్నిఅయినా ఏదయినా అడగటం కాని ఆమె స్వభావానికి విరుద్ధం. ఏంచేస్తే ఏమవుతుందో, ఏంమాట్లాడాలో, ఏం చెప్పాలో అసలది



ఆమె కేమయినా ఆలోచనంటూ వస్తేగా! ఎవరైనా కన్పిస్తే ఆమె భయంతో తొట్రుపడుతుంది. ఒక్కొక్క మార్గస్థుడే వస్తూంటే ఆమెకి భయంవేస్తోంది. ఈసారి ఇంక తనదగ్గరికి వస్తాడు, అతడిలో ఏదో దురుద్దేశం ఉండి ఉంటుంది అని. మధ్యాహ్నం మూడు గంటలయి ఉంటుంది. కరుణ అప్పటివరకూ ఏమీ తినలేదు. ఇంతదూరం నడిచిన అలసట, జుట్టురేగిపోయి దుమ్ముకొట్టుకోవటం, తిండీ, నిద్ర లేకపోవటం, పైగా దిగులు మూలంగా. ఒక్కరోజులోనే ఆమెముఖం చూస్తే గుర్తుపట్టటానికి వీల్లేనంతగా పీక్కుపోయి, నల్లబడిపోయింది.

అదుగో! ఒక బాటసారి వస్తున్నా డెవరో. చూస్తే మంచివాడుగా కన్పించటంలేదు. అతడి కళ్లన్నీ కరుణమీదనే ఉన్నాయి. ఏదో జావళీలాంటి పాట పాడుకుంటూ వస్తున్నాడు. కాని జ్యేష్ఠమాసపు మిట్టమధ్యాహ్నపువేళ రసికత్వానికి తగిన సమయం కాదని కాబోలు. పాట పాడుకుంటూ వెనక్కితిరిగి చూస్తూ అలా వెళ్లిపోయాడు. తర్వాత ఇంకొకరు, మరొకరు, వేరొకరు ఇలా కొందరువచ్చి వెళ్ళిపోయారు. ఇంతవరకు కరుణ మర్యాదస్థుడైన బాటసారిని ఒక్కణ్ణీ చూడలేదు. కాని ఇదేమిటి, కొంపమునిగింది. ప్యాంటూ కోటూ వేసుకున్న పెద్దమనిషి ఒకడు వస్తున్నాడు. ఒక్కొక్కప్పుడు అసలిలాంటి పెద్దమనుషులవల్ల వచ్చే ప్రమాదం మరెవరివల్లా రాదు. అదుగో. కరుణ కూర్చునిఉన్న చెట్టుక్రిందికే వస్తున్నాడు. కరుణ భయంతో గజగజలాడుతూ నేలకేసే చూస్తూ కూచుంది. ఆ బాటసారి అతి శాంతంగా ఆ చెట్టు నీడలోకే వచ్చి కూర్చున్నా డెందుకో! కూర్చోటానికి ఇంకెక్కడా చోటు లేకపోయిందా? దారి ప్రక్కన ఇంక చెట్లు లేకపోయాయా? ఆ బాటసారి స్వరూప్‌బాబు. ఆడవాళ్లంటేనే సహజమైన ఆకర్షణ స్వరూప్‌బాబుకి. ఆ ఆకర్షణని వదిలించుకోలేక చెట్టుక్రిందికి వచ్చి కూర్చున్నాడు. కరుణ అక్కడ కన్పిస్తుంది అని తెలియదతడికి. కాని కరుణని చూడగానేమాత్రం గుర్తించాడు. అప్పటి అతడి ఆనందానికి, ఆశ్చర్యానికి అంతులేదు. కరుణ చూడలేదు. ఎవరీ పథికుడు? ఆమె భయంతో విహ్వాలు రాలయింది. అక్కడినుంచి లేచి వెళ్ళిపోదా మనుకుంటోంది. కాని వెళ్ళలేకపోతోంది. కొంతసేపటికి ఆ ఆనందాన్ని, ఆశ్చర్యాన్ని కాస్త తమాయించుకున్న తర్వాత స్వరూప్ ఎంతో మృదువుగా "కరుణా!" అని పలకరించాడు. కరుణ ఈ సంబోధన విని ఉలిక్కిపడింది. ఒక్కసారి అతడికేసి చూసింది. స్వరూప్‌బాబు. అతడికంటే ఒక త్రాచుపాము దగ్గిరకొచ్చినా ఆమెకి ఇంతకంటె తక్కువ భయం వేసేది. కరుణ పలక లేదు. స్వరూప్ ఎన్నో సంగతులు ఏకరువు పెట్టటం మొదలెట్టాడు. ఈ మధ్య రాత్రిళ్లు కరుణకోసమని తానెంత బాధపడుతూ వచ్చాడో అదంతా వర్ణించాడు. ఆ ఆనందదాయకమైన వెన్నెల రాత్రిలో తమ ప్రేమసల్లాపాలు ప్రారంభమవుతూండగానే

భగ్నం వాటిల్లినందుకు ఎంతో దుఃఖించాడు. తాను కేవలం అభాగ్యుడు. జీవితాంతం దుఃఖం అనుభవించటానికే విధాత సృష్టించాదేమో తనను: తన ఆశలు ఒక్కటీ ఫలించలేదు. చివరికి కరుణ నరేంద్రు డింట్లోంచి బయటికి వచ్చేసినందుకు ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేశాడు. ఇది చాలా మంచిదయిందని, తమ ప్రేమ స్వర్గీయ ప్రేమ అనీ, దీన్నింక నిరాటంకంగా అనుభవించవచ్చునని, ఇలా ఇంకా ఎన్నో మాట్లాడాడు. అవన్నీ వ్రాయాలంటే పెద్దపెద్ద నవలల్లోని రాజపుత్రక్షత్రియులు, లేదా మహామహా నాయకుల్లో గాని విలీనంకావలసి ఉంటుంది. కాని కరుణ అతడి మాటల్లోని రసాన్ని అస్వాదించటం లేదు.

స్వరూప్ అలహాబాద్ వెడదామని బయలుదేరాడు స్టేషన్‌కి దారిలో జరిగిం దీ సంఘటన. కరుణని తనతో పశ్చిమానికి రమ్మని, అలా వస్తే ఇంక ఎలాంటి చింత పెట్టుకోనక్కర్లేదనీ అన్నాడు స్వరూప్. కరుణ నిన్నరాత్రినుంచి ఆలోచిస్తోంది — ఎక్కడికి వెళ్ళటం — ఏమిటి చెయ్యటం అని. కాని ఏమీ తోచలేదు. ఈ దిగుళ్ళమధ్య ఆమెకీ ప్రస్తావన కొంతవరకు నచ్చకపోలేదు. చిన్నప్పటినుంచి ఆమె ఎన్నడూ ఇల్లు కదలి ఎక్కడికీ వెళ్ళి యెరుగదు. అలాంటి ఆమె అనావృతమైన ఈలోకపు దృష్టిని ఎలా సహించగలదు ? ఏదైనా ఒక ఆశ్రయం అనేది దొరికితే లోకుల దృష్టినుంచి తప్పించుకుని కాలం గడపవచ్చు. ఆమెకి అందరూ తన ముఖంకేసే చూస్తున్నా రనిపించేది. అదీకాక కరుణ సహించ శక్యంకానంతగా బెంబేలుపడిపోయింది. స్వరూప్ ప్రస్తావనకి అంగీకరించి వెడదామా అనిపించింది ఒకసారి. కాని స్వరూప్‌అంటే ఆమెకి ఎంతో భయంఉంది. అంచేత కాలు కదప బుద్ధిపుట్టటంలేదు. ఈ చెట్టుకింద ఇలా తిండితిప్పలు లేకుండా పడిఉండి ప్రాణాలు విడుద్దామా అని ఆలోచించింది ఒకసారి. కాని రక్తమాంసాలున్న శరీరం దానికి ఎలా తట్టుకోగలదు ! అంచేత ఆ ఆలోచన ఎంతోసేపు నిలవలేదు. స్వరూప్ ప్రస్తావనకి సమ్మతించింది. సంజెపడింది. స్వరూప్, కరుణ ఇప్పుడు రైల్లో ఉన్నారు....

## —౨౦

కరుణ - స్వరూప్ కాశీలో ఉన్నారు. కరుణ దురవస్థ చెప్పలేం. ఆమె ఎప్పుడూ భయభయంగా ఉంటూ - ఎలాంటి పరిస్థితుల్లో రోజులు గడుపుతోందో - అది ఆమెకే తెలియాలి. స్వరూప్ భ్రమ చాలారోజుల క్రితమే తొలిగిపోయింది. కరుణ తనని ప్రేమించటం లేదని ఇప్పుడు తెలిసింది. 'ఏమిటీ ఉత్పాతం. ఇంత కష్టపడి - రైలుఖర్చులు పెట్టుకుని తీసుకువచ్చాను. అంతా వ్యర్థమయిందే' అనుకుంటున్నాడు. అతడి కెంత కొరకొరగా ఉందో చెప్పలేం. ఇంత కవిత్వం రాశాను. ఇన్ని ఊహాసౌధాలు నిర్మించుకున్నాను. ఇంక ఆ ప్రేమంతా అనుభవించవచ్చుకదా అనుకున్నా డతడు. కాని అతడు దగ్గరకివస్తే కరుణ భయంతో ముడుచుకుపోతుంది. అతడితో మాట్లాడనైనా మాట్లాడదు. ''ఏమిటీ బెడద: ఈ గుదిబండని వదిలించుకుంటేనే కాని — ప్రాణం కుదటపడదు'' అనిపించింది. పోనీ కొన్నాళ్లు దగ్గరఉంటే ప్రేమ కలుగుతుందేమో అన్న ఆలోచన వచ్చింది. స్వరూప్ తనకి సాధ్యమైనదంతా చేశాడు. కాని, కరుణ ప్రేమిస్తున్న సూచనలేవీ కనపడలేదు. పాపం కరుణకి మనశ్శాంతి — విశ్రాంతి అనేవి లేవు. సర్వదా పరాయి ఇంట్లో అపరిచితునితో ఉంటున్నాననే అన్న ఆత్మగ్లానితో కుమిలిపోతోంది. అంతేకాకుండా స్వరూప్ వైఖరీ అదీ చూస్తుంటే భయంతో వణకిపోతూంటుంది. అతడు దగ్గిర కూర్చుని పాటలు పాడుతూంటాడు. కవిత్వం చదివి వినిపిస్తుంటాడు. మనస్సులోని ఆరాటం అంతా వెళ్ళపోసుకుంటూ ఉంటాడు. చివరికి కోపంతో రైలుచార్జీలకోసం కేసు పెడతానని బెదిరించడం మొదలెట్టాడు. కరుణకి ఏమిటి చెయ్యటమో ఎంత ఆలోచించినా తోచడంలేదు. పాపం భయంలో క్రుంగిపోతోంది. స్వరూప్ రాత్రింబగళ్ళు ధుమ ధుమలాడుతూంటాడు. అంతేకాదు కరుణని మధ్యమధ్య గద్దించటంకూడా మొదలెట్టాడు. కరుణకి ఏం చెప్పుకునేందుకు అవకాశంలేదు. ఊరికే ఏడుస్తూ ఉంటుంది అస్తమానం. ఇలా కొన్నాళ్ళు గడిచాయి. స్వరూప్ అలహాబాద్ వెళ్ళవలసిన సమయం వచ్చింది. 'ఇప్పుడు కరుణని ఏమిటి చెయ్యటం ? ఇక్కడే విడిచిపెట్టిపోనా ? లేక ఇంతకష్టపడి తీసుకొచ్చాను. చార్జీలు పెట్టుకున్నాను. ఇన్నాళ్లు ఉంచాను. చివరికి విడిచిపెట్టి వెళ్ళనా ? ఇంకా కొన్నాళ్ళు చూద్దాంపోనీ : అని ఆలోచించాడు' ఎంతో ఆలోచించి ఆలోచించి కరుణను పిలిచాడు. కరుణ — 'వెళ్లనా, వద్దా ? వెళ్లకుండా మాత్రం ఏం చెయ్యను ? ఇక్కడ ఎక్కడ ఉండనూ ? ఇంత దూరదేశంలో అపరిచిత ప్రదేశంలో ఎవరిదగ్గిరకి వెళ్లనూ?' అని ఆలోచించి వెళ్ళింది. ఇద్దరూ స్టేషన్‌కి వెళ్లారు. రైలు బయలుదేరటానికి ఇంకా వ్యవధి ఉంది. మూటలు, పెట్టెలు సామానులతో ప్రయాణికులు గందరగోళంగా ఉన్నారు. చెవుల్లో పెన్సిళ్లు పెట్టుకుని లెక్కలురాసే రైల్వే క్లర్కులు ఎంతో బడాయిగా హడావిడిగా అటూయిటూ తిరుగుతున్నారు. కిళ్లీలు, సోడాలు, రకరకాల తినుబండారాలు నెత్తిన పెట్టుకుని అమ్ముకునేవాళ్లు రాబోయే రైలుకోసం ఎదురుచూస్తున్నారు. ఈస్థితిలో ఒక పురుషుడు కరుణ కూర్చునిఉన్న బెంచీమీద — ఆమె ప్రక్కన వచ్చి కూర్చున్నాడు. కరుణ లేచి వెళ్ళబోయింది. ఈసమయంలో ఆమె ప్రక్కన ఉన్న వ్యక్తి ఆశ్చర్యంతో "అమ్మా : నువ్విక్కడున్నావేమిటి ?" అని ప్రశ్నించాడు. కరుణ పండిత మహాశయుని కంఠస్వరం విని గతుక్కుమన్నది. చాలాసేపు ఏం మాట్లాడలేక పోయింది. చాలాసేపు అలా గ్రుడ్లప్పగించి చూస్తూ ఊరుకుని

చివరకి ఏడ్చింది. ఏడుస్తూ "సార్వభౌమ మహాశయా! ఏమిటి నా గీత" అని అడిగింది. పండితమహాశయు డింక కన్నీళ్లు ఆపుకోలేకపోయాడు. అతడు గద్గదకంఠంతో 'అమ్మా అయిం దేమో అయిపోయింది. జరిగినదాన్ని గురించి బెంగపడవద్దు. నేను ప్రయాగ వెడుతున్నాను. నాతోకూడారా. పృధివిలో ఇంక నా కెవరూలేరు. నేను బ్రతికిఉన్నన్నాళ్ళూ నాదగ్గిర ఉండు. అంత వరకు నీవేమీ దిగులుపెట్టుకో నక్కర్లేదు'' అన్నాడు. కరుణ వెక్కివెక్కి ఏడ్చింది. ఈస్థితిలో నిధి వచ్చా డక్కడికి. నిధి పండితమహాశయుని ఖర్చుమీద కాశీ చూడటానికి వచ్చాడు. పండితమహాశయుడు అందుకు నిధికి ఎంతో కృతజ్ఞుడై ఉన్నాడు. నిధి రుణాన్ని ఈ జన్మలో తీర్చుకోలేనని అతడే అనేవాడు. కరుణనుచూసి ఒక్కసారి గతుక్కుమన్నాడు. "పండితమహాశయా! ఒక మాట" అన్నాడు. పండితమహాశయుడు తొట్రుపడిపోయాడు. "ఈ బాబుని చూశారా ఎప్పుడైనా?" అని అడిగాడు. పండిత మహాశయుడు ఇటుతిరిగి చూశాడు - స్వరూప్. "చూడు. కరుణ ప్రవర్తన చూడు ఒకసారి. ఛీ. ఛీ. చచ్చిపోయిన తండ్రికి ఎంత అప్రతిష్ఠ తీసుకొచ్చింది!" అన్నాడు నిధి. పండితమహాశయుడు చాలాసేపు కళ్లు అప్పగించి చూస్తూ ఊరుకున్నాడు. చివరికి చేతులు త్రిప్పుతూ మెల్లిగా —

''స్త్రీణాంచ చిత్తం పురుషస్య భాగ్యం
దేవోనజానాతి, కుతో మనుష్యః''

అన్నాడు. ''పాపం, నరేంద్రుడు మంచివాడే. ఈ రాక్షసి అతణ్ణి నాశనం చేసింది.'' అన్నాడు నిధి. నరేంద్రుడు మంచి వాడు—అనటంలో పండిత మహాశయుడికి సంశయం ఏమీలేదు. కాని ఇప్పుడు పాడైపోయినాడు. దానికి ప్రమాణాలున్నాయి. కాని అతడు ఎందుకు పాడైపోయిందీ ఇప్పుడు తెలిసింది. పండిత మహాశయుడికి స్త్రీజాతిమీద ఎంతో అసహ్యం జన్మించింది. ఇంక లేదు, స్త్రీ మూలంగానే తాను నాశనమయాడు. ఇంక 'ఆడదాన్ని నమ్మకూడదు' అనుకున్నాడతడు. నిధి కోపంతో—"చూడండి బాబూ చూడండి. పాపకార్యం చెయ్యటానికి ఇంకెక్కడా స్థానం లేదా? ఈ కాశీయేనా?" అన్నాడు. ఈ సంగతి పండితమహాశయుడి ఆలోచనలోకి రాలేదు ఇంతవరకు. విని తెల్లబోయి కాసేపు నిధి ముఖంకేసి చూస్తూ ఉండి పోయాడు! 'నిజమేగా!' అనుకున్నాడు. ఒకగంట మ్రోగింది. జనం ఒకచే గోలగా అటూ యిటూ పరుగెత్తు తున్నారు. పండిత మహాశయుడు బెంచి దగ్గిర మూట విడిచిపెట్టి వచ్చాడు. దాన్ని ఆదరాబాదరా తెచ్చుకోటానికని వెళ్ళాడు. ఈ సమయంలో స్వరూప్ హడావిడిగా కరుణని పిలవటానికివచ్చాడు. కరుణ కాతర స్వరంతో పండిత మహాశయుని—"సార్వభౌమ మహాశయా! నన్ను విడిచిపెట్టి వెళ్ళకండి, అన్నది. ''అమ్మా! చాలా వంచనని సహించాను. వృద్ధాప్యంలో ఇంక ఏమీ పట్టించుకోకూడదు అని నిశ్చయించుకున్నాను. ఈ మిగిలిన రోజులు దైవ సేవలో గడపతలచుకున్నాను" అన్నాడు. కరుణ ఏడుస్తూ పండిత మహాశయుడి కాళ్లు పట్టుకుంది—'నన్ను విడిచిపెట్టి వెళ్ళకండి— అన్నది. పండిత మహాశయుడి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. రాసిపెట్టి ఉన్నదాన్ని ఎవరూ తప్పించుకోలేరు కదా. అనుకున్నాడు. నిధి పరుగెత్తుకుంటూ వచ్చి ఒక్కసారి గద్దించి. "ఇక్కడ నోరు తెరుచుకు కూచుంటే ఏమయినట్లు? రైలు దాటి పోతుంది". అన్నాడు. అని పండితమహాశయుని చెయ్యి పుచ్చుకొని లాక్కెళ్ళి. ఒక పెట్టెలో ఎక్కించాడు. కరుణకి అంతా అంధకారంగా తోచింది. తల తిరిగిపోయి, అక్కడే మూర్ఛపోయింది. ఇంక స్వరూప్ కనపడలేదు. ఆగోలలో చాలా సేపటి క్రితమే రైల్లోకి పోయి కూర్చున్నాడు. ఆగ్నిమయి అంకుశ తాపానికి ఆర్తనాదం చేస్తూ కదలి వెళ్ళింది రైలు. స్టేషన్‌లో ఇంక ఎవరితో మనలేనని—

## —౨౧

ఈ సమయంలో మహేంద్రుడి దగ్గిరనుంచి నాకు వచ్చిన ఉత్తరాల్లోంచి ఒక ఉత్తరాన్ని ఇక్కడ ఉటంకిస్తున్నాను.

సోదరా,

"ఎంత బాధతో—ఎంత సిగ్గుతో—ఎంత ఆత్మగ్లానితో ఊరు విడిచి పెట్టి వెళ్ళిపోయానో—అదంతా నీ దగ్గిర దాచను నేను. ఆ అర్ధరాత్రి, నిర్జనమార్గాన బయలు దేరటానికి కారణం ఏమీలేదు. ఉద్దేశమూ ఏమీలేదు. గమ్యస్థానమూ లేదు. అప్పుడు ఎందుకు వెడుతున్నానో, ఎక్కడికి వెడుతున్నానో ఏమీ ఆలోచించ లేదు. ఈ పథం అనంతమనీ, జీవితం అంతా ఇలా నడుస్తూనే ఉండాలని. ఎంత నడచినా ఈ మార్గం అంతమవదనీ, ఈ రాత్రి తెల్లవారదనీ అని పించింది. మనస్సులో ఎంతటి ఉదాసీనతాంధకారం ఆవరించు కుందో చెప్పలేను. కాని రాత్రి చీకటి విచ్చిపోతున్నకొద్దీ. పగటి కోలాహలం జాగృత మవుతున్నకొద్దీ నా మనస్సులోని ఉద్రేకం కూడా చల్లారుతూ వచ్చింది. అప్పుడు అంతా బాగా ఆలోచించు కునే అవకాశం దొరికింది. కాని అప్పుడు కూడా తిరిగి వెళ్ళిపోదా మని మాత్రం బుద్ధిపుట్టలేదు. ఎన్నో ఊళ్లు చూశాను. ఎన్నిచోట్లకో తిరిగాను. ఎన్నో రోజులూ నెలలు గడచిపోయాయి. కాని ఏమేమి చూశానో, ఏం చేశానో ఏ మయినా జ్ఞాపకం ఉంటేగా. కళ్లముందు ఎన్నో పర్వతాలు, నదులు. అరణ్యాలు, ఆలయాలు, మేడలు, ఊళ్లూ తిరిగి పోయేవి. కాని అవి ఏమీ విశిష్టంగా తోచేవే కావు. ఏదో మాయలాగా, స్వప్నంలాగా ఉండేవి. ఏదో కళ్ల ముందు కన్పించాయి కనుక చూశాను అంతే. ఇలా ఎన్నాళ్లుగడిచి పోయాయో చెప్పలేను. ఒక సంవత్సరం గడిచి ఉంటుందను కున్నాను. కాని తర్వాత లెఖ్కవేసి చూస్తే నాలుగునెలలే గడిచింది!

నా మనసు చాలా కుదట పడింది. ఇప్పుడు జరిగిన దాన్ని, జరగబోయే దాన్ని ఆలోచించుకునే అవకాశం చిక్కింది. ఇప్పుడు నేను లాహోరు వచ్చాను. ఇక్కడ ఉన్న ఒక బెంగాలీబాబు ఆశ్రయాన్ని పొందాను. ఇక్కడ కొద్దికొద్దిగా ప్రాక్టీసు చెయ్యటం మొదలెట్టాను. ఇప్పుడు నా ఆదాయం త్రోసి పుచ్చతగినంత స్వల్పమేమీ కాదు. కాని ఆదాయాన్ని గురించి చింతించటం లేదు భాయీ! నా హృదయంలో ఒక నూతన మనస్తాపం బయలు దేరింది. అది నన్నెంత కలవర పరుస్తోందో చెప్పలేను. నా మీద నా కెంత అసహ్యం వేస్తోందో ఎలా వ్యక్తం చేయటం? ఇంటిదగ్గిర ఉన్నంతకాలం యెప్పుడూ ఒక్క క్షణంకూడా రజనిని గురించి ఆలోచించి యెరుగను. కాని ఇల్లు వదలి వచ్చాక రజనిని గురించి ఆలోచించని క్షణమంటూ లేదిప్పుడు. స్వదేశానికి దూరమవుతున్న కొద్దీ, ఒకొక్కరోజే గడుస్తున్నకొద్దీ—రజని విషయమే మరీమరీ గుర్తుకు రావటం మొదలెట్టింది. అలాగే నే నెంతో నిష్ఠురుణ్ణనీ, పిశాచాన్ననీ తోచసాగింది. ఇప్పుడిహ ఇంటికి తిరిగి వెళ్లానని, వెళ్లి ఆమెని ఆదరించాలనీ ప్రేమించాలని, ఆమెని క్షమాపణ కోరాలని బుద్ధిపుడుతోంది. ఆమె ఇప్పటికి నా కళంకగాథ అంతా విని వుండొచ్చు. ఆమె దగ్గిర నే నెలా నిలబడగలను? అహం నే నలా చెయ్యలేను.........''

మహేంద్ర.

ఏ బాహ్య కారణాలవల్ల మహేంద్రుడికి రజనిమీద అయిష్టత ఏర్పడిందో—ఆ కారణాలకి దూరంగా వుండటంవల్ల అతడికి ఆలోచించుకునే అవకాశం దొరికింది—అని అనుకున్నాను నేను. తన నిష్ఠుర ప్రవర్తన తెలిసి వచ్చినప్పటినుంచీ ఆమె మీద మమత బలపడసాగింది. తాను ఆమెని ఎందుకు ప్రేమించ లేదో అంత కోమల హృదయని, స్నిగ్ధ స్వభావురాలిని ప్రేమించని రాక్షసులంటూ వుంటారా అనేది ఎంత ఆలోచించినా తోచటం లేదు. ఏం? ఆమె చూడటాని కేమైనా అనాకారిగా ఉంటుందా! అనాకారి ఆ ప్రేమఒలికే కళ్లు, కోమల భావాల్ని వ్యక్తం చేసే ఆ ముఖం! భావాన్ని పట్టా అందం; రంగును బట్టా? రజనిలో ఉన్న మంచే మహేంద్రుడికి కనిపించసాగిం దిప్పుడు. ఆమెలో వున్న చెడుని కూడా మంచిగా తీసుకోటానికి ప్రయత్నిస్తున్నాడు. క్రమంగా రజని ఎంత ఉత్తమరాలిగా తోచసాగిందో—తాను అంత అధముడని తోచసాగింది.

మహేంద్రుడి కక్కడ రాబడి పెరగసాగింది. నెలకి రెండు వందలు దాకా సంపాయిస్తున్నాడు. కాని ఇంచుమించు అంతా రజినికే పంపిస్తున్నాడు. తన కోసం ఎంత తక్కువ డబ్బు అట్టి పెట్టుకుంటున్నాడో చెప్పలేను. దాంతో, అతడికి ఎలా సరిపోతోందో!

మహేంద్రుడి ఇంటికి వెళ్ళాలని చాలా రోజులనుంచి అనిపిస్తోంది. కాని జరిగినవన్నీ జ్ఞాపకం వస్తూ ఉండడంతో—తిరిగి వెళ్ళటానికి అడుగు సాగటంలేదు. మహేంద్రుడికి ఒక ఉత్తరం వచ్చింది అది వచ్చినప్పటినుంచీ మనస్సు మనస్సులో ఉండటంలా. అది మోహిని రాసిన ఉత్తరం. ఉత్తరం చివర—''మీకు రజనిని చూడటమే ఇష్టం లేకపోతే—రజని ఇక్కడ ఉన్నది కనుక మీకు ఇక్కడికి రావటానికి మనస్కరించక పోతే-మీరంత సంకోచించవలసిన అవసరం యేమీలేదు. ఆమె తన అక్కగారింటికి వెళ్ళిపోతుంది. రజనికి వ్రాయటం చేతకాదు కనుక—ఆమె తరఫున నేను వ్రాస్తున్నాను. ఆమెకి వ్రాయటం చేతనయినా బహుశా మీకు వ్రాయటానికి సాహసించేది కాదేమో!'' అని వ్రాసి ఉంది.

ఇందులోని మృదు తిరస్కార భావం మహేంద్రుకి మనస్సుని గ్రుచ్చుకుంది. అతడు స్వదేశానికి తిరిగి రావటానికి నిశ్చయించుకున్నాడు.

రజని క్రమక్రమంగా చిక్కిపోవటం మొదలెట్టింది ముఖం వివర్ణమై, విషాదభరితమైంది. ఓనాడు సాయంత్రం ఆమె మోహిని కంఠాన్ని కావిలించుకుని, ''అక్కా; నేనింక అట్టే రోజులు బ్రతకను'' అన్నది. అదేమిటి రజనీ! అలా అనకూడదు. అన్నది మోహిని. "అవును అక్కా, నాకు తెలుసు. నేనింక ఎక్కువ రోజులు బ్రతకను. ఈ లోపుగా ఒక వేళ వారు కనుక రాకపోతే— ఈ డబ్బు వారికి ఇయ్యి వారు నెల నెలా నాకు డబ్బు పంపిస్తున్నారు కాని నాకు ఖర్చు పెట్టుకోవాల్సిన అవసరం కలగలేదు, అంతా కూడబెట్టి ఉంచాను" అన్నది రజని. మోహిని ఎంతో ఆప్యాయంగా రజని ముఖాన్ని తన గుండెలమీదికి తీసుకొని, "ఛా ఊరుకో. అలాంటి మాటలు మాట్లాడకు.'' అన్నది మోహిని ఎంతో కష్టం మీద అశ్రువుల్ని అపుకోగలిగింది— 'మాతా భగవతీ ఈమె దుఃఖానికి నేనే కారణమయితే, అది నా దోషం కాదు". అనుకుంది మనస్సులో.

కాస్త తీరిక చిక్కిందంటే చాలు రజని అత్తగారు ఆమెని సాధించడం మొదలెట్టేది. ఆమె రూపాన్ని రకరకాల జంతువుల రూపాలతో పోల్చేది. అసలీ పెళ్ళి అయినదగ్గర్నుంచీ ఇలాంటి దుస్సంఘటన ఏదో జరుగుతుందని నే ననుకుంటానే ఉన్నా అని అంటూ ఉండేది. అయితే ఇలా జరుగుతుందని ముందు తెలిస్తే ఈ వివాహాన్ని ఎందుకు జరగనిచ్చిందో ఆ సంగతి మాత్రం చెప్పదు. రజని కనుక లేకపోతే మహేంద్రుని వియోగం చాలా బాధాకరంగా ఉండేది తల్లికి. అందులో ఏమీ సందేహం లేదు. ఇప్పుడు మధ్య మధ్య రజనిని దూషించటానికి అవకాశం చిక్కుతోందటం—బాగానే ఉంది ఆమెకి. మహేంద్రుడి తల్లి వైఖరి మొత్తానికి నాకు తెలిసిన దాన్నిబట్టి—మహేంద్రుడి వియోగాన్ని కూడా ఆమె అదృష్టంగా భావించుకుంటోందా అని అనిపిస్తూ

ఉంటుంది. మహేంద్రుడున్నప్పుడు — రజని ఏరోజైనా ఏమీ తప్పుచెయ్యకపోతే — ఆ రోజు ఆమెకి ఎలాగో ఉండేది. చివరికి ఆలోచించి ఆలోచించి రెండేళ్ల క్రిందటి పాతసంగతులన్నీ ఎత్తి బుగ్గపోట్లు పొడిచేది. కాని ఈ సంఘటన జరిగినప్పటినుంచీ ఆమె 'తిట్ల — భాండాగారం' ఎప్పటి కప్పుడు చాలా గట్టిగానే ఉంటోంది. ఈలోగా మహేంద్రుడి తల్లి అతడికి ఒక శోచనీయమైన వుత్తరం వ్రాయించింది. తన ముద్దుల కొడుకుని నిశ్చింతగా వుండుమని, అతడికోసం మరొక మంచి సంబంధం వెతుకుతున్నానని, ఆ వుత్తరం. ఈ వుత్తరం రావటంతో మహేంద్రుడు మరింత సిగ్గుపడసాగాడు. "అంతే అందానికి దాసుణ్ణి నేను అనుకుంటారు లోకులు. రజని చూపులకు బాగుండదనేనా నామె యెడ నిష్ఠురంగా ప్రవర్తించానా లోకానికి నా ముఖం ఎలా చూపించను?' అనుకున్నాడు. కాని ఇప్పుడు రజనికి ఏ మాత్రం మాట అన్నా మనస్సుకి గుచ్చుకుంటోంది. ఇదివరకటికంటే కూడా బాగా భయపడిపోతోంది. తన ఆరోగ్యం సన్నగిలుతున్న కొద్దీ, ఆమె భయంతో తిరస్కారాలతో మరింత బాధ పడసాగింది. తిరస్కారాలను రోజురోజుకీ ఎక్కువగా వింటూన్నకొద్దీ తాను నిజంగానే దోషిననే దృఢవిశ్వాసం కలిగింది రజనికి. మోహిని రోజూ సాయంత్రం వేళప్పుడు ఆమె దగ్గిరకు వచ్చేది. చేతనయినంత వరకు ఆదరించేది. రజని రోజురోజుకీ చిక్కిపోతోందని ఆమె గ్రహిస్తూనే ఉంది. ఒకరోజున మహేంద్రుడింటికి తిరిగి వస్తున్నాడనే వార్త తెలిసింది రజనికి. ఆనందంతో ఉప్పొంగిపోయింది. కాని తనకెందుకు ఆనందం? మహేంద్రుడు తనని వెనకటిలాగానే అసహ్యదృష్టితో చూస్తాడు! ఏమయినా కానియ్ — మహేంద్రుడు తనమూలంగా ఇల్లువదలిపోయి, పరాయిదేశంలో కష్టాలు పడుతున్నాడనే ఆత్మగ్లాని బాధనుంచి విముక్తి కలిగింది. కారణం ఏదయినా మహేంద్రుడు విదేశాలకి వెళ్లి బాధపడుతూండటం ఆమెకి చెప్పనలవికానంత బాధ...

—౨౨—

కాశీ స్టేషన్‌లో కరుణని గురించి జరిగిన సంఘటనంతా ఒక పెద్దమనిషి గమనిస్తూ ఉన్నాడు. స్వరూప్‌ని చూసి, అతడు లజ్జితుడై, సంకోచంతో తప్పుకున్నాడు. అందరూ వెళ్ళిపోయాక కరుణ మూర్ఛపోయి అలాగే పడి ఉండడం చూసి, ఒక బండి పిలిచి, ఆమెని అందులో ఎక్కించి తన వసతి గృహానికి తీసుకెళ్ళాడు. అతడికి ఎక్కడికో వెళ్ళవలసిన అవసరం ఉంది. కాని అక్కడికి వెళ్లలేదు. కరుణముఖంచూసి, ఆమెని దోషి 'అని' సందేహించేవాళ్లు ఎవరుంటారు? మహేంద్రుడు కూడా ఆమెను సందేహించలేదు. అన్నట్లు చెప్పటంమరచి పోయాను, ఆ పెద్దమనిషి మహేంద్రుడే. లాహోరునుంచి వస్తూ, కాశీలో ఆగాడు. మళ్ళీ కలకత్తా వెళ్లేందుకు స్టేషన్‌కివచ్చాడు. రైలుకోసం కనిపెట్టుకుని ఉండగా జరిగిందీ సంఘటన. కరుణకి తెలివి వచ్చాక మహేంద్రుడు ఆమె వృత్తాంతమంతా అడిగాడు. మహేంద్రుడి ముఖంలో ఎంతో జాలి వ్యక్తమయింది. దాంతో కరుణకి వెంటనే ధైర్యం వచ్చింది. ఏడుస్తూ తన వృత్తాంతమంతా మహేంద్రుడికి చెప్పింది. చివరికి భవిని అడిగినట్లే మహేంద్రుణ్ణికూడా 'నరేంద్రుడు తన మీద ఎందుకు కోపగించుకున్నాడు?' అని అడిగింది. మహేంద్రుడు ఆ అమాయక ప్రశ్నకి సమాధానం చెప్పలేక పోయాడు. కాని ఈ ప్రశ్న వినేసరికి అతడికళ్లల్లో నీళ్లు తిరిగాయి. నరేంద్రుణ్ణి మహేంద్రుడు బాగా యెరుగు. జరిగినదంతా పూర్తిగా అర్థంచేసుకున్నాడు. పండిత మహాశయుడు తనని అలా ఎందుకు విడిచిపెట్టి వెళ్ళాడో కరుణకి ఎంత ఆలోచించినా బోధపడలేదు. చాలాసేపు ఆలోచించి ఆలోచించి అదికూడా మహేంద్రుణ్ణి అడిగింది. మహేంద్రుడు తానుగ్రహించిన యధార్థమైన కారణాన్ని కప్పిపుచ్చి ఏదో నచ్చచెప్పటానికి ప్రయత్నించాడు. ఇప్పుడు కరుణని ఏమిటిచెయ్యటమా అనే మహేంద్రుడు ఆలోచిస్తున్నాడు. చివరికి తనఇంటికే తీసుకు వెళ్ళటానికి నిర్ణయించుకున్నాడు. మహేంద్రుడు కరుణకి తమ యింటినిగురించి చెప్పాడు. తమ యింటికి ఎదురుగా చుట్టూ ప్రహరీ ఉన్న ఒక తోటఉన్నదని, ఆ తోటలో ఓ చిన్నకొలను ఉన్నదని, దానికి సిమెంటుమెట్లు ఉన్నాయని చెప్పాడు. తమయింటికివస్తే, కోమలహృదయ, స్నేహశీలిని, క్షమామూర్తిని అయిన సోదరి (ఇంకా ఎన్నో విశేషణాలు చేర్చాడు—లోకంలో ఎవరికీ అలాంటి సోదరిలేనట్లు—) లభిస్తుందని చెప్పాడు. కరుణ వెంటనే అక్కడ భవి భోగట్టా ఏమయినా తెలుస్తుందా అని అడిగింది. మహేంద్రుడు భవి సమాచారం వాకబు చెయ్యటానికి ఒప్పుకున్నాడు. కరుణ తనని సోదరునిగా భావించటానికి ఒప్పుకుంటుందోలేదో అని అడిగాడు, కరుణకి దానికేమీ అభ్యంతరంలేదు. ఏమయితే యేం- ఇంతకాలం తర్వాత కరుణ ముఖం ప్రఫుల్లమయింది. ఇన్నాళ్ళకెలా అయితేయేం ఆమెకి ఆశ్రయం లభించింది. కాని పండిత మహాశయుడు తనమీద కోపగించుకోటానికి కారణమేమిటని మాత్రం మాటిమాటికీ అడగటం మొదలెట్టింది.

చివరికి వారు వెళ్లిపోవటానికి ప్రయాణమైనారు. కాశీవదిలిపెట్టి వెళ్ళారు. ఎవరేమంటారో, ఎవరేం చేస్తారో, ఎప్పుడేం జరుగుతుందో ఇవన్నీ ఆలోచించుకుంటూ, ఒకవేళ ఎవరైనా ఏదయినా అంటే సమాధానం ఏమని చెప్పటం, ఎవరైనా ఏమైనా చేస్తే దానికేమిటి ప్రతివిధానం చెయ్యటం, ఎప్పుడైనా ఏమయినా వచ్చిపడితే అప్పుడెలా వ్యవహరించటం, ఇవన్నీ నిర్ణయించుకుంటూ మహేంద్రుడు ఊళ్ళో వీధిలోకి వచ్చాడు. సిగ్గుతో క్రుంగిపోతూ, సంకోచంతో ముడుచుకుపోతూ, దారిపోయే వారి కంట పడకుండా తప్పుకుంటూ వీధిదాటి ఎలాగో తమయింటి

గుమ్మంముందుకు వచ్చాడు. చినబాబుగారిని చూడగానే దాసీది చీపురు అక్కడ వదిలేసి, లోపలికి వెళ్లి అమ్మగారికి కబురు చెప్పింది. అమ్మగారప్పుడు రజని ఎదుట కూర్చుని, ఆమె రూపాల్ని గురించి సూటీపోటిగా మాట్లాడుతోంది. ఈ సమయంలో తన కొడుకు ఇంకొకనూతన వధువును వెంటపెట్టుకొచ్చాడన్నవార్త తెలిసింది. కరుణని—మహేంద్రుణ్ణి అందరూ చూశారు. సంతోషంతో శంఖాలు పూరించబోతే, మహేంద్రుడు వారిని వారించి, కరుణ వృత్తాంతమంతా చెప్పాడు. అది అంతా మహేంద్రుడి తల్లికి అంత నచ్చలేదు. మహేంద్రుడి ఎదుట ఏమీ మాట్లాడలేదు. కాని ఆరోజున రాత్రి మహేంద్రుడి తండ్రితో సంప్రతించి. చివరికి ఈ దౌర్భాగ్యురాలు రజని యే ఈ విపత్తుకంతటికీ కారణమని నిర్ణయించింది. దీని మూలంగా మహేంద్రుడి తండ్రి మరొక రెండణాల పొగాకు ఎక్కువ కాల్చవలసి వచ్చింది. ఇరుగు పొరుగున ఉన్న ఇద్దరు ముగ్గురు వృద్ధులు తలలు పగిలిపోయేట్లు ఆలోచించవలిసి వచ్చింది. అంతకుతప్ప వేరే దుస్సంఘటన మాత్రం ఏమీ జరుగలేదు. రజని తన అక్కగారింటికి వెళ్ళటానికి అన్నిఏర్పాట్లూ చేసుకుంది. ఆమె అత్తగారు, మామగారు ఈ యేర్పాట్లకి కావలసిన సహాయమంతా చేశారు. కాని రజని చాలా దుర్బలంగా ఉన్నదని ఇంకా అక్కడికి వెళ్ళటంమాత్రం జరుగలేదు. ఈ సంగతి మహేంద్రుడు రాగానే తనతల్లి దగ్గిర విన్నాడు. ''అక్కగారింటికి వెడుతుందా?—అంటే ఏమిటి అర్థం?'' నేను రాగానే తన అక్కగారింటికి వెడుతుందా? అన్నాడు ఆశ్చర్యపోతూ. మహేంద్రుడి తల్లికూడా ఆశ్చర్యపోయింది. మహేంద్రుడి తండ్రి కొంచెంసేపు విస్తుపోతూ చూస్తూ ఊరుకున్నాడు—తర్వాత తన సులోచనాలజోడు తగిలించుకుని! ఈ మహేంద్రుడు, వెనుకటి మహేంద్రుడు ఒకడవునా లేక ఇతడు మాయ మహేంద్రుడా అని పరీక్షగా చూశాడు. మహేంద్రుడింక ఏమీమాట్లాడకుండా వెంటనే రజని గదిలోకి వెళ్ళాడు. అతడి తల్లి దండ్రి ఏదో, గుసగుసలాడుకున్నారు. రజని మహేంద్రుని చూసి, చాలా కంగారుపడింది. మహేంద్రుడు తనని చూసి కోపం తెచ్చుకుంటాడో యేమో—'నేను ఇప్పుడే వెళ్లిపోతాను, ప్రయాణమయే ఉన్నాను. అని వెంటనే చెప్పేద్దామా' అనుకుంది. ఈ విచికిత్సలోపడి, ఏం చెయ్యటానికి తోచని పరిస్థితిలో ఉండగా, మహేంద్రుడు మెల్లిగా వచ్చి ఆమెప్రక్కన కూర్చున్నాడు. ఎంత అదృష్టం! ''నువ్వు ఇవాళే మీ అక్కగారింటికి వెళ్లిపోతావుటుగా! ఎందుకని రజనీ?'' అని విచారంతో అడిగాడు. ఇంక సమాధానం చెప్పేందుకు ఏముంది? "నేను నీయెడ చాలా అపరాధాలు చేశాను. నిన్ను కష్టపెట్టాను. కాని వాటినన్నిటినీ క్షమించటానికి వీల్లేదా?'' "ఆదేమిటి మహేంద్ర్! అలా మాట్లాడకు" రజని గుండెలు పగిలిపోతున్నాయి. ''చెప్పు క్షమించటానికి వీల్లేదా?" రజనికి సమాధానం చెప్పగలసత్తా ఉందా? ఆమె వెక్కివెక్కి ఏడ్చింది. మహేంద్రుడామె చేతులు పట్టుకుని, ''క్షమించాననని అను ఒకసారి'' అన్నాడు. అదేమిటి? మహేంద్రుడు క్షమాపణ కోరుతున్నాడేమిటి? తప్పంతా తనదేఅని తెలుసు ఆమెకి. తానే మహేంద్రునియెడ అపరాధం చేసింది. మహేంద్రుడు తన మూలంగా ఎందుకింత కష్టం సహించాడు? ఇల్లువదలిపెట్టి వెళ్లి కొన్ని సంవత్సరాలు విదేశాల్లో గడిపాడు! తాను అతణ్ణి ఎప్పుడు క్షమాపణ కోరుకుందామా అనుకుంటూంటే ఇదేమిటీ వైపరీత్యం! క్షమాపణ కోరుతాడేమిటి? తాను క్షమాపణ కోరటానికి సాహసించలేక పోయింది. తాను క్షమార్హురాలేనా ? అని ఆలోచించ సాగింది రజని. మహేంద్రుడు రజని తలని తన ఒళ్లోకి తీసుకున్నాడు. ఇప్పుడే కనుక చచ్చిపోగలిగితే— ఎంత సుఖవంతమైన చావు అవుతుంది? అనుకున్నది రజని. ఆమెకేమిటో సంకోచం బాధించ సాగింది. మహేంద్రుని ఒడిలో తనకి స్థానం లభించటం, భిక్షువుకి సింహాసనం లభించటం లాంటిదిలా తోచింది.

మహేంద్రుడు ఆమెతో ఏమో మాట్లాడాడు. వాటి అన్నిటికీ సమాధానాలు చెప్పలేక పోయింది. 'ఈ మధురస్వప్నం చిరస్థాయి ఈ క్షణంలో చచ్చిపోతే ఎంత సుఖవంతురాలిని!' అనుకుందామె. కాని ఈ స్థితి ఎంతసేపు ఉంటుంది? రజని సంకోచం త్వరలోనే తొలిగిపోయింది. రజని అతడి ఒళ్లో తలపెట్టుకుని, ఎంతసేపు ఎన్నెన్ని మాట్లాడిందో, ఎన్ని కన్నీళ్ళు కార్చిందో—చెప్పలేం! మహేంద్రుడు ఇహలేచి వెడదామనుకుంటూంటే—రజని అతణ్ణి ఇంకాస్సేపు ఉండమని బ్రతిమాలింది—ఇదివరకు ఎన్నడూ అలా సాహసించి యెరుగదు. రజనిలో ఏమిటీ పరివర్తన? తాను ఎన్నడూ ఆశించని సుఖం.—ఆ సుఖాన్ని పొందటానికి తాను అర్హురాలిని కానని భావించుకునేది. అలాంటి సుఖాన్ని హఠాత్తుగా పొందగలిగింది. ఆనందంతో ఆమె హృదయం విచ్చిపోతోంది. ఏం చెయ్యాలో తోచటంలా ఆమెకి. ఆ సాయంత్రమే ఆమె మోహిని యింటికి వెళ్ళింది. గబగబా వెళ్ళి ఆమె కంఠం కావిలించుకుని ఏడ్చింది. "ఏమిటి రజనీ ? ఏం జరిగింది?" అని అడిగింది మోహిని. మహేంద్రుడు మళ్ళీ ఏమి అన్యాయంగా ప్రవర్తించాడో అనుకున్నదామె. రజని ఆమెకి అన్ని సంగతులూ చెప్పటం మొదలెట్టింది. విని మోహిని కూడా ఆహ్లాదంతో కన్నీళ్లు పెట్టుకుంది. రజనికి ఈ నెలా రెండు నెలల్లో దుర్బలురాలయేట్లుగా చేసిన వ్యాధి ఏమిటో ఇహదాని చిహ్నాలు కూడా కన్పించకుండా పోయాయి. అంతేకాదు. రజని గృహకృత్యాల్లో ఇంత ఉత్సాహంగా ఉండటం ఇదివరకెన్నడూ చూసి యెరుగరు. "'అబ్బో!' చాలు చాల్లే. అంత యింట్లో పనులన్నీ చెయ్యక్కర్లేదులే. రెండు లంఖణాలు చేసి, ఇంకా పథ్యం తీసుకున్నావో లేదో—అప్పుడే ఏమిటా పనులన్నీ చెయ్యబోవడం బడాయీ నువ్వు." అన్నది అత్తగారు. ఇక్కడ ఒక్క విషయం చెప్పటం అవసరం. రజని



లంఖణాలు చేసిన రెండూ రోజులూ ఒక్క పని చేయలేదని చాలా సాధించింది. ముందు ఎప్పుడైనా రజని తప్పు ఏమీ కన్పించనపుడు—ఈ రెణ్ణాళ్ళ సంగతీ తీసుకొచ్చి మళ్ళీ సాధించవచ్చు అని నిశ్చయించుకుంది. ఈ విషయంలో పాఠకుల కేమీ సందేహం అక్కర్లేదు.

చూస్తూ చూస్తూ ఉండగానే కరుణకి—రజనికి బాగా స్నేహం అయింది. ఇద్దరూ గుసగుసలాడుతూ చెప్పుకోవలసిన సంగతులు చాలా ఉన్నాయి. అవి తరగటం అంటూ ఉండదు. తమ భర్తలు తమయందు చూపిన కొద్ది ఆదరం, తమ హృదయాల్లో హత్తుకుపోయింది. దాన్నే మహత్తరమైన సంఘటనగా చెప్పుకునేవారెప్పుడూ. ఈ విషయంలో ఇద్దరి హృదయ భాండారాలూ సామాన్యమైనవే. అయినా ఏం మాట్లాడుకుంటారో అది వారికే తెలియాలి. ఆ సంగతులన్నీ వ్రాస్తే బహూశా పాఠకులు అందులోని గాంభీర్యాన్ని గ్రహించలేక పోవచ్చు. నవ్వుకోవచ్చు. ఇవన్నీ చెప్పుకోతగినవి కాదులే అని అనుకోవచ్చు. కాని ఆ బాలిక లిద్దరూ ఆ సంగతుల్నే ఎంతో సంతృప్తిగా ఎంతో ఇదిగా చెప్పుకుంటారు. వాటిని గురించి ఎవరైనా నవ్వుకుంటారన్నా, తేలికగా త్రోసి పారేస్తారన్నా మనస్సుకి చాలా కష్టంగా ఉంటుంది. కరుణతో రజని దీటుకాలేక పోతోంది. ఆమె ఒక మాటనే పదిమాట్లు చెపుతూ అన్నిటినీ ఒక్క గుక్కలో చెప్పటానికై ప్రయత్నిస్తూ ఉంటుంది. ఏదీ సరిగ్గా అర్థంకాక పోవటంతో రజని ఒకవిధంగా మాట్లాడక ఊరుకోవలసి వస్తూంటుంది. ఆమె సంగతులు చెప్పటమే పూర్తి కాకపోతే ఆమె యింకా రజని సంగతులు కూడా యెక్కడ వింటుంది? ఆమె సంగతులు ఒకటా రెండా? తన పెంపుడు పక్షి సంగతి, భవి సంగతి, తన చెవుల పిల్లి సంగతి—తనకెప్పుడు ఏ ఏ కలలు వచ్చాయో అవీ తన తండ్రి దగ్గిర విన్న ఇద్దరు రాజకుమారుల కథలు అన్నీ చెప్పవలసిందే. ఇహ చెపుతూన్నప్పుడు మధ్య మధ్య నవ్వు కనుక వచ్చిందంటే ఆ నవ్వుని ఆపటం యెవరికి సాధ్యం? అసలు ఆ నవ్వు ఎందుకు వచ్చిందో తెలుసుకోవటం మాత్రం ఎవరికి సాధ్యం? పాపం రజనికి మాత్రం చెప్పుకోవలసిన సంగతులు ఎన్నోలేవు. కాని ఎక్కువ సంగతులు నిశ్శబ్దంగా ఇలా వినేవాళ్లు ఎవరూ ఉండరు. రజని ఏమీ విసుక్కునేది కాదు. నిజమేగాని, అప్పుడప్పుడు పరధ్యానంలో పడుతూ ఉండేది. దానివల్ల కరుణకి వచ్చిన నష్టం ఏముంది? కరుణకి చెప్పటం ముఖ్యం. కరుణని గురించి మహేంద్రుడి తల్లి మహా ఆలోచనలో పడింది. ఆమె వయస్సు తక్కువేమీ కాదు. యాభై అయిదేళ్ళు ఆమెకి. తన యాభై అయిదేళ్ళ జీవితానుభవంలో—గౌరవ కుటుంబంలోని పిల్లలెవరూ ఇంతగా మాట్లాడటం చూసి యెరుగదు. ఆమె ఇరుగు పొరుగు వారు తమ తండ్రుల కాలంనాడు కూడా ఇలాంటి పిల్లని చూసి యెరుగమని, స్పష్టంగా అంగీకరించారు. మహేంద్రుడి తండ్రి చిలుందమ్ములు లాగుతూ, ఈ కాలంలో ఆడపిల్లలు, మగపిల్లలూ కిరస్తాన వాళ్ళయి పోతున్నారని అంటూ ఉండేవాడు. అతడి తల్లి— 'అవును, అది అబద్ధంకాదు', అనేది మహేంద్రుడి తల్లి మధ్య మధ్య రజనిని పిలిచి, కరుణవైపు ఓరకంటితో చూస్తూ "ఇవాళ తోటలో మీ గొంతులు బిగ్గరగా విన్పించాయి, సిగ్గు లేదూ?" అని కూక లేసేది. కాని దానికి కరుణ ఏమీ బెదరలేదు. కాని కరుణ పొడిదుడుకులు లేకుండా ఉన్న స్థితి ఇది. కరుణ హాయిగా తన తండ్రి దగ్గిర ఉన్నప్పుడు—ఈ యాభై అయిదేళ్ళ అనుభవంగల గృహిణి కనుక చూసి ఉన్నట్లయితే ఏం చేసేదో చెప్పలేం. మళ్ళీ వొకొక్కప్పుడు కరుణ మనస్సు దిగులుగా ఉన్నప్పుడు—ఆమె ఆకారమే పూర్తిగా విభిన్నంగా ఉండేది. అప్పుడిహ వొక్కమాట మాట్లాడేది కాదు, నవ్వేది కాదు, పెదవి కదిపేదీ కాదు. ఎక్కడో వొకమూల మెదలకుండా కూర్చునేది. రజని దగ్గిర కూర్చుని, ఎంత బ్రతిమాలినా ఏం చేసినా సమాధానం చెప్పేదికాదు. కరుణ తరచు మధ్య మధ్య ఇలా దిగులు పడుతూండేది. ఎంతోసేపు ఏడ్చి, ఏడ్చి, తర్వాత శాంతించేది వొకరోజున ఇలా "ఏడుస్తూ నరేంద్రుడెక్కడ?" అని మహేంద్రుణ్ణి అడిగింది. "నాకు తెలియదు" అన్నాడు మహేంద్రుడు. "ఎందుకు తెలియదు?" అని అడిగింది కరుణ. ఎందుకు తెలియదో మహేంద్రుడు ఆ సంగతి సరిగ్గా చెప్పలేక పోయాడు. కాని నరేంద్రుణ్ణి వెతకటానికి మాత్రం వొప్పుకున్నాడు. అయితే నరేంద్రుణ్ణి గురించి అంతగా ఏం తెలియలేదు. నరేంద్రుడు ఆమెని గురించి ఎలా తెలుసుకోగలిగాడో! వొక రోజున కరుణ రజనికి ఇద్దరు రాజకుమారుల కథ చెపుతూ హడావిడిగా ఉన్న సమయంలో—పోస్టులో ఆమె పేర వొక ఉత్తరం వచ్చింది. ఇంతవరకు యెప్పుడూ ఆమెకి తన పేర ఉత్తరం రావటం

ఎరుగదు. ఈ ఉత్తరం రాగానే కరుణకి ఎంతో అహ్లాదం కలిగింది. ఉత్తరం రావటం అనేది చాలా గొప్పగ సంగతి అనీ ఏదో రాజాధిరాజులకే అవి వస్తాయని తెలుసు ఆమెకి. మొదట్లో అసలు ఆ కవరు చించటానికి మనస్కరించలేదు ఆమెకి. ముందు చాలా మందికి దాన్ని చూపించి, ఇష్టం లేకుండానే అందులోని ఉత్తరం తీసింది. ఉత్తరం చదివింది. చదువుతూంటే ఆమె ముఖం వాడిపోయింది. కంపించిపోతూ ఆ ఉత్తరాన్ని మహేంద్రుడి చేతికిచ్చింది. 'మూడు వందల రూపాయలు అవసరం నాకు. అవి దొరకకపోతే చాలా ముప్పువచ్చి పడుతుంది. దొరకకపోతే ఆత్మహత్య చేసుకుని చచ్చిపోతాను' అని వ్రాశాడు నరేంద్రుడు. కరుణ ఏడ్చింది "ఏమిటి చెయ్యటం?" అని మహేంద్రుణ్ణి ప్రశ్నించిది." "మరేం దిగులు పడక్కర్లేదు. ఇప్పుడే డబ్బు తీసుకుని వెడుతున్నా"నన్నాడు. నరేంద్రుడి అడ్రసు అందులో రాశాడు. నరేంద్రుణ్ణి ఆ అడ్రస్‌లో వెతకటానికి మహేంద్రుడు బయలు దేరాడు.

## — ౨౩

మహేంద్రు డింటింకి వచ్చినప్పటినుంచి మోహిని సంగతులేమీ తెలియటంలేదు. మహేంద్రుడికి దానికి కారణం ఏమీ కన్పించ లేదు. ఒక రోజున ఏదో అపరాధం చేశాను. అందుకని ఇహ ఇద్దరికీ ఆ జన్మాంతం తెగతెంపులు కావాల్సిందే! మోహినికి తన మీద కోపం వచ్చిందేమో, ఒకవేళ ఆమె తనని ప్రేమించటం లేదేమో అనుకున్నాడు మహేంద్రుడు. మహేంద్రు డిప్పటికీ ఇంకా మోహినిని ప్రేమిస్తున్నాడంటే పాఠకులు బహూశా సంతుష్టులు కారేమో! కాని ఆ ప్రేమించటానికి మహేంద్రుడు చెప్పే ఉపపత్తులు వింటే—ఎవరూ ఇంక ఏమి మాట్లాట్టానికీ వీలుండదు. మనిషిని ప్రేమించటంలో తప్పేమిటి? అంటా డతడు. నేను మోహినిని మరొక విధంగా ప్రేమించలేను. నేనామెని సోదరిలాగా, మిత్రురాలిలాగా ప్రేమించాను. అంతకంటె ఎక్కువగా ఎన్నడూ ప్రేమించలేదు నేనామెని-అంటాడు. ఈ విషయాన్ని మాటిమాటికీ ఇంత నొక్కి చెప్పటాన్ని బట్టే తెలుస్తుంది. అంతకంటె కూడా ఎక్కువగా ప్రేమించాడని. అతడు తన మనస్సును భ్రాంతిలో పెట్టుకోటానికి ప్రయత్నిస్తుంటాడు. అందుకనే, ఈ మాటని అత డంత నొక్కినొక్కి చెపుతూంటాడు. ఈ మాటని ఎలాగైనా తన మనసుచేత నమ్మించటానికి ప్రయత్నిస్తుంటాడు. అతడి మనస్సు అప్పుడప్పుడు కొంచెం విశ్వసించేది కూడా. తన సోదరిలాగా, స్నేహితురాలిలాగా మోహిని తమ యింటికి వచ్చిపోతూంటే తప్పేముంది? అంటా డతడు. అసలు రాకుండా ఉండటమే తప్పు. ఏం? మోహిని అందర్ని వచ్చి కలుసుకుంటూ ఉంటుంది. నన్నొక్కణ్ణి మాత్రమే కలుసుకోదు ఎందుకని? నిజంగానే మా యిద్దరి మధ్య ఏదో సమాజ విరుద్ధమయిన ప్రేమ వుండి ఉండాలి. కాని అదికాదు. అదికాదు అది ఉండడం అసంభవం. నేను రజనిని ప్రేమ భావంతోనే ప్రేమిస్తున్నాను. అందరికంటె ఎక్కువ ప్రేమిస్తున్నా. నేను మోహినిని కేవలం సోదరిలాగా ప్రేమిస్తున్నా—మహేంద్రుడి మనస్సుని ఈ ఆలోచనలన్ని చీకాకు పరుస్తున్నాయి. అంతటితో పోనీయలా. తన ఉపపత్తులన్ని రజనికి కూడా స్పష్టపరిచాడు. రజని అర్థం చేసుకోవటంలో ఇబ్బందేమీ రాలేదు. ఆమె సరీగ్గానే అర్థం చేసుకుంది. ఆమె స్వయంగా వెళ్లి మోహినికి స్పష్టపరిచింది. మోహిని వాటికి పెద్దగా సమాధానం ఏమీ చెప్పలేదు. 'అందరి మనస్సుల సంగతి నాకు తెలియదు. కాని నా మనస్సు మీద నాకే విశ్వాసం లేదు' అనుకున్నది తనలో తాను. మోహిని ఇంక ఇక్కడ ఉండటం శ్రేయస్కరం కాదనుకుంది. కాశీ వెళ్లటానికి కావలసిన ఏర్పాట్లన్నీ చేసుకుంది. ఇంట్లో వాళ్లు దానికి అయిష్టాన్ని వ్యక్తం చెయ్యలేదు.

మోహిని కాశీ వెళ్లేముందు కరుణ—రజనీలను ఒకసారి చూసింది. "నువ్వు కాశీ వెడుతున్నావు మా పండిత మహాశయుణ్ణి కలుసుకోవటం తటస్థిస్తే నేను ఖులాసాగానే ఉన్నానని చెప్పు" అన్నది కరుణ. పండిత మహాశయుడు తన యోగ క్షేమాలు తెలుసుకోవటానికి తహతహలాడుతూ ఉంటాడనుకుంది. కరుణ ఊహించింది ఒట్టిది కాదు. నిధి బలవంతం మూలంగా పండితమహాశయుడు రైలు ఎక్కి ఎంతో పశ్చాత్తాప పడ్డాడు. రైలుబండిని ఆపించమని బ్రతిమాలటం మొదలెట్టాడు. కాని 'రైలుబండివాడు' ఈ బ్రాహ్మడి ప్రార్థనని మన్నించక పోవటంతో మెదలకుండా ఊరుకున్నాడు పండితమహాశయుడు. కాని మాటిమాటికి నిధితో మాత్రం 'మంచిపని కాదు చేసింది' అని అంటూనే ఉన్నాడు. నాలుగయిదు సార్లు ఇలా అనేసరికి నిధికి కోపం వచ్చి గట్టిగా గదమాయించా డతణ్ణి పండితమహాశయుడు. నిధితో ఇంకేమనటానికి సాహసించలేక పోయాడు. కాని రైలుపెట్టెలో ఓ మూల కూర్చుని. ఒక డబ్బా నస్యం ఖాళీచేసి ఉత్తరీయం ఒకవైపు అంతా కన్నీళ్లతో తడుపు కున్నాడు. కేవలం రైల్లోనే కాదు—ఎక్కడికి వెడితే అక్కడలా నిధిని మాటిమాటికి ఈ మాటతో విసిగించ సాగాడు. మళ్లీ కాశీకి తిరిగి వచ్చాక కరుణ కనిపించక పోయేసరికి పండితమహాశయుడికి ఎక్కడ లేని విచారం—పశ్చాత్తాపం పట్టుకున్నాయి. అతడు ఈ విషయాన్ని పురస్కరించుకుని, నిధిని ఎంత విసిగించా డంటే చివర కతడిది భరించలేక కలకత్తా తిరిగి వెళ్ళిపోవటానికి కూడా ప్రయాణ మవుతున్నాడు.

"మీ పండితమహాశయుణ్ణి నేను యెరుగను. అతణ్ణి కలుసుకోవటం తటస్థిస్తే చెపుతాను" అన్నది మోహిని. పండితమహాశయుణ్ణి ఎరుగను అనేసరికి కరుణ తెల్లబోయింది. అతణ్ణి ఎరుగని వాళ్లు ఎవరూ ఉండరని కరుణ కేమిటో ఓ గాఢమైన నమ్మకం.

ఆమె తాను ఏ పండితమహాశయుణ్ణి గురించి చెపుతున్నదీ మోహినికి కరుణ మరింత స్పష్టంగా చెప్పింది. కాని అప్పటికీ మోహిని అతణ్ణి ఎరుగనని అనేసరికి కరుణ నిస్పృహ చెందింది. నిలువునా క్రుంగిపోయింది. మోహిని కళ్లనీళ్ళు పెట్టుకుని. రజని దగ్గిర సెలవు తీసుకుని, కాశీ వెళ్ళిపోయింది........

## —౨౪

వర్షాకాలం. రెండు మూడు రోజులనుంచి మబ్బుగానే వుంది పైన. సాయంత్రమయింది కలకత్తాలో వీధులనిండా ఎక్కడ చూసినా గొడుగులే. వీధిన నడిచే జనంమీద బురదనీళ్లని చింద కొడుతూ పరుగెడుతున్నాయి బళ్లూ అవీ....

మహేంద్రుడు నరేంద్రుని వెతకటానికి బయలుదేరాడు. మెయిన్‌రోడ్డు మీద బండిని ఆపి, ఇరుకుగా చీకటిగావున్న సందు లోకి వెళ్లాడు. రెండు పూరిళ్ళు సగం సగం పడిపోయివున్నాయి. ఇద్దరు ప్రౌఢ స్త్రీలు చాలాసేపటినుంచి తగాదాపడుతూ చివరికి జుట్టుజుట్టు పట్టుకునే స్థితికి వచ్చారు. పగిలిపోయిన కుండ పెంకులు, మామిడి టెంకలు, పాసిపోయిన అన్నం మెతుకులు, ఇళ్ళు తుడిచిన కసవు సందునిండా కుప్పలు కుప్పలుగా ఉన్నాయి.

మురికివాసన కొడుతున్న ఓ గుంటలో బళ్లలాగేవాళ్ళ పెళ్లాలు ఇద్దరు ముగ్గురు గుడ్డవేసి బురదచేపల్ని పట్టుకుంటున్నారు. ఎదురు దెబ్బలు తగిలి, బురదలోకి, లేదా మురికినీళ్ళలోకి జారుతూ, కాలి జోళ్ళు వదిలి, ప్యాంట్ పైకి మడుచుకుందామా అనుకుంటా — రెండు మూడు కుక్కలు వెంటబడి మొరుగుతూంటే మహేంద్రుడు పడిపోవటానికి సిద్ధంగావున్న ఓ మట్టి ఇంటి గుమ్మంలోకి వచ్చి తలుపుకొట్టాడు. ఊడిపోవటానికి సిద్ధంగావున్న తలుపులు దీర్ఘ రోగంతో బాధపడే రోగిలా మూలుగుతూ తెరుచుకున్నాయి. నరేంద్రు డింట్లోనే ఉన్నాడు. కాని కొన్నేళ్ళనుంచి ఆ యింటికి ఎప్పుడైనా వస్తే పోలీసులు తప్ప, అతిథు లెవరూ వచ్చి యెరుగరు. అంచేత తలుపులు తెరుచుకున్న ధ్వని వినిపించగానే నరేంద్రుడు అంతర్ధాన మయినాడు. తలుపులు తెరుచుకోగానే మహేంద్రుడు దుర్వాసనలో పెంటపోగుతో నిండిన ఒక ఆవరణలో అడుగు పెట్టాడు. ఆ ప్రాంగణంలో ఓ ప్రక్క ఓ నుయ్యి ఉంది. ఆ నూతి ప్రక్కన చిన్న చిన్న మామిడి మొక్కలు మొలిచాయి. ఆ నూతి మీదికి ఒక జామచెట్టు వాలివుంది. ప్రాంగణం దాటి మహేంద్రుడు ఇంట్లోకి వెళ్లాడు. ఇంత నేలబారుగా, ఇంత చిత్తడిగా ఉండే ఇల్లు మహేంద్రు డెన్నడూచూసి యెరుగడు. ఇంట్లోంచి ఏదో ఒక విధమైన దుర్గంధం వస్తోంది. వానజల్లు కొట్టకుండా ఉండ టానికి తలుపులు ఊడిపోయిన కిటికీకి వెదురుతడిక ముక్క ఒకటికి అడ్డంపెట్టి ఉంది. ఆ యింటికి ఒకానొక కాలంలో సున్నం ఉండేదని అనుకోవాలి. అంతే. ఒకచోట గోడకంతలో పుగాకు కాస్త కుక్కివుంది. ఇంట్లో నమ్మటానికి వీల్లేని బల్ల ఒకటి వుంది. (దానికి కనుక ప్రాణం వుంటే — దానిని వుపయోగించుకున్నందుకు పశుహింసా నివారిణి సభలో చాలా జరిమానా చెల్లించుకోక తప్పదు) దానిమీద మురికి ఓడుతున్న ఒక జంపఖానా — అలాంటిదే ఒక తలగడా — వాటిపైన ఉపయోగించని దోమతెర ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లగానే మహేంద్రుడి కొక దాసీది కనిపించింది. ఆ దాసీ అతణ్ణి చూడగానే కొంచెం నవ్వి, మందలింపు ధోరణిలో "ఏం బాబూ! మీది మీదికి వస్తేగాని వీల్లేదా యేం?" అన్నది. మహేంద్రుడు ఆమెకి రెండు మూరల దూరంలో ఉన్నాడు. కంపు కొడుతున్న ఆమె కట్టుకున్న గుడ్డలు, భయంకరమైన ముఖాన్ని చూసి, ఇంకొక రెండడుగులు వెనక్కి వెళ్లాలని అనుకున్నాడు. కాని మహేంద్రుడు తన దగ్గిరకి రావాలనే వచ్చాడు అని ఊహించు కుని ఆ దాసీ లోపల్లోపల చాలా సంతృప్తి చెందింది. ఏమయితేనే ఈదాసీ వెళ్లి, భయపడి దాక్కున్న నరేంద్రుడి కెలాగో ధైర్యం చెప్పి తీసుకొచ్చింది. నరేంద్రుడు మహేంద్రుణ్ణి చూసి ఏమీ ఆశ్చర్యపోలేదు. ఏదో అతడి కోసమే ఎదురు చూస్తున్నట్లు. కాని, మహేంద్రుడు మాత్రం నరేంద్రుణ్ణి చూసి ఉలిక్కిపడ్డాడు. ఇంత పరివర్తన ఇంకెవరిలోనూ ఉండదు. ఒంటిమీద చొక్కాలేదు. చిరిగిపోయిన పంచె ఒకటి సీలమండలపైకి కట్టుకుని ఉన్నాడు. ముఖం చాలా వికృతంగా తయారయింది. కళ్లు గుంటలుపడి కాంతిహీనంగా ఉన్నాయి. జుట్టు పీచురేగి ఉంది. చెయ్యి వణుకుతూ వుంది. ఇహ రంగు ఆశ్చర్యపోయేటంతగా మారి పోయింది. అతణ్ణిచూస్తేనే ఒక విధమైన సంకోచం, అసహ్యం కలుగుతాయి. నరేంద్రుడు ఏమాత్రం తొణక్కుండా, మహేం ద్రుణ్ణి, అతడి ఆత్మీయుల యోగ క్షేమాలన్నీ అడిగాడు. అతడి పనీ, పాటలు ఎలా ఉన్నదీ — అదికూడా అడిగి తెలుసుకున్నాడు. మహేంద్రుడు నరేంద్రుడింత అణగిఉండటం చూసి తెల్లబోయాడు. మహేంద్రుణ్ణి చూసి నరేంద్రుడు ఏమీ సిగ్గుపడనూలేదు, సంకోచ పడనూలేదు. మహేంద్రు డింకేమీ మాట్లాడకుండా నరేంద్రుడు వ్రాసిన ఉత్తరాన్నే తీసి అతడి చేతికిచ్చాడు. అతడేమీ చలించ కుండా "అవునండీ! ఇప్పుడు పరిస్థితులు బాగుండక పోవటం వల్ల కొంత అప్పు అయింది. అంచేత చాలా చిక్కుల్లో పడ్డాను" అన్నాడు. "అవునుకాని మరి మీ భార్యని సహాయం కోరటంలో అర్థం ఏమిటి? సంపాదన భారమంతా మీ చేతిలోది కదా! ఆమెకి ఎక్కడినుంచి వస్తుంది డబ్బు?" అని అడిగాడు మహేంద్రుడు. 'అదేంమాట. ఆమె ఈ మధ్య బాగా సంపాయిస్తున్నట్లు తెలుసు కున్నాను నేను. కొన్నాళ్ళు స్వరూప్‌బాబు ఆమెని చేరతీశాడు. ప్రస్తుతం ఎవరో ఇంకొక బాబు ఆశ్రయంలో ఉన్నట్లు విన్నాను" అన్నాడు సిగ్గు—శరం లేని నరేంద్రుడు. మహేంద్రుడు దీనికి చెడు అర్థం తీసుకోకుండానే, కొంచెం గట్టిగా "ఆమె ప్రస్తుతం మా

ఇంట్లోనే ఉన్నదని తెలుసుగా మీకు!" అన్నాడు. "మీ యింట్లోనా! అది మంచిదేగా!" అన్నాడు నరేంద్రుడు. "కాని ఆమె దగ్గిర డబ్బు ఉండటానికి అవకాశం ఏమీ లేదు" అన్నాడు మహేంద్రుడు. "అలా అయితే నా ఉత్తరానికి ఆమాటే సమాధానం వ్రాస్తే సరిపోయేదిగా?" అన్నాడు నరేంద్రుడు. మహేంద్రుడు చాలా మంచివాడు. అంచేత అట్టే గొడవ పెంచుకోవటం అతడి కిష్టం ఉండదు. వాదన పెంచుకుంటే దాని కిహ అంతమంటూ ఉండదని గ్రహించి. ప్రస్తావన మార్చాడు. నరేంద్రుడు తన దురభ్యాసాలు వదిలిపెడితే తాను సాయం చేస్తానన్నాడు. నరేంద్రుడికి ఆకాశంలోంచి పడ్డట్లయింది. "దురభ్యాసా లేమిటి మహాశయా? కొత్త దురభ్యాసాలేమీ కాలేదు నాకు, నాకున్న అభ్యాసాలేమిటో అవి అందరికీ తెలిసినవే" అన్నాడు నరేంద్రుడు. ఈ మాటలకు సజ్జనుడైన మహేంద్రుడు సరియైన సమాధానం ఏమీ చెప్పలేకపోయాడు. నరేంద్రుడి కిదివరకు ఎప్పుడూ ఇంత మాట్లాడటం చేతకాదు. ముఖ్యంగా మహేంద్రుడి ఎదుట — ఏదో కొంచెం సంకోచించేవాడు. ఇప్పుడు చూస్తే అతడు ఏదైనాసరే ఖండితంగా మాట్లాడటం నేర్చుకున్నట్లున్నాడు. అతడి స్వభావం ఆశ్చర్యకరంగా మారిపోయింది. మహేంద్రుడు త్వరత్వరగా అతడి సంగతి తేల్చుకుని డబ్బు ఇచ్చాడు. ఇహ ముందెప్పుడూ భార్యకి బెదిరిస్తూ ఉత్తరాలేమీ వ్రాయవద్దని చెప్పాడు నరేంద్రుడికి. మహేంద్రుడు చిత్తడిగావున్న ఆ కొంపలోంచి బయటపడి బ్రతికిపోయాడు. దార్లో ఒక మందులషాపులో క్వినైన్ సీసా ఒకటి కొనుక్కొని వెళ్లాలింటికి — అని నిర్ణయించుకున్నాడు. గుమ్మం దగ్గిర దాసీది కూర్చుని వుంది. ఆమె మహేంద్రునిచూసి, ఒకటి రెండుసార్లు తియ్యగా నవ్వి, ఓరచూపులు గుప్పించింది. ఆ ఓరచూపుల ప్రభావంతో మహేంద్రు డింటికి వెళ్లాక చంద్రకిరణాలకి, మలయ పవనానికి ఆహుతికాక తప్పదని భావించుకున్నాడు మనస్సులో....

— ౨౫

ఇప్పుడు రజని పక్కా గృహిణి అయింది. ఇప్పు డామె చేతికి డబ్బు బాగా వస్తోంది. ఇరుగు పొరుగున వుండే చాలామంది వృద్ధలూ, ప్రౌఢలూ అయిన గృహిణులు ఆమె అత్తగారితోటి సంపర్కాన్ని వదులుకుని, కొమ్ములు తీసేసుకుని రజని వర్గంలో చేరారు. వారు రజని దగ్గిర గంటల తరబడి లోకుల్ని అందర్నీ తిట్టిపోసి, లేచి వెళ్లబోతూ ఆవులించి, మళ్ళీ ఏదో విన్నవిస్తున్న ధోరణిలో తమకు అవసరమైన డబ్బు — ఒకటిరెండు బదులు తీసుకుంటారు. రజని భర్తని, రజని ఉత్తమ వంశాన్ని, కళ్లనీళ్లు తెచ్చిపెట్టుకుని చనిపోయిన లక్ష్మీదేవిలాంటి రజని తల్లిని ప్రశంసిస్తూ — ఆమె మళ్లీ బాకీ వెంటనే అడక్కుండా వుండే ఏర్పాట్లన్నీ చేసుకుని వెడుతుంటారు. కాని ఈ వయసు మళ్లిన స్త్రీలలో కరుణకి వున్న అపనింద మాత్రం పోలేదు. ఎలా పోతుంది? వొకరు సంతోషకరమైన ఉపోద్ఘాతం మొదలెట్టి, రజని దగ్గిర వచ్చిన పని బయటపెట్టబోయేముందు — సాధారణంగా కరుణ ఎక్కడినుంచో గబగబా వచ్చి, రజనిని తీసుకుని తోటలోకి వెళ్ళిపోతూంటుంది. అప్పు డప్పుడు వారు కరుణ ప్రవర్తనచూసి, "ఏమిటి నీ తత్వం?" అని అడుగుతూంటారు. కరుణ తాను ఎలాంటి దయిందీ వారికి స్పష్టపరచటాని కెప్పుడూ ప్రయత్నించేది కాదు. వొకొక వృద్ధురాలు మాట్లాడే మాటలుకాని, తీరుకాని, ముఖ కవళికకాని చూస్తూంటే ఆమెకి నవ్వు వచ్చేది. కాని ఆ నవ్వుని అణచుకోవలసి వచ్చేది. ఆమె రజని కంఠాన్ని కావలించుకుని. త్రుళ్లి త్రుళ్లి నవ్వేది. రజని అదిచూసి కంగారుపడేది. అదీకాక ఆమె రజని గృహిణీత్వం చూసి వొకొక్కప్పుడు నవ్వకుండా వుండలేకపోయేది.

మహేంద్రుడు కొన్నాళ్ళనుంచీ గమనిస్తున్నాడు. ఇల్లంతా ప్రశాంతంగా ఉన్నట్లుంటోంది. కరుణ ఆమోద అహ్లాదాలు చల్లారాయి. కాని ఈ శాంతత వాంఛనీయం కాదు. నవ్వుతూ కేరింతలుకొడుతూ ఇల్లంతా కల్లోలంచేసే బాలిక — ఒకరోజు ఇంటిని నిశ్శబ్దంగా ఉంచిందంటే ఇల్లంతా బావురు మంటున్నట్లుంటుంది. ఏదో ఒక వెలితి కన్పిస్తుంది. కొన్నాళ్ళనుంచి కరుణ చాలా దిగులుగా ఉంటుంది. మెదలకుండా ఎక్కడో ఓ మూల కూర్చుని ఉంటుంది — ఏడుస్తుంది. ఎంత ఓదార్చినా మానదు. కరుణ ఇలా విచారంగా ఉన్నప్పుడు రజనికి చాలా కష్టంవేస్తుంది. ఆమె కీమె నవ్వులూ కేరింతలూ చూడకపోతే. ఇహ రోజంతా ఒక్క పని కూడాసాగదు. నరేంద్రుడింటికి వెడతానంటూ కరుణ మహేంద్రుడి దగ్గిర పట్టుపట్టుకు కూర్చుంది. "అతడు చాలా దూరాన ఉన్నాడు" అని చెప్పాడు మహేంద్రుడు. "అయితే అయింది" అన్నది కరుణ. 'ఆ యింట్లో ఉండటానికి చోటులేదు.' అన్నాడు మహేంద్రుడు. ''లేకపోతే పోయింది'' అన్నది కరుణ. ఎన్ని అభ్యంతరాలు చెప్పినా ఆమె ఇలాగే సమాధానం చెప్పటంచూసి, నరేంద్రుణ్ణి ఎక్కడైనా మంచి యింట్లోకి తీసుకువచ్చిపెట్టి, కరుణని అక్కడికి తీసుకెళ్లాలని ఆలోచించాడు మహేంద్రుడు. నరేంద్రుడి కోసమని వెళ్లాడు. ఇంటి అద్దె యివ్వలేకనో — మహేంద్రుడికి తన యింటి అడ్రస్ తెలిసిందనో ఏమో — నరేంద్రు డా యింట్లోంచి వెళ్ళిపోయాడు. మహేంద్రు డతడి కోసం వృధా ప్రయాసపడ్డాడు. అతడు కనిపించ లేదు. ఈ వార్త విన్నప్పట్నుంచీ కరుణ ముఖంలో నవ్వు మాయమయింది. ఓ ప్రత్యేక సమయంలో హఠాత్తుగా ఓ ప్రత్యేకమైన వార్త వింటే హృదయానికి ఎంత అఘాత మవుతుందో అలాంటి అఘాతమే తగిలింది కరుణకి. ఏమిటి? కరుణ ఓర్మి ఇన్నాళ్లకీ ఇంకా తగ్గిపోలేదా? నరేంద్రుడు

కరుణయెడ ఎంత దుర్మార్గంగా ప్రవర్తించాడు? అలాంటప్పుడు అత డెక్కడికో వెళ్లా డిప్పుడు, అని తెలియగానే అంత అఘాత మయిందా కరుణకి? ఎవరికి తెలుసూ కరుణకి పెద్ద అఘాత వేం—బహుశా క్రమంగా వచ్చిపడిన కష్టాల కన్నిటికీ తట్టుకోలేక ఆమె హృదయం దుర్బలమైపోయి వుంటుంది. అంచేత ఎంత సామాన్యమైన అఘాతాన్నయినా తట్టుకోలేని స్థితికి వచ్చింది. నరేంద్ర డీసారి కన్పిస్తాడని పాపం కరుణ చాలా ఆశపడింది. అది నిరాశగా పరిణమించడంతో ఇహ ప్రపంచంలో అన్నిటిమీదా నిస్పృహ జనించింది. ఈ నిరాశా నిస్పృహల మూలంగా తన కింక జీవితంలో సుఖమనేది లేదన్న విశ్వాసం ఏర్పడింది. కరుణ మనస్సు చాలా క్రుంగిపోయింది. కరుణలాంటి యువతికి రాకూడని ఆలోచన—చచ్చిపోదామనే తలంపుకూడా కలిగింది. ఈ ప్రపంచంలో తాను చాలా అశక్తురాలిని, దుర్బలురాలిని అయి పోయానని, ఇంక కోలుకోలేనని, ఈ స్థితిలో చావుకంటె హాయి అయినది ఇంకేమీ లేదని తోచసాగిందామెకి. ఇప్పు డామె దగ్గిరికి వాళ్లూ వీళ్ళూ అందరూ రావటం ఆమెకి కష్టంగా వుంటోంది. నన్నిలా ఒంటరిగా ఓ మూలపడి వుండనీయండి, అని అను కుంటూ వుంటుంది. ఆమె అందరు వేసే ప్రశ్నలకి సమాధానాలు చెప్పలేకుండా వుంది. ఆమెకి ప్రతి విషయంలోనూ ఒక విధ మైన విరక్తి, ఉదాసీనత ఏర్పడ్డాయి. రజని పాపం ఏడ్చి ఏడ్చి, ఆమెని ఎన్నో విధాల ఓదార్చటానికి ప్రయత్నించింది. కాని ఈ పెల్లగించబడినవి శాశ్వతంగా ఎండిపోయినట్లే వర్షపు బిందువులు పడినాసరే. వసంత వాయువులు వీచినాసరే అది ఇంక చిగర్చలేదు.

కాని మళ్ళీ ఈవార్త ఏమిటి? మహేంద్రుడికి నరేంద్రుడి ఆచూకీ తెలిసినట్లు, తెలిసింది. మహేంద్రుడు కరుణా నరేంద్రుల కోసం మంచి యిల్లొకటి అద్దెకి తీసుకున్నాడు. మహేంద్రుడి ఖర్చుతో ఆ యింట్లో ఉండటానికి నరేంద్రుడు సుళువుగానే ఒప్పు కున్నాడు. కాని ఒకసారి మనస్సు విరిగిపోతే, మళ్లీ అది యథా స్థితికి రావటం చాలా కష్టం. కరుణకు ఈ సంగతి అంతా తెలిసింది. అయినా క్రుంగిపోయిన ఆమె మనస్సుకి అంత ఉత్సాహం కలుగ లేదు. కరుణ మహేంద్రునింటినుంచి సెలవు తీసుకుంది. వెళ్ళే రోజున రజని, కరుణ కంఠాన్ని కావిలించుకొని, ఎంతోఏడ్చింది. కరుణవెళ్ళిపోయాక ఇల్లంతా ఏమిటో చిన్నబోయిన ట్లయింది. కరుణ ఆ వెళ్లటం, ఇంక మళ్ళీ తిరిగిరాలేదు. అప్పటినుంచి ఇంక మళ్ళీ ఆ యింట్లో కరుణ తియ్యని నవ్వుల ధ్వని ఒక్కరోజ యినా వినిపించలేదు....

## —౧౬—

అస్వస్థతగా ఉన్న స్థితిలో కరుణ నరేంద్రుడి దగ్గరకు వచ్చింది. మహేంద్రుడు మధ్యమధ్య కరుణని చూసిపోవటానికి వస్తూఉండేవాడు. కరుణ ఒక్కొక్కప్పుడు కొంచెం కులాసాగా ఒక్కొక్కప్పుడు కదలలేని స్థితిలో ఉండేది. ఇలా రోజులు గడిచి పోతున్నాయి. నరేంద్రుడు లోపల్లోపల కరుణని చాలా అస హ్యించుకునేవాడు. కాని మహేంద్రుడికిభయంతో ఇంతవరకింకా ఆమె యెడ దురుసుగా ప్రవర్తించటం మొదలెట్టలేదు. కాని నరేం ద్రుడు సాధారణంగా యెప్పుడూ ఇంట్లో ఉండడు. ఒకటిరెండు రోజులు ఎక్కడోగడిపి, చివరికి ఏ స్థితిలో ఇంటికి తిరిగివస్తా వుంటాడో, ఆ స్థితిలో కరుణదగ్గిరికి రాకుండా వుండటమే మంచిది. అతడు ఇంట్లో లేనప్పుడు జబ్బుగా ఉంటున్న కరుణని కనిపెట్టుకుని వుండేవారెవరూ లేరు, ఇంట్లో. ఆ దాసీది మాత్రం మధ్యమధ్య వచ్చి, ''నీకేం జబ్బో ఏమోఒక్కనాటికి తగ్గటమంటూ లేదు. వెధవ బాధ'' అంటూ విసుక్కుంటూ వుండేది.

నరేంద్రుడిమీద ఆ దాసీకి చాలా ఆధిపత్యం వుంది. నరేం ద్రుడు అప్పుడప్పుడు ఇంట్లోంచి ఎక్కడికో వెళ్లి పోయేటప్పుడు ఆమెకి కలిగేంత ఈర్ష్య ఎవరికీ కలిగేది కాదు. అంతేకాదు, నరేంద్రుడింటికి వచ్చినప్పుడు అతణ్ణి మధ్యమధ్య చీపురుతీసుకుని వుతకటంలో వెనక్కి తగ్గేదికాదు. మళ్ళీ నరేంద్రుడంటే ఆమెకి ఒక్కొక్కప్పుడు ఎంత అభిమానమో ఎవరికి తెలుసు? కరుణ మీద ఆమెకి ఎంతో ఆక్రోశం; చిన్నచిన్న విషయాల్ని పట్టుకుని కరుణని మహా వేధిస్తూ వుండేది. ఒక్కొక్కప్పుడు నరేంద్రుడికీ ఆమెకీ పెద్దతగాదా వస్తూవుండేది. అప్పుడిద్దరూ ఒకర్నొకరు తిట్టు కుని. చేతికందినవి తీసుకుని కొట్టుకుని, కురుక్షేత్రం చేసేస్తూ వుండేవాళ్ళు కొంపని. తన దుర్దినాల్లో ఆమె సహాయంతో రోజులు వెళ్ళపుచ్చాడు నరేంద్రుడు అని. చెప్పుకుంటూ వుంటారు లోకులు.

నరేంద్రుడి ప్రవర్తన క్రమక్రమంగా జోరు అయింది. అతడప్పుడప్పుడు చిత్తుగా త్రాగివచ్చి—ఆ దాసీతో పోట్లాడుతూ ఉండేవాడు. కరుణ అదంతా చూస్తూనే ఉండేది. కాని ఆమె కిప్పుడు ఒక రకమైన మనస్తత్వం ఏర్పడింది. ఏది ఎలా జరిగినా సరే, ఏది ఏమయి పోయినా సరే—అనుకుంటూ ఉంటుంది. దాసీ అప్పుడప్పుడు నరేంద్రుడి మీద కోపం తెచ్చు కుని, కరుణ దగ్గరికి వచ్చి—ఆడిపోసుకునేది. కరుణ మెదలకుండా ఊరుకునేది. ఒక్క మాటకూడా మాట్లాడేదికాదు. నరేంద్రుడు అవసర మొచ్చినప్పుడల్లా ఇంట్లో సామానులు ఒక్కొక్కటే అమ్మటం మొదలెట్టాడు. చివరికి దానివల్ల చిక్కులు తీరలేదు. డబ్బుకి ఇబ్బందిగా ఉంది పంపమని మహేంద్రుడికి ఉత్తరం వ్రాయమని కరుణని పీడించటం మొదలెట్టాడు. పాపం, కరుణ ఎలాగయినా కాస్త నిశ్చింతగా ఉందామనుకునేది. అతడిష్టం, అతడెలాగైనా ఉండనియ్. తనని ఒంటరిగా ఉండనిస్తే చాలునను కునేది. అహం. ఆమెని గురించేకదా ఈ హంగామా అంతా!... ఏం చేస్తుంది ఆమె? మధ్య మధ్య వ్రాస్తూ ఉండేది ఉత్తరాలు

కాని చీటికి మాటికి అలా రాయటం ఏం బావుంటుంది? మహేంద్రుడి దగ్గిర నుంచి మాటిమాటికీ డబ్బు తెప్పించుకోవటం ఆమెకి కష్టంగా ఉండేది. అదీకాక డబ్బు చేతికి వచ్చిందంటే చాలు నరేంద్రుడు దుర్వ్యయం చేస్తాడని తెలుసు ఆమెకి.

ఒక రోజున సాయంత్రం నరేంద్రుడు వచ్చి మహేంద్రుడికి ఉత్తరం వ్రాయమని కరుణని పీడించటం మొదలెట్టాడు. "మీ కాళ్ళు పట్టుకుంటాను. నన్ను మాత్రం ఇంక ఉత్తరాలు వ్రాయమని నిర్బంధించకండి" అని ఏడ్చింది కరుణ. ఆ సమయంలో ఆ దాసీ వచ్చింది. ఆమె కూడా నరేంద్రుడికి వొత్తాసు అయింది. "ఏమిటీ అంత పట్టుదల మనిషివి మరీ నువ్వు? డబ్బు లేకపోతే మింగటానికి ఎలా వస్తుంది పూట పూటా?" అన్నదామె. "వ్రాస్తావా వ్రాయనా?" అని నరేంద్రుడు మండిపడ్డాడు. కరుణ నరేంద్రుడి కాళ్ళు పట్టుకుని "క్షమించండి. నేను వ్రాయలేను" అన్నది. "వ్రాయవూ? దౌర్భాగ్యురాలా వ్రాయవూ?" అంటూ నరేంద్రుడు కోపంతో ముఖం కందలు చిందుకుని, కరుణని చావకొట్ట సాగాడు. ఈ సమయంలో హఠాత్తుగా తలుపు త్రోసుకుని పండిత మహాశయుడు వచ్చాడు. అతడు గబగబా వెళ్లి నరేంద్రుణ్ణి విడిపించాడు. ఇటుచూస్తే దుర్బలురాలైన కరుణ మూర్ఛపోయి ఉంది.

## ౧౨

పండితమహాశయుడు నిధి బలవంతం మూలంగా బండి ఎక్కాడని యిదివరకే చెప్పాను. అతడి మనస్సు మాత్రం ఏమీ బాగా లేదు. స్నేహ శీలియైన కరుణ గతి ఏమయిందో అని అతడి కెప్పుడూ జ్ఞాపకం వస్తూనే వుండేది. ఇలా పశ్చాత్తాపంతో బాధ పడుతూండగా దైవాత్తు మోహినిని కలుసుకోవటం తటస్థించిం దతడికి. ఆమెవద్ద కరుణ గాథ అంతా విని, ఇంక అక్కడ వుండలేకపోయాడు. వెంటనే బయలుదేరి కలకత్తా వచ్చేశాడు. ముందు మహేంద్రుడి దగ్గిరకి వెళ్లాడు. అక్కడ నరేంద్రుడి ఇల్లు ఎక్కడో తెలుసు కున్నాడు. నరేంద్రుడి ఇంటికి వచ్చీ రావటంతోనే అతడి అత్యాచారాల్ని కళ్లారా చూశాడు.

ఆనాడు మూర్ఛ వచ్చింది మొదలు కరుణకి తరచు మూర్ఛలు రావటం ప్రారంభ మయినాయి. పండితమహాశయుడు చాలా అధైర్య పడిపోయాడు. ఏం చెయ్యటమో తోచలే దతడికి. ఈ సమయంలో నిధిలేని కొరత కొట్టొచ్చినట్లు కన్పించిం దతడికి. ఎంతో ఆలోచించి ఆలోచించి అతడు వెంటనే మహేంద్రుణ్ణి పిలుచుకు రావటానికి వెళ్లాడు. మహేంద్రుడు, రజని ఇద్దరూ వచ్చారు. మహేంద్రుడు తన చేతనయిన చికిత్సంతా చెయ్యటం మొదలెట్టాడు. కరుణ మధ్యమధ్య రజని చేతులు పుచ్చుకుని, అతి క్షీణ కంఠంతో మాట్లాడేది. పండితమహాశయుడు పశ్చాత్తాపంతో కరుణ యెదుట తనని నిందించుకుని, "నీకు చాలా కష్టం కలిగించాను తల్లీ!" అంటూ కళ్లనీళ్ళు పెట్టుకున్నప్పుడు—కరుణ అశ్రుపూరిత నేత్రాలతో, అతి హీనస్వరంతో అతణ్ణి వారించింది. నరేంద్రుడికి కబురంపమంటారా అని ఎవరైనా అడిగితే "అవసరం లేదు" అనేది. నరేంద్రుడు వచ్చినా ఊరికే కోపగించుకుంటాడని తెలుసు ఆమెకి.

ఆనాటి రాత్రి కరుణకి జబ్బు ఎక్కువయింది. రజని తలంపి దిక్కున కూర్చుంది ఏడుస్తూ. పండితమహాశయుడు ఆ గదిలో ఉండలేక, బయటకి వెళ్లి పసిపిల్ల వాడిలా వెక్కివెక్కి ఏడ్వటం మొదలెట్టాడు. నరేంద్రు డింట్లో లేడు. ఆ రోజున మాత్రం కరుణ నరేంద్రుడికి ఒక్కసారి కబురుచేయమని మహేంద్రుణ్ణి బ్రతిమాలుకుంది. నరేంద్రుడింటికి వచ్చేసరికి అతడి కళ్ళు ఎర్రగా జ్యోతుల్లా వున్నాయి. ముఖం పొంగరించి వుంది. జుట్టు రేగిపోయింది. ఇంచుమించు కొయ్యబారి పోయినట్లున్న నరేంద్రుణ్ణి అందరూ కలసి తీసుకెళ్లి కరుణ ప్రక్కన కూర్చోపెట్టారు. కరుణ కంపిత హస్తాలతో నరేంద్రుడి చేతులు పట్టుకుంది. కాని ఏమీ మాట్లాడ లేదు...... ★



Printed and Published by A. Sudhakar Rao from Yuva Press 5-9-88, Public Garden Road, Hyderabad-1.
Controlling Editor Sri "CHAKRAPANI".